




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 29 మంగళవారం | ఏప్రిల్ 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 225

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## ఉగ్రవాదులకై వేట

- చిక్కినట్టే చిక్కి నాలుగుసార్లు మిస్సింగ్..?
- ఐదురోజుల్లో నాలుగుసార్లు తప్పించుకున్న ఉగ్రవాదులు
- తీవ్రవాదుల జాడల్ని సైన్యం గుర్తించిన సైనికులు
- దక్షిణ కాశ్మీర్ అడవుల్లో తీవ్రవాదులకై సైన్యం తీవ్ర గాలింపు
- ప్రజలు, నిఘా వర్గాల సమాచారంతో ముందుకువెళ్తున్న సైన్యం

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
కశ్మీర్లో పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఇందుకు కారకులైన ఉగ్రవాదుల కోసం పారామిలటరీ బలగాలు తీవ్ర గాలింపు చేపట్టాయి. కశ్మీర్లో అడుగడుగూ గాలిస్తున్నాయి. భూమార్గంలో, వైమానిక మార్గంలో, సరస్సుల్లోనూ పడవల్లో గాలింపు చేపట్టాయి. అయితే ఇప్పటివరకూ వారిని పట్టుకోలేదు. కానీ తాజాగా ఈ ఐదు రోజుల్లోనే నాలుగు సార్లు తీవ్రవాదుల జాడల్ని సైన్యం గుర్తించినా పట్టుకునేలోపు పరారైనట్లు తెలుస్తోంది. దక్షిణ కాశ్మీర్లో ఉన్న అడవుల్లో తీవ్రవాదుల కోసం సైన్యం తీవ్ర గాలింపు జరుపుతోంది. ఈ గాలింపులో తీవ్రవాదుల జాడల్ని సైన్యం పలుమార్లు గుర్తించినట్లు తెలుస్తోంది. అయితే దగ్గరికి వెళ్లి పట్టుకునే లోపే తీవ్రవాదులు పారిపోతున్నట్లు సమాచారం. ఇలా ఐదు రోజుల్లో నాలుగు సార్లు జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు ఇండియన్ ఎక్స్ప్రెస్ కు వెల్లడించాయి. స్థానిక ప్రజలు, నిఘా వర్గాల నుంచి లభించిన సమాచారంతో గాలింపులో ఉన్న సైనికులు వారిని సమీపించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇండియన్ ఆర్మీ సంచలన ప్రకటన" ఇంకా చెప్పాలంటే ఇదో పిల్లి, ఎలుక ఆటలా మారినట్లు తెలుస్తోంది. తీవ్రవాదుల్ని పట్టుకునేందుకు అన్ని మార్గాల్లో భారీ ఎత్తున బలగాలు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో వారు కూడా అంతే అప్రమత్తంగా

## పెహల్గాం దాడి వెనుక చైనా?



2

- చైనా సాయంతోనే పహల్గాం ఉగ్రదాడి.. వెలుగులోకి సంచలన నిజాలు
- టెర్రరిస్టులు వాడిన ఫోన్లు, ఇతర సామాగ్రి చైనావే.. నిఘా వర్గాలు వెల్లడి
- చైనీస్ యాప్స్ ద్వారానే టెర్రరిస్టులు కమ్యూనికేషన్ జరిపినట్లు సమాచారం
- ముష్కరులు కాల్పులు జరిపిన చోట చైనీస్ శాటిలైట్ ఫోన్ స్వాధీనం
- ఉగ్రదాడి సమయంలో చైనా అధికారులతో చైనా ఉప ప్రధాని మంతనాలు

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో**
జమ్ము కాశ్మీర్ పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో పాకిస్థాన్- భారత్ మధ్య యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. దేశవ్యాప్తంగా ప్రజలు ప్రతీకార జ్వాలతో ఉన్నారు. పాకిస్థాన్ను దెబ్బకు దెబ్బ తీయాలన్న కసితో భారత ప్రభుత్వం ఉంది. సరిహద్దుల్లో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. యుద్ధం ఏ క్షణమైనా మొదలయ్యే అవకాశం ఉన్నట్లు నిఘా వర్గాలు వెల్లడిస్తున్నాయి. భారత్ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టంగా మారింది. ఈ క్రమంలో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. పహల్గాం ఉగ్రదాడిలో పాల్గొన్న ఐదుగురు టెర్రరిస్టులు చైనాకు చెందిన ఫోన్లు, ఇతర సామాగ్రిని వాడినట్లు నిఘా వర్గాలు తేల్చేశాయి. ఉగ్రవాదులు చైనీస్ యాప్స్ ద్వారానే కమ్యూనికేషన్ జరిపినట్లు సమాచారం. ఈ మేరకు పహల్గాంలో ముష్కరులు కాల్పులు జరిపిన చోట చైనీస్ శాటిలైట్ ఫోన్ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో చైనా సాయంతోనే పాకిస్థాన్ ఉగ్రదాడి జరిపినట్లు అంచనా వేస్తున్నారు అధికారులు. మరోవైపు భారత్- పాకిస్థాన్ వివాదంలో నేపథ్యంలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి మహ్మద్ ఇషాక్ దర్.. చైనాకు చెందిన తన కౌంటర్‌పార్ట్ వాంగ్ యీతో ఫోన్‌లో మాట్లాడారు. వీరిద్దరి మధ్య టెలిఫోన్ కన్వర్జేషన్ సుదీర్ఘంగా సాగినట్లు తెలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ తీసుకున్న కఠిన నిర్ణయాలు, పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయాలను వాంగ్ యీతో

## హెచ్చార్సీ చైర్ పర్సన్‌గా శాంతికుమారి?

- శాంత కుమారికి సీఎం రేవంత్ కీలక పదవి
- ఈనెల 30న పదవీవిరమణ చేయనున్న శాంతికుమారి
- రేవంత్ నిర్ణయాల అమలులో శక్తి మేర పని చేసిన శాంత కుమారి
- సమర్థతను దృష్టిలో పెట్టుకునే శాంతికుమారికి కీలకపదవి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ముఖ్యమంత్రి రేవంత్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. పాలనా పరంగా ప్రక్షాళన చేస్తున్న సీఎం రేవంత్ తాజాగా పలువురు సీనియర్ ఐఏఎస్‌ల బాధ్యతల్లో మార్పులు చేసారు. రాష్ట్ర నూతన సీఎస్‌గా రామకృష్ణారావును నియమించారు. దీంతో, ప్రస్తుత సీఎస్‌గా రేవంత్ ఎలాంటి బాధ్యతలు అప్పగిస్తారనే చర్చ సాగింది. ఈ నెల 30న సీఎస్‌గా పదవీ విరమణ చేసిన తరువాత శాంత కుమరికి కీలక పదవి ఇస్తారనే అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు సీఎం రేవంత్ ప్రస్తుత సీఎస్ శాంత కుమారికి కీలక పదవి ఖరారు చేసారు. రేవంత్ తాజా నిర్ణయం పాలనా పరంగా సీఎం రేవంత్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పాలనలో కీలకమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నియామకంలో రామకృష్ణారావు వైపు రేవంత్ మొగ్గు చూపారు. తాజాగా జరిగిన ఐఏఎస్‌ల బదిలీల్లో సీనియర్లకు స్థాన చలనం కలిగింది. సీఎంఓ లోనూ మార్పులు చేర్పులు ఖాయంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత సీఎస్ శాంత కుమారి ఈ నెలాఖరున పదవీ విరమణ చేయ నున్నారు. కేసీఆర్ హయాంలో సీఎస్‌గా నియమితులైన శాంత కుమారిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రేవంత్ కొనసాగించారు. రేవంత్ నిర్ణయాల అమలులో శాంత కుమారి శక్తి మేర పని చేసారు. సీఎస్

## నామినేటెడ్ పోస్టుల భర్తీ

- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల ప్రకటన..!
- ఉత్తర్వులు జారీ చేసిన కూటమి సర్కార్

2

**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీలో సీఎం చంద్రబాబు మరో విడత నామినేటెడ్ పోస్టుల్ని భర్తీ చేశారు. ఇందులో ప్రధానంగా రాష్ట్రంలోని సహకార బ్యాంకులైన డీసీసీబీ, జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాలైన డీసీఎంఎస్ చైర్మన్ పోస్టుల్ని భర్తీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇందులో రాష్ట్రంలో పలు చైర్మన్ పోస్టుల్ని కూటమి పార్టీలకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. దీంతో కూటమిలో ఎప్పటి నుంచో నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తున్న వారికి కాస్త ఊరట దక్కినట్లయింది. రాష్ట్రంలో ఇవాళ ప్రకటించిన డీసీసీబీ చైర్మన్ పోస్టుల్లో శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్‌గా శివ్వల సూర్యనారాయణ(టీడీపీ), విశాఖ డీసీసీబీ చైర్మన్‌గా కోన తాతారావు(జనసేన), విజయనగరం డీసీసీబీ చైర్మన్‌గా కిమిడి నాగార్జున(టీడీపీ), గుంటూరు డీసీసీబీ చైర్మన్‌గా మక్కెన మల్లికార్జునరావు(టీడీపీ), కృష్ణా డీసీసీబీ చైర్మన్?గా నెట్టెం రఘురామ్(టీడీపీ), నెల్లూరు డీసీసీబీ చైర్మన్‌గా ధనుంజయరెడ్డి(టీడీపీ), చిత్తూరు డీసీసీబీ చైర్మన్‌గా అమాస రాజశేఖర్ రెడ్డి(టీడీపీ), అనంతపురం డీసీసీబీ చైర్మన్‌గా కేశవరెడ్డి(టీడీపీ), కర్నూలు డీసీసీబీ చైర్మన్‌గా డి.విష్ణువర్ధన్ రెడ్డి(టీడీపీ), కడప డీసీసీబీ చైర్మన్‌గా బి.సూర్యనారాయణరెడ్డి (టీడీపీ) కి అవకాశం ఇచ్చారు. డీసీఎంఎస్ చైర్మన్లుగా శ్రీకాకుళానికి అవినాష్ చౌదరి (టీడీపీ),

## రూ.6280కోట్లతో 285 కి.మీ రహదారులు

- కేంద్రమంత్రి చేతులమీదుగా త్వరలోనే రోడ్ల ప్రారంభం!
- మే 5న అంబర్‌పేట ఫ్లైఓవర్‌పై రాకపోకలు
- ఫ్లైఓవర్లను కేంద్రమంత్రి గడ్కరీ వర్చువల్ పద్ధతిన ప్రారంభం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో జాతీయ రహదారులతో పాటు, పలు ఫ్లైఓవర్ ల పనులు చాలా చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఎకనమిక్ కారిడార్లు, పర్యాటకాన్ని ప్రోత్సహించే వివిధ ప్రాజెక్టులు, రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేసే వివిధ ప్రాజెక్టులు ఉన్నాయి. ఇక తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 6280కోట్ల రూపాయలతో నిర్మించిన 285కిలోమీటర్ల జాతీయ రహదారులను, అంబర్ పేట ప్రాంతంలో నిర్మించిన ఫ్లైఓవర్ ను ప్రారంభించడానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రానున్నారు. అంబర్ పేట ఫ్లైఓవర్ పై రాకపోకలు మే 5వ తేదీన కేంద్ర రోడ్లు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఇవి ప్రారంభం కానున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలోని అంబర్ పేట ప్రాంతంలో నిర్మించిన ఫ్లైఓవర్ పనులు దాదాపు పూర్తి కాగా ఇప్పటికే రెండు నెలల నుంచి దీనిపైన రాకపోకలు సాగుతున్నాయి. కొనసాగుతున్న ఫ్లైఓవర్ కింద పనులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాలతో మహాశివరాత్రి

## శ్రీవారి దర్శనానికి వెళ్తూ..మృత్యు ఒడిలోకి..

- శ్రీవారి దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి
- చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, నేంద్రకుంట సమీపంలోని, కోనప్ప రెడ్డిపల్లి శివారులో ఈ ఘటన
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి

2



**తిరుపతి-నవభూమిబ్యూరో**
తిరుపతి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం కోసం వస్తూ ఐదుగురు మృత్యువాత పడిన ఘటన చోటుచేసుకుంది. కారు కంటైనర్ క్రిందకు దూసుకుపోయిన ఘటనలో అయిదుగురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలను కోల్పోయారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, నేంద్రకుంట సమీపంలోని, కోనప్ప రెడ్డిపల్లి శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఘోర రోడ్డు ప్రమాదం.. ఐదుగురు మృతి ఘోర రోడ్డు ప్రమాద ఘటన సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చనిపోయిన వారి

## మళ్లీ శాంతి చర్చలు?

- మాజీ మంత్రి జానారెడ్డి మధ్యవర్తిత్వం?
- జానారెడ్డికి సీఎం రేవంత్ కీలక బాధ్యతలు
- సీనియర్ నేత,వ్యూహకర్త కేకేతో కలిసి శాంతి చర్చలు
- కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ రీ ఎంట్రీ!



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాజకీయాల్లో కీలక సమీకరణాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పైన మాజీ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. అటు స్థానిక సంస్థల ఎన్నికల దిశగా ప్రభుత్వం లో కసరత్తు కొనసాగుతోంది. ఇటు మంత్రివర్గం- పీసీసీ విస్తరణ పైన తుది నిర్ణయం జరగలేదు. ఈ సమయంలో అనూహ్యంగా సీనియర్ నేత జానారెడ్డికి ఇంటికి వెళ్లిన సీఎం రేవంత్ కీలక మంత్రాంగం చేసారు. జానారెడ్డి అనుభవం వినియోగించుకోవాలని డిసైడ్ అయ్యారు. కొత్త బాధ్యతలు అప్పగించారు. ఈ ఎపిసోడ్ లో కాంగ్రెస్ ముఖ్య నేత దిగ్విజయ్ సింగ్ కీలక పాత్ర పోషించారు. జానా తో రేవంత్ భేటీ ముఖ్యమంత్రి రేవంత్ కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డితో కీలక మంత్రాంగం చేసారు. శాంతి చర్చల దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆపరేషన్ కగార్, శాంతి చర్చలు, కాల్పుల విరమణ తదితర అంశాలపై జానారెడ్డితో సీఎం చర్చించారు. తాజాగా సీఎం రేవంత్‌తో శాంతి చర్చల కమిటీ తెలంగాణ నేతలు భేటీ అయ్యారు. కాల్పుల విరమణ, శాంతి చర్చల అంశం పై జానారెడ్డి సలహాలు తీసుకుంటామని సీఎం తెలిపారు. అందులో భాగంగానే శాంతి చర్చలపై సీఎం రేవంత్,

## వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు

- కుప్పం, గుంటూరు, మాచర్లలో వైసీపీకి కూటమి షాకులు
- సునాయాసంగా ఈ స్థానాలను కైవసం చేసుకున్న కూటమి
- సంబరాల్లో మునిగిపోయిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

2




**అమరావతి-నవభూమిబ్యూరో**
ఏపీలో గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ దక్కించుకున్న కుప్పం, గుంటూరు, మాచర్ల మున్సిపల్ పీఠాల్ని ఇప్పుడు కూటమి సర్కార్ కైవసం చేసుకుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆయా స్థానాల్లో ఉన్న మేయర్లు, మున్సిపల్ ఛైర్మన్లు తప్పుకోవడమో, అవిశ్వాసంలో పదవులు కోల్పోవడమూ జరిగింది. దీంతో ఈ సీట్లను ఎన్నికల ద్వారా కూటమి సర్కార్ తమ ఖాతాలో జమ చేసుకుంది. ముందుగా సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో ఇవాళ జరిగిన మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో పలువురు వైసీపీ సభ్యులు టీడీపీవైపు ఫిరాయించారు. దీంతో ఐదో వార్డ్ కౌన్సిలర్ సెల్వరాజ్ కూటమి తరఫున మున్సిపల్ ఛైర్మన్ గా ఎన్నికయ్యారు. వైసీపీ నుండి నలుగురు కౌన్సిలర్లు టీడీపీ వైపు ఫిరాయించారు. దీంతో 24 మంది సభ్యులలో 14మంది మద్దతుతో పాటు ఎక్స్ ఆఫిషియో మెంబర్ మద్దతు కూడా లభించడంతో టీడీపీ సునాయాసంగా ఛైర్మన్ పీఠం దక్కించుకుంది. ' అటు గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠం కూటమి కైవసం అయింది. ఇవాళ జరిగిన మేయర్ ఎన్నికల్లో కూటమికి 34 ఓట్లు, వైసీకి 27 ఓట్లు వచ్చాయి. దీంతో టీడీపీ

## యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

- పవర్ ప్లాంట్‌లోని మొదటి యూనిట్లో మంటలు..నిలిచిన విద్యుదుత్పత్తి..
- దిగువన వెల్డింగ్ పనులు కొనసాగుతున్న క్రమంలో లీకైన ఆయిల్..
- ఎగిసిపడ్డ మంటలు..మంటలు ఆర్పుతున్న అగ్నిమాప దళాలు

2



**నల్లగొండ-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లా దామరచర్లలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నేడు తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో చోటు చేసుకున్న ఈ అగ్నిప్రమాదంలో పవర్ ప్లాంట్‌లోని మొదటి యూనిట్లో మంటలు చెలరేగాయి. మొదటి యూనిట్ లోని బాయిలర్ నుండి ఆయిల్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయని సమాచారం. యాదాద్రి పవర్ ప్లాంట్ లో అగ్నిప్రమాదం ఇక ఇదే సమయంలో దిగువన వెల్డింగ్ పనులు కొనసాగుతున్న క్రమంలో లీకైన ఆయిల్ కారణంగా మంటలు ఒక్కసారిగా ఎగసి


## హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

- సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి రూ. 2500 కోట్లు పంపించారంటూ కేటీఆర్ ఆరోపణ
- కాంగ్రెస్ నేత బత్తిన శ్రీనివాస్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు
- దీంతో కేటీఆర్‌పై 504, 505(2) కేసులు నమోదు
- ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ కె. లక్ష్మణ్‌ఈ కేసు కొట్టివేత

2



# జస్ట్ మిస్.. ఎడ్జ్‌లో ఆగిపోయింది.. లేకుంటేనా..!! పీవీ ఎక్స్‌ప్రెస్‌వే మీద కారు ప్రమాదం..!



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేపై జరిగిన ఘోర ప్రమాదం జరిగింది. ఒక కారు అతివేగంగా వచ్చి ముందువెళ్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ఫ్లైఓవర్ అంచున ఆగడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన కారణంగా ఫ్లైఓవర్ మీద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. హైదరాబాద్ కారు ప్రమాదం వెంట్రుకవాసిలో ఘోర ప్రమాదమే తప్పింది. చావు అంచుల వరకు వెళ్లి.. ఎవరో తాడేసి పైకి లాగినట్టు.. ఏమీ కాకుండా తిరిగి రావటమంటే ఇదేనేమో. భూమ్మీద నూకలు మిగిలే ఉన్నాయనాలో.. లేచిన ఘడియ బాగుందనాలో.. కారు ఎడ్జ్‌లో ఆగిపోయింది కాబట్టి ఏం కాలేదు.. లేకుంటేనా అంతెత్తు ఉన్న ఫ్లైఓవర్ నుంచి కింద పడితే.. ఇంకేమైనా ఉందా.. కారు మొత్తం తుక్కుతుక్కు అయ్యేది. కారు గురించి పక్కన పెట్టండి.. అందులో ఉన్న ప్రయాణికుల పరిస్థితి ఏంటీ..? అక్కడితో అయిపోయిందా.. అదే సమయంలో ఫ్లైఓవర్ కింద రోడ్డుపై ప్రశాంతంగా వెళ్తున్న వాహనాలపై గనక ఆ కారు పడి ఉంటే.. వాళ్ల పరిస్థితి ఎలా ఉండేది..? ఆ బీతావహ దృశ్యాలు ఊహించుకుంటేనే.. ఒళ్లు గగుర్పొడుస్తోంది. జస్ట్ ఎడ్జ్‌లో కారు ఆగిపోయింది కాబట్టి ఎలాంటి ఘోరం జరగలేదు. ఈ ప్రమాదం ఎక్కడో కాదు.. హైదరాబాద్‌లోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే మీద జరిగింది. సాదారణంగానే పీవీ ఎక్స్‌ప్రెస్ వే మీద వాహనాలు మాంచి స్పీడ్‌తో దూసుకెళుతుంటాయి. అలాగే ఓ కారు అతివేగంతో దూసుకెళ్తోంది. దాని దారిలో అది వెళ్తే ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ.. ఓవర్ స్పీడ్‌తో దూసుకొచ్చిన ఆ కారు.. ముందువెళ్తున్న మరో కారును వెనక నుంచి ఎడ్జ్‌లో ఢీకొట్టటంతో.. సినిమాల్లో చూపించినట్టుగా కారు ఢీకొట్టటంతోనే ముందు వెళ్తున్న కారు ఓవైపు పూర్తిగా పల్టీ కొట్టి చాలా దూరం దూసుకెళ్లింది.

## ఆరు నెలల క్రితమే ప్రేమ వివాహం.. కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి తాగి యువజంట మృతి



**టేకులపల్లి-నవభూమి:** కొత్తగూడెం జిల్లా టేకులపల్లిలో విషాదం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక ఆరు నెలల క్రితమే ప్రేమ పెండ్లి చేసుకున్న ఓ యువజంట ఆత్మహత్య చేసుకున్నారు. టేకులపల్లి మండలం దాస్ తండా గ్రామపంచాయతీ రేగుల తండాకు చెందిన ఇస్లావ దీపిక (19), వెంకట్యా తండాకు బోడ శ్రీను(23) ప్రేమించుకున్నారు. వారి వివాహానికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో కుటుంబాన్ని ఎదిరించి ఆరు నెలల క్రితం వివాహం చేసుకున్నారు. కొన్ని రోజులపాటు కుటుంబానికి దూరంగా ఉన్న యువజంట.. ఆ తర్వాత వెంకట్యా తండాలోని శ్రీని నివాసానికి వచ్చారు.

గత రెండు నెలలుగా కుటుంబ సభ్యులు వరకట్నం కోసం ఒత్తిడి చేస్తున్నారు. దీంతో వారిమధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీపిక ప్రస్తుతం మూడు నెలల గర్భవతి. అయితే కుటుంబ కలహాలతో విసిగిపోయిన శ్రీను.. ఈ నెల 24న కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు, ఎలకల మందు కలుపుకొని తాగాడు. తర్వాత ఈ విషయం భార్యకు తెలిపాడు. దీంతో ఆమె కూడా ఆ కూల్‌డ్రింక్ తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు భార్యాభర్తలను తొలత కొత్తగూడెం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం జిల్లా హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ దీపిక ఈనెల 25న మృతి చెందింది. తాజాగా శ్రీను కూడా ఆదివారం రాత్రి ఒంటి గంటకు చనిపోయాడు. ఎంతో ఆశతో పెద్దలను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకున్న జంట ఆరు నెలలు కూడా గడవక ముందే కుటుంబ కలహాల కారణంగా తనువులు చాలించడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## మీ సొంత పట్టణంలోనే ఉద్యోగం.. ప్రత్యేక పోర్టల్, యాప్‌ను అభివృద్ధి చేస్తున్న కేంద్రం



**హైదరాబాద్-నవభూమి:** కొవిడ్ సంక్షోభానంతరం ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చిన 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని స్ఫూర్తిగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం 'జాబ్ ఎట్ యువర్ హోమ్ టౌన్' పేరుతో ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్‌ను, మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఉద్యోగార్థులు లొకేషన్, సెక్టార్, ఎంప్లాయర్, పేస్కేల్, అససరమైన నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగాలను ఫిల్టర్ చేసుకునేందుకు కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ అభివృద్ధి చేస్తున్నది. పీఎం గతిశక్తి పోర్టల్‌లో ఉద్యోగాల డాటాను మ్యాపింగ్ చేస్తున్నది.

ఎంప్లాయర్స్‌ను, ఉద్యోగార్థులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే డిజిటల్ మార్కెట్ ప్లేస్‌లా నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) పోర్టల్ పనిచేస్తుంది. ఇప్పటికే 41 లక్షల ఎంప్లాయర్స్, కోటికిపైగా ఉద్యోగార్థులు ఎన్‌సీఎస్‌లో నమోదయ్యారు. పీఎం గతిశక్తిని ఎన్‌సీఎస్ పోర్టల్‌కు అనుసంధానం చేయడం ద్వారా ఉద్యోగావకాశాలను జియో-ట్యాగింగ్ చేస్తున్నారు. ఉద్యోగార్థులు తమకు 20-40 కి.మీ పరిధిలో ఉన్న ఉద్యోగావకాశాలను గుర్తించేలా ఓ ప్రత్యేక మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేస్తున్నారు. జమ్ముకశ్మీర్, గుజరాత్ రాష్ట్రాలు ఇప్పటికే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టాయి.

## భద్రాద్రి రామయ్య భక్తులకు ఇక ఆ టెన్షన్ అక్కర్లేదు.. అధికారులు కీలక నిర్ణయం

**భద్రాచలం-నవభూమి:** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దర్శనానికి తరలివచ్చే వేలాది భక్తులు ఆలయ పరిసరాల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో అక్కడక్కడా మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. రామాలయ సన్నిధిలో వాటి కొరత, ఉన్నవాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమస్య కొన్నాళ్లుగా కొనసాగుతుండటంతో ఆలయ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్తగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. రామాలయ అన్నదాన సత్రం సమీపంలోని స్టేడియం కింద ఉన్న శౌచాలయాలు ప్రస్తుతం వినియోగంలో లేవు. పడమర మెట్ల మార్గంలో మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా ఉన్న మరుగుదొడ్లను గతంలో ఉచితంగా వినియోగించుకునేవారు. రోజుకు 300 మందికి పైగా భక్తులు వీటిని ఉపయోగించేవారు. అయితే ఆలయ పరిసరాల్లో శౌచాలయాల నిర్వహణ సరిగా లేదనే విమర్శల నేపథ్యంలో.. ఉన్నవాటిని మెరుగుపరిచి వినియోగంలోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తాజాగా, పడమర మెట్ల మార్గంలోని మరుగుదొడ్ల నిర్వహణను 'పే అండ్ యూజ్' విధానంలో ఒక గుత్తేదారుకు అప్పగించారు. దీని ప్రకారం, గుత్తేదారు ఏడాదికి ఆలయానికి రూ. 50 వేలు చెల్లించాడు. పే అండ్ యూజ్ కింద భక్తుల నుంచి మూత్ర విసర్జనకు రూ. 5, మరుగుదొడ్డి వినియోగానికి రూ. 10 వసూలు చేస్తున్నారు. అయితే గతంలో ఉచితంగా అందుబాటులో ఉన్న మరుగుదొడ్లను ప్రైవేటు వారికి అప్పగించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, వీఐపీ మెట్ల మార్గంలోని పాత ధర్మకర్తల మండలి భవనంలో రెండు శౌచాలయాలు ఉండగా, అందులో ఒకటి మాత్రమే భక్తులకు అందుబాటులో ఉంది. మరొకటి ప్రముఖుల కోసం రిజర్వ్ చేశారు. నిత్యం వేలాది మంది భక్తులు వస్తున్నందున.. అన్ని మరుగుదొడ్లను వినియోగంలోకి తేవడంతో పాటు రద్దీగా ఉండే రామాలయం-శివాలయం మార్గం, కల్యాణ మండపం ఆవరణ వంటి ప్రాంతాల్లో అదనంగా మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. ఈ సమస్యపై స్పందించిన ఆలయ ఈఈ రవీంద్రనాథ్.. మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. వాటి నిర్వహణను గుత్తేదారుకు అప్పగించినప్పటికీ.. ఆలయ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం మరిన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అయితే ఉచిత వినియోగం రద్దు చేసి రుసుములు వసూలు చేయడంపై భక్తుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుంది.

# ఎస్సెస్సీ మెమోలపై మార్కులు, గ్రేడ్లు



**హైదరాబాద్-నవభూమి:** పదో తరగతి మార్కుల మెమోలను ఎలా ముద్రించాలన్న అంశానికి సర్కారు ఎట్టకేలకు తెరదించింది. 2024-25 విద్యాసంవత్సరానికి పదో తరగతి మెమోలపై మార్కులతోపాటు గ్రేడ్స్‌ను సైతం ముద్రించాలని నిర్ణయించింది. విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా తాజాగా ఉత్తర్వులు విడుదలచేశారు. పదో తరగతిలో ఈ విద్యాసంవత్సరం నుంచి గ్రేడింగ్ విధానాన్ని తీసేశారు. గ్రేడ్లస్థానంలో మార్కుల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ఇంటర్నల్స్‌ను రద్దుచేయాలని తీసుకున్న నిర్ణయం ఆల స్యం కావడంతో ఈ ఒక్క ఏడాదికి ఇంటర్నల్స్ ఉంటాయని ప్రకటించారు. మెమోలపై మార్కులు ఎలా ముద్రించాలన్న అంశంపై ఏర్పాటు చేసిన కమిటీ పలు సిఫారసులు చేసింది. దీంతో ఫలితాల విడుదలకు లైన్ క్లియర్ అయ్యింది. రెండు, మూడు రోజుల్లో ఫలితాలు విడుదల కానున్నాయి.

**మెమోల ముద్రణ ఇలా..**

పదో తరగతి మెమోలపై ఇంటర్నల్స్ మార్కులు, వార్షిక పరీక్షలు మార్కులుంటాయి. మొత్తం మార్కులతో పాస్ సర్టిఫికెట్ జారీచేస్తారు. గ్రేడ్లు, మార్కులను వేర్వేరుగా ముద్రిస్తారు. సబ్జెక్టులవారీగా సాధించిన మార్కు లు, గ్రేడ్లు రెండింటిని సర్టిఫికెట్‌లో ముద్రిస్తారు.

పదో తరగతిలో ఇంటర్నల్స్‌లో 20 మార్కులు కేటాయించారు. ఈ పాఠ్య కార్యక్రమాలకు కూడా గ్రేడ్లు ఇస్తారు. ఎస్సెస్సీ పాస్ సర్టిఫికెట్‌లో చూపుతారు.

పదో తరగతి వార్షిక పరీక్షలను ప్రస్తుతం ఒక సబ్జెక్టులో 80 మార్కులకు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల్లో 28 మార్కులొస్తేనే పాసైనట్టు లెక్క. ఇంటర్నల్స్‌లో ఎన్ని మార్కులొచ్చినా వార్షిక పరీక్షల్లో 28 మార్కులు సాధించాల్సిందే. హిందీలో 16 మార్కులొస్తే పాస్ అయినట్టు. మెమోలపై ప్రథమశ్రేణి, ద్వితీయశ్రేణి, తృతీయ శ్రేణి అంటూ ఏముండదు. ఎన్ని మార్కులొచ్చినా పాస్ అనే ముద్రిస్తారు.

# ఆ ఇద్దరికీ సీఎంలు అయ్యే అర్హత ఉంది..

## ఎమ్మెల్యే కోమటిరెడ్డి మరోసారి హాట్ కామెంట్స్



**హైదరాబాద్-నవభూమి:** తెలంగాణ కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవికి పోటీ పడే నాయకుల గురించి చర్చ జరగడం సహజం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. చాలా మంది సీనియర్ సీఎం పదవి కోసం పోటీ పడ్డారు. చివరకు ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని అధిష్ఠానం ఖరారు చేసింది. పార్టీలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకున్న రేవంత్.. ప్రజాకర్షణ, వాక్చాతుర్యం, పార్టీ శ్రేణుల్లో ఆయనకున్న పట్టును సానుకూల అంశాలుగా మలుచుకొని సీఎంగా బాధ్యతలు చేపట్టారు. అయితే రేవంత్ కాకుండా సీఎంగా ఎవరికి అవకాశాలున్నాయనే దానిపై తాజాగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన సీనియర్ నేతలు, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు సీఎం అయ్యే అర్హత ఉందని అన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో అదనపు బ్లాక్ భవన నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి ఈ మేరకు సంచలన కామెంట్స్ చేశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డిలకు ముఖ్యమంత్రి అయ్యే అర్హత 100 శాతం ఉందని చెప్పారు. ఈ ఇద్దరి నాయకత్వంలో జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకుంటున్నామని చెప్పారు. కాగా, గతంలోనూ ఇదే తరహా కామెంట్స్ రాజగోపాల్ రెడ్డి చేశారు. తాజాగా ఆయన చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్ పార్టీలో చర్చకు దారి తీశాయి. ఇక ఇదే సమావేశంలో పాల్గొని ప్రసంగించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. బీఆర్ఎస్ పదేళ్ల పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఒకే కుటుంబం పదేళ్లు పాలనలో ఉండి రాష్ట్రాన్ని నాశనం చేసిందని ఆరోపించారు. కుటుంబ పాలన, అవినీతితో రాష్ట్రాన్ని దివాలా తీయించారని పేర్కొన్నారు. సాగునీటి రంగంలో రూ. 1.81 లక్షల కోట్లు ఖర్చు చేసి, బీఆర్ఎస్ నేతలు వ్యక్తిగత లాభాలు పొందారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నాణ్యతలో లోపం రావడం, మూడేళ్లలోనే నిర్మాణాలు ధ్వంసం కావడం నేతల కమీషన్ పాలిటిక్స్ కారణమని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు ఖర్చు చేసిన మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలు పనికిరావని NSDA నివేదికలో పేర్కొనిందని గుర్తు చేశారు.

# మళ్లీ శాంతి చర్చలు?

**(1వపేజీ తరువాయి)** జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డి చర్చించారు. అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌తో సీఎం ఫోన్లో మాట్లాడారు. గతంలో ఏపీ పార్టీ ఇంచార్జీగా దిగ్విజయ్ సింగ్ ఉన్న సమయంలోనే శాంతి చర్చలు జరిగాయి. జానా అనుభవంతో శాంతి చర్చలు, కాల్పుల విరమణకు సంబంధించి జానా రెడ్డికి మంచి అనుభవం ఉంది. గతంలో చర్చలు జరిగిన సమయంలో జానా రెడ్డి హోంమంత్రిగా ఉన్నారు. చర్చల్లో జానారెడ్డి చాలా కీలకమైన పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో ఈ అంశాలకు సంబంధించి కాంగ్రెస్ సీనియర్ నేత సలహాలు, సూచనలు తీసుకుంటామని శాంతి చర్చల కమిటీకి సీఎం తెలిపారు. ఇందులో భాగం గానే జానారెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి కలిసి ఈ అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఆపరేషన్ కగార్‌పై సీఎం జానారెడ్డితో పాటుగా కేశవ రావు సేవలు వినియోగించుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ వెల్లడించారు. కాగా, బీఆర్ఎస్ సభలోనూ మాజీ సీఎం కేసీఆర్ ఇదే అంశం పైన తన అభిప్రాయం వెల్లడించారు. శాంతి చర్చలు జరగాలని మావోయిస్టులు డిమాండ్ చేస్తున్నారని, శాంతి చర్చలు జరపాలని..కాల్పుల విరమణను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి పార్టీ అధ్యక్షుడిగా, ప్రతిపక్ష నేతగా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని సభలో కేసీఆర్ ప్రకటించారు. సీఎం రేవంత్ సైతం మావోయిస్టుల సమస్యను శాంతిభద్రతల అంశంగా పరిగణించడం లేదని, ఇదొక సామాజిక అంశంగా పరిగణిస్తున్నామని తెలిపారు. మావోయిస్టులు డిమాండ్ చేస్తున్న శాంతి చర్చలు, కాల్పుల విరమణపై తెలంగాణ ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకున్నట్లైతే మిగిన రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా దీని ప్రభావం పడనుంది. మిగిలిన రాష్ట్ర ప్రభుత్వాలు కూడా త్వరితగితిన స్పందిస్తే శాంతి చర్చల అంశం తెరమీదకు రానుంది. కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి పెరిగే అవకాశం ఉండటంతో శాంతి చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇప్పుడు తమ వద్దకు వచ్చిన ప్రతిపాదనలు పార్టీ అధినాయకత్వానికి నివేదిస్తామని రేవంత్ స్పష్టం చేసారు.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

**(1వపేజీ తరువాయి)** పడ్డాయని సమాచారం. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకున్న సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన రంగ ప్రవేశం చేసి మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నం చేశారు. ఈ అగ్ని ప్రమాద ఘటనలో కొన్ని కేబుల్స్ కాలిపోగా ఎవరికి ఎటువంటి ప్రాణహాని జరగలేదు. థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ 1 ట్రయల్ రన్ లో అపశ్రుతి అగ్నిమాపక సిబ్బంది శ్రమించి ఫైనల్ గా మంటలను అదుపులోకి తీసుకు రాగలిగారు. ఈ సంఘటన కారణంగా మొదటి యూనిట్లో 600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ 1 ప్రారంభించడానికి అధికారులు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఇక ఈ దుర్ఘటన పైన దర్యాప్తు చేస్తున్న సీనియర్ పోలీస్ అధికారి పిటిఐకి తెలిపిన వివరాల ప్రకారం ఎలాంటి ప్రాణ నష్టం లేదు నల్గొండ జిల్లాలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యొక్క యూనిట్ ఒకటిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. ఇది తెల్లవారుజామున ఒంటిగంట, ఒకటిన్నర ప్రాంతంలో సంభవించిందని, ఈ ఘటనలో కొన్ని కేబుల్స్ మాత్రమే కాలిపోయాయి అని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్టు వెల్లడించారు. అసలు అగ్ని ప్రమాదానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. %ూాణ ూాశ్రీంశీ =ఘుం% రాష్ట్రంలో అప్రకటిత కరెంట్ కోతలు ఎక్కడున్నాయో చూపించండి! యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ఫిబ్రవరిలోనూ ప్రమాదం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కు ఐదు యూనిట్లు ఉన్నాయి. ఎనిమిది వందల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉంది. గత ఏడాది యూనిట్ రెండు పూర్తి కాగా, ఇక ప్లాంట్లో కొనసాగుతున్న మొత్తం పనులు 2025 మధ్య నాటికి పూర్తవుతాయని గతంలోనే ప్రకటించారు. ఇదిలా ఉంటే ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా యాదాద్రి పవర్‌ప్లాంటులో ప్రమాదం జరిగింది. యాష్ ప్లాంట్ ఈఎస్‌పీ వద్ద ఆరుగురు కార్మికులు కాలిన బూడిద పడటంతో తీవ్రంగా గాయాల పాలయ్యారు.

## హైకోర్టులో కేటీఆర్‌కు ఊరట

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్‌పై నమోదైన కేసును తెలంగాణ హైకోర్టు సోమవారం కొట్టివేసింది. ఇరువైపులా వాదనలు విన్న తర్వాత ఈ కేసును జస్టిస్ కె. లక్ష్మణ్ కొట్టివేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పార్టీ అధిష్టానానికి రూ. 2500 కోట్లు పంపించారంటూ కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తిన శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి.. బంజారాహిల్స్ పోలీసులకు పంపారు. దీంతో కేటీఆర్‌పై 504, 505(2) కేసులు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సికింద్రా బాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మున్సిపల్ శాఖను సీఎం రేవంత్ రెడ్డి తన ఆధీనంలో ఉంచుకొన్నారని ఆరోపించారు. ఆయనకు ముడుపులు చెల్లిస్తేనే భవనాలకు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. అలా వసూల్ చేసిన నగదు రూ 2500 కోట్లు ఢిల్లీలోని పార్టీ పెద్దలకు పంపారని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఉగ్రవాదులకై వేట

**(1వపేజీ తరువాయి)** అంటూ స్థావరాలు మార్చేస్తున్నట్లు సమాచారం. దీంతో తీవ్రవాదుల జాడ కనిపెట్టడం కష్టసాధ్యంగా మారుతోంది. పహల్గాంలో దాడి తర్వాత భారత్-పాక్ సరిహద్దు అయిన నియంత్రణ రేఖ వద్ద గస్తీ భారీగా పెరగడంతో తీవ్రవాదులు అటువైపు వెళ్లేందుకు సాహసించడం లేదు. దీంతో అడవుల్లోనే తిరుగుతూ భద్రతా బలగాల నుంచి తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.

## హెచ్చార్సీ చైర్ పర్సన్‌గా శాంతికుమారి?



**(1వపేజీ తరువాయి)** నియామకం ఈ నెలాఖరులో శాంత కుమారి పదవీ విరమణ ఉండటంతో.. తొలుత మరో మూడు నెలల వరకు పొడిగించే అవకాశం ఉందని భావించారు. అయితే, ఇప్పుడు శాంత కుమారి ఈ నెలాఖరున తన బాధ్యత నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యారు. కొత్తగా సీఎస్ గా బాధ్యతలు స్వీకరించనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి రామకృష్ణారావు 1990 బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన వారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ఆర్థిక శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రామకృష్ణారావు వచ్చే ఆగస్టులో రిటైర్ అవనున్నారు. ఇక, 1989 ఐఏఎస్ బ్యాచ్?కు చెందిన శాంతి కుమారి 2023 జనవరి 11వ తేదీ నుంచి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ కొత్త సీఎస్ విషయంలో తీసుకునే నిర్ణయం పైన కొద్ది రోజులుగా అధికార వర్గాల్లో చర్చ సాగుతోంది.

## రూ.6280కోట్లతో 285 కి.మీ రహదారులు

**(1వపేజీ తరువాయి)** పండుగ నుంచి అంబర్ పేట ఫ్లైఓవర్ పైన వాహనాల రాకపోకలకు అనుమతి లభించగా అప్పటి నుండి వాహనాల రాకపోకలు కొనసాగుతు న్నాయి. అయితే అంబర్ పేట ఫ్లైఓవర్ కింది భాగంలో కొన్ని పనులు ఇంకా పూర్తి కావలసి ఉంది. ఫ్లైఓవర్ కింద రోడ్డు నిర్మాణం, గ్రీనరీ, ఇతర సుందరీకరణ పనులు సాగుతున్నాయి. వర్చువల్ విధానంలో కేంద్రమంత్రి ప్రారంభం హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల ఇబ్బందుల దృష్ట్యా అంబర్ పేట ఫ్లైఓవర్ నిర్మించినట్టు, దీనివల్ల కాస్త ఆ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. 5న స్థానిక మున్సిపల్ మైదానంలో సభ నిర్వహించడంతోపాటు అక్కడినుండే నగరంలో పూర్తయిన వివిధ ఫ్లై ఓవర్ బ్రిడ్జి లను వర్చువల్ విధానంలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఫ్లై ఓవర్స్, నేషనల్ హైవేస్ పురోగతికి తార్కాణం అలాగే 285 కిలోమీటర్ల జాతీయ రహదారులను ప్రారంభించి జాతికి అంకితం చేస్తారని కిషన్ రెడ్డి వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం 6280 కోట్ల రూపాయలతో నిర్మించిన జాతీయ రహదారులను, ఫ్లై ఓవర్లను కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ప్రారంభించడం తెలంగాణ రాష్ట్రంలోని నేషనల్ హైవేస్ పురోగతికి తార్కాణంగా నిలుస్తుంది.

## పెహల్గాం దాడి వెనుక చైనా?

**(1వపేజీ తరువాయి)** చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో భారత్ కు భయపడి పాకిస్థాన్ అండకోసం చైనా వద్దకు వెళ్తోందని నిఘా వర్గాలు భావిస్తున్నాయి.

## నామినేటెడ్ పోస్టుల భర్తీ

**(1వపేజీ తరువాయి)** విశాఖలో కొట్ని బాలాజీ (టీడీపీ), విజయనగరానికి గొంప కృష్ణ (టీడీపీ), గుంటూరుకు వద్రాణం హరిబాబు (టీడీపీ), కృష్ణాకు బండి రామకృష్ణ (జనసేన), నెల్లూరుకు గొనుగోడు నాగేశ్వరరావు (టీడీపీ), చిత్తూరుకు సుబ్రమ ణ్యం నాయుడు (టీడీపీ), అనంతపురానికి నెట్టెం వెంకటేశ్వర్లు (టీడీపీ), కర్నూలుకు నాగేశ్వర యాదవ్ (టీడీపీ), కడప జిల్లాకు యర్లగుండ్ల జయప్రకాష్ (టీడీపీ)కి ఇచ్చారు.

## శ్రీవారి దర్శనానికి వెళ్తూ..మృత్యు ఒడిలోకి..

**(1వపేజీ తరువాయి)** మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. అయితే ఈ రోడ్డు ప్రమాద ఘటనలో మృతి చెందిన వారు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రిలో చికిత్స తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరిన ఏడుగురు వ్యక్తులు పాకాల వద్ద ఒక కారును ఓవర్టేక్ చేయబోయి అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కంటైనర్ కిందకి దూసుకు వెళ్లారని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు కాగా ఐదుగురు స్పాట్లోనే ప్రాణాలను కోల్పోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన ఒక వృద్ధుడిని, ఒక చిన్నారిని సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి ప్రస్తుతం చిన్నారి పరిస్థితి కూడా విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. ఇక తిరుపతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం పైన సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పాకాల మండలం తోటపల్లి వద్ద కంటైనర్‌ను కారు ఢీ కొన్న ఘటనలో ఐదుగురు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని జిల్లా అధికారులను సిఎం ఆదేశించారు. %ూాశ్రీంశీ =ఘుం% కేంద్రం అదిరిపోయే శుభవార్త.. కేంద్రమంత్రి చేతులమీదుగా త్వరలోనే ప్రారంభం! చంద్రబాబు కీలక ఆదేశం క్షతగాత్రులకు రుయా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్టు అధికారులు తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా సాయం అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. సిఎం ఆదేశాలతో రోడ్డుప్రమాదం జరిగిన ప్రాంతాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజులు పరిశీలించారు. కలెక్టర్, ఎస్పీ ప్రమాదం గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు

## వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు

**(1వపేజీ తరువాయి)** కౌన్సిలర్ కోవెలమూడి రవీంద్ర మేయర్ గా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. దీంతో టీడీపీ సంబరాల్లో మునిగిపోయింది. గతంలో మేయర్ గా ఉన్న కావటి మనోహర్ నాయుడు రాజీనామా చేయడంతో ఇక్కడ మేయర్ ఎన్నిక జరిగింది. మరోవైపు పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల్లోనూ కూటమి ఘన విజయం సాధించింది. మాచర్ల మున్సిపాలిటీలో 31 వార్డులు ఉండగా.. ఇందులో 21 మంది కౌన్సిలర్ల మద్దతుతో టీడీపీ చైర్మన్ పీఠం దక్కించుకుంది. టిడిపి బలపరిచిన అభ్యర్థి 27 వార్డు కౌన్సిలర్ షేక్ మదార్ సాహెబ్ ఛైర్మన్ పీఠం అధిష్టించబోతున్నారు. గతంలో మాచర్లలో ఏకపక్షంగా ఛైర్మన్ పీఠం దక్కించుకున్న వైసీపీకి ఇది గట్టి ఎదురుదెబ్బగా మారనుంది.



## పెరుంగులమ్ రిజర్వాయర్‌లో వలస పక్షుల సందడి..



**న్యూఢిల్లీ-నవభూమి:** పెరుంగులమ్ రిజర్వాయర్‌కు ఈ ఏడాది భారీగా వలస పక్షులు తరలివచ్చాయి. ప్రతి ఏడాది ఈ రిజర్వాయర్‌కు వలస పక్షులు తరలిరావడమనేది సాధారమే అయినా.. ఈసారి భారీ సంఖ్యలో రావడం విశేషం. స్థానిక పక్షులకుతోడు, విదేశాల నుంచి భారీగా వచ్చిన వలస పక్షులు పెరుంగులమ్ రిజర్వాయర్‌లో సందడి చేస్తున్నాయి. రిజర్వాయర్‌ను వీక్షించేందుకు వస్తున్న పర్యాటకులకు ఈ పక్షులు కనువిందు చేస్తున్నాయి. పెరుంగులమ్ పక్షుల సందడికి సంబంధించిన దృశ్యాలను కింది వీడియోలో చూడవచ్చు.ఈ పక్షుల సందడిపై స్థానిక పక్షి ప్రేమికుడు థామస్ మాతి బాలన్ స్పందించారు. వేసవిలో అన్ని చెరువులు, రిజర్వాయర్‌లు దాదాపు ఎండిపోతాయని, కానీ పెరుంగులమ్ రిజర్వాయర్ మాత్రం ఎండిపోదని చెప్పారు. పెరెన్నియల్ తమిరంబరని నది ద్వారా ఈ రిజర్వాయర్‌కు నీళ్ల వస్తాయని తెలిపారు. నైరుతి, ఈశాన్య రుతుపవనాల సందర్భంగా ఈ రిజర్వాయర్‌లోకి భారీగా నీరు చేరుతుందన్నారు. అందుకే వేసవి వచ్చిందంటే ఇక్కడి పెద్ద సంఖ్యలో వలస పక్షులు తరలి వస్తాయని చెప్పారు.ప్రతి ఏడాది వేల సంఖ్యలో పక్షులు ఇక్కడ సందడి చేస్తాయని, ఈసారి మాత్రం అంతకంటే ఎక్కువగా వచ్చాయని థామస్ తెలిపారు. తాను రిజర్వాయర్‌లో ఇంత భారీ సంఖ్యలో వలస పక్షులను చూడటం ఇదే తొలిసారని అన్నారు. ఈ రిజర్వాయర్‌లో నీటితోపాటు వృక్షసంపదను, జంతుజాలాన్ని రక్షించాల్సిన బాధ్యత కేరళ ప్రభుత్వంపై ఉన్నదని, అందుకోసం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## వాలీబాల్ ప్లేయర్ వికృత రూపం.. వందల మంది అమ్మాయిలతో..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రేమ పేరుతో అమ్మాయిలు, బాలికల జీవితాలతో ఆడుకునే మోసగాళ్లకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. అమాయక ఆడపిల్లలు మోసగాళ్ల తప్పుడు బుద్ధి తెలియక వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మానసికంగా, శారీరకంగా కూడా ఎంతో నష్టపోతున్నారు. తాజాగా, ఓ వాలీబాల్ ప్లేయర్ ఓ అమ్మాయిని వేధించాడు. ఈవిషయం తెలిసి.. అతడిపై అమ్మాయి తరపు వారు దాడి చేశారు. అతడి ఫోన్ లాక్కుని చూడగా వందల కొద్ది పాడు వీడియోలు బయటపడ్డాయి. వాలీ బాల్ ప్లేయర్ చాలా మంది అమ్మాయిలతో అభ్యంతరకర స్థితిలో ఉన్న దృశ్యాల తాలూకా వీడియోలు అవి. వాటిని చూసి అందరూ షాక్ అయ్యారు. అతడ్ని పోలీసులకు పట్టించారు.ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. దక్షిణ కన్నడ, కర్కలకు చెందిన సయ్యద్ అనే యువకుడు బెల్తన్‌గాడీలోని ఓ ప్రైవేట్ కాలేజీలో చదువుతున్నాడు. అతడు వాలీ బాల్ ఆట కూడా ఆడతాడు. సయ్యద్ గత కొంత కాలంనుంచి ఓ విద్యార్థినిని మెసేజ్ల ద్వారా వేధిస్తూ ఉన్నాడు. దీంతో అమ్మాయి తరపు వారు రంగంలోకి దిగారు. అతడిపై దాడి చేశారు. అతడి దగ్గరినుంచి సెల్ ఫోన్ లాక్కున్నారు. దాన్ని ఓపెన్ చేసి చూడగా.. అతడు వేరే అమ్మాయిలతో కలిసి ఉన్న పర్సనల్ ఫొటోలు, వీడియోలు బయటపడ్డాయి. అవి చూసి వారు షాక్ అయ్యారు.తర్వాత సయ్యద్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు అతడిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలోనే సయ్యద్ కూడా తనపై దాడి చేసిన వారిపై కేసు పెట్టాడు. రెండు వర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ఫొటోలు, వీడియోలు ఉన్న సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు. ఇక, సయ్యద్ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. అతడి ఫోనులో వీడియోలు బయటపడ్డాయన్న వార్త మీడియాతో పాటు సోషల్ మీడియాలోనూ రచ్చ చేస్తోంది.

## భరత్ భూషణ్ భార్య సుజాతను విచారించిన ఎన్ఐఏ



**బెంగళూరు-నవభూమి:** పెహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో బెంగళూరుకు చెందిన భరత్ భూషణ్ మరణించిన నేపథ్యంలో ఆయన భార్య సుజాతను సోమవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఉన్నతాధికారులు విచారించారు. ఈ విచారణలో భాగంగా ఆమెను ఎనిమిది గంటల పాటు ప్రశ్నించారు. మీరు కాశ్మీర్ ఎందుకు వెళ్లారు?. ఏ సమయానికి మీరు అక్కడికి చేరుకున్నారు?. ఏ సమయంలో ఉగ్రవాదులు మీరున్న ప్రదేశానికి వచ్చారు?. ఆ సమయంలో భరత్ భూషణ్ ఎక్కడున్నారు?. వాళ్లు మీ వద్దకు వచ్చిన వెంటనే ఏ భాషలో మాట్లాడారు? ఉగ్రవాదుల ముఖాలపై ఏమైనా గుర్తులు లాంటావి ఏమైనా ఉన్నాయా? వాళ్లు ఎలా ఉన్నారు? వాళ్లు ఏ అంశంపైన అయినా మాట్లాడారా? వాటికి మీరు ఏ విధంగానైనా స్పందించారా?. అలాగే వాళ్ల దుస్తులపై సైతం ప్రశ్నలు సంధించారు. అంతేకాదు ఉగ్రదాడికి పాల్పడిన ఊహచిత్రాలను సైతం భరత్ భూషణ్ భార్య సుజాత ఎదుట ఉంచారు. మరోవైపు.. రెవెన్యూ శాఖకు చెందిన అధికారులు.. భరత్ భూషణ్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భగా అతడి డెత్ సర్టిఫికేట్, ఆధార్, పాన్ కార్డుతోపాటు బ్యాంక్ అకౌంట్ వివరాలను తీసుకు వెళ్లారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన కర్ణాటక వాసులకు రూ. 10 లక్షల నష్టపరిహారాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. ఈ ఘటన వెనుక పాకిస్థాన్ ఉందని భారత్ స్పష్టం చేసింది. అందులోభాగంగా పాకిస్థాన్‌పై ఆంక్షలు విధించింది. దీంతో గతంలో పాక్‌తో చేసుకొన్న సింధూనదీ జలాల ఒప్పందాన్ని భారత్ రద్దు చేసింది. అలాగే భారత్‌లో పర్యటిస్తున్న పాక్ జాతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లాలంటూ గడువు సైతం విధించింది. ఇక పాక్ సైతం ఇదే రీతిలో స్పందించింది. దాంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## అడిగినంత పనీర్ వేయలేదని పెళ్లి మండపంలో దారుణం..



**న్యూఢిల్లీ-నవభూమి:** పెళ్లి వేడుకలో మూడు ముళ్ల తంతు గురించి పక్కన పెడితే.. జనాలు పదే పదే మాట్లాడుకునే విషయం వంటలు. వంటలు అద్భుతంగా ఉన్నా.. తిని పేర్లు పెట్టడం ఓ ఆనవాయితీగా వస్తోంది. అయితే, పెళ్లి మండపాల్లో గొడవలకు కారణమయ్యే విషయాల్లో వంటలు టాప్‌లో ఉంటాయి. వెజ్ కావచ్చు.. నాన్ వెజ్ కావచ్చు.. తమకు నచ్చినంత వడ్డించలేదని గొడవలు పడేవారు ఎక్కువ. తాజాగా, ఓ వ్యక్తి పనీర్ కర్రీ కోసం పెళ్లి మండపంలో అలజడి సృష్టించాడు. మినీ బస్సుతో మండపంలో నానా రచ్చ చేశాడు. ఈ ఘటనలో 6 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్‌లో శనివారం చోటుచేసుకుంది.సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. ఉత్తర ప్రదేశ్ వారాణాసిలోని పహాడీ గ్రామానికి చెందిన రాజనాథ్ యాదవ్ కూతురి పెళ్లి హమీద్ పూర్‌లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో శనివారం పహాడీ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో బంధుజనం హమీద్ పూర్ చేరుకున్నారు. రాత్రి విందులో మినీ బస్ డ్రైవర్ ధరేంద్ర యాదవ్ కూడా పాల్గొన్నాడు. తనకు ఇష్టమైన పనీర్ కర్రీని ఇంకా కొంచెం ఎక్కువ వేయాలని వడ్డిస్తున్న వారిని అడిగాడు. ఇందుకు వాళ్లు ఒప్పుకోలేదు. దీంతో ధరేంద్ర వారితో గొడవపడ్డాడు. అయినా వాళ్లు ఒప్పుకోలేదు. కొద్దిసేపటి తర్వాత పెళ్లి కూతురు తండ్రి అక్కడికి వచ్చాడు.పెద్ద గరిటెతో అతడి తలపై కొట్టాడు. ధరేంద్ర కోపంగా అక్కడినుంచి బయటకు వెళ్లిపోయాడు. ఒక ఐదు నిమిషాల తర్వాత మినీ బస్సుతో పెళ్లి మండపంలోకి దూసుకువచ్చాడు. మినీ బస్సుతో మండపంలో రచ్చ రచ్చ చేశాడు. బస్సు దాడి కారణంగా ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిలో పెళ్లి కొడుకు తండ్రి, పెళ్లి కూతురి చిన్నాన్న కూడా ఉన్నారు. గాయపడ్డ ఆరుగురిని ఆస్పత్రికి తరలించారు. భీభత్సం సృష్టించిన తర్వాత ధరేంద్ర బస్సుతో సహా అక్కడినుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# పాక్ సర్కార్, ఐఎస్ఐల అక్రమ సంతానమే లష్కరే తొయిబా.. ఓవైసీ ఫైర్



**హైదరాబాద్ - నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో %గా×వీ×వీ% అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాకిస్థాన్‌పై మరోసారి వతీవ్ర విమర్శలు గుప్పించారు. 'లష్కరే తోయిబా అనే ఉగ్రవాద సంస్థ పాకిస్తాన్ ప్రభుత్వం, ని గూఢచార సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ అక్రమ సంతానమని ఆరోపించారు. పాకిస్థాన్‌ను ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ గ్రే లిస్ట్‌లో ఉంచేలా భారత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా మనీలాండరింగ్, ఉగ్రవాద నిధుల పర్యవేక్షణ కోసం పనిచేసే ఎఫ్ఏటీఎఫ్.. బ్లాక్, గ్రే లిస్ట్‌లోని దేశాలపై చర్యలను సూచిస్తాయి. 'కశ్మీర్ భారత్‌లో అంతర్భాగం . కశ్మీరీలు కూడా భారత్‌కు అంతర్భాగమే. ఉగ్రవాదులతో పోరాడుతూ ఎవరు ప్రాణాలు కోల్పోయారు? గాయపడిన వారిని భుజాన వేసుకొని ఎవరు నడిచారు? కశ్మీరీలపై ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం జరుగుతోంది... మనమంతా ఏకతాటిపై ఉండాలి. పాకిస్థాన్, ఐఎస్, లష్కరే తొయిబా కలిసి భారత్‌లోని హిందూ, ముస్లింల మధ్య వివాదాలు సృష్టించాలనుకుంటున్నారు' అని మీడియాకు సూచించారు. పాకిస్థాన్ అనేక సంవత్సరాలుగా ఉగ్రవాదులను శిక్షణ ఇచ్చి భారత్‌పై దాడులు చేయిస్తున్నదని ఒవైసీ ఆరోపించారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం భారత్‌కు పాకిస్థాన్ ఎయిర్ ఫోర్స్‌ను నిర్బంధించేందుకు, వారి ఇంటర్నెట్‌పై సైబర్ పరికరాలతో హ్యాక్ చేయడం సాధ్యమని చెప్పారు. పాకిస్థాన్ భారత్ కంటే అర్థశతాబ్దం వెనుకబడిపోయిందని, అరగంట కాదని, మా దేశం రక్షణ బడ్జెట్‌లో సగం కూడా ఈ మొత్తం బడ్జెట్ లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నేత సుప్రియా శ్రీనాథే కూడా పాకిస్థాన్‌ను తీవ్రంగా విమర్శించారు. 'అణు బాంబులు వేస్తామని పాకిస్థాన్ బెదిరిస్తోంది? మీకు తినడానికి తిండి కూడా దొరకడం లేదు, ఇంకా బాంబుల గురించి మాట్లాడుతున్నారా? 1971 గుర్తుందా? లేదంటే మీ పెద్దలను అడిగి తెలుసుకోండి... మీ స్థాయి ఏంటో తెలుసుకుని నోర్మూసుకుని కూర్చోండి. జోకర్లలా మాట్లాడొద్దు' అని ఆమె - (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు.పహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది వరకు గాయపడ్డారు. పర్యాటకులపై దాడి అనంతరం ముష్కరులు అడవుల్లోకి పారిపోగా భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు అప్పటి నుంచి వారి కోసం గాలిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే నాలుగు సార్లు చేతికి చిక్కినట్టే చిక్కి ముష్కరులు తప్పించుకున్నారు. ఓసారి భద్రతా బలగాలపై కాల్పులకు కూడా పాల్పడ్డారు. ఆపై మరోచోట భోజనం తీసుకుని పారిపోయారు. అయినా, భారత బలగాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా వారి కోసం వేట కొనసాగిస్తూనే ఉన్నాయి.

# ఇక ఏ ముఖం పెట్టుకుని రాష్ట్ర హోదా అడగాలి.. కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పవర్‌ఫుల్ స్పీచ్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై మరోసారి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పందించారు. తమ రాష్ట్రానికి వచ్చిన అతిథులను కాపాడుకోవడంలో తాను విఫలం అయ్యానని చెప్పుకొచ్చారు. కనీసం మృతుల కుటుంబాలు, క్షతగాత్రులకు క్షమాపణలు కూడా చెప్పేందుకు మాటలు రావట్లేదని వెల్లడించారు. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రా హోదా కావాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడుగుతానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అమాయక పర్యటకుల ప్రాణాలను అడ్డంగా పెట్టుకుని తాను అస్సలే రాష్ట్ర హోదాను డిమాండ్ చేయనని తెగేసి చెప్పారు.ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడిపై చర్చించేందుకు అక్కడి అసెంబ్లీ నేడు అత్యవసరంగా సమావేశం అయింది. ఈ సందర్భంగానే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ చాలా ఎమోషనల్ అయ్యారు. ఇలాంటి దాడులు గతంలో చాలానే చూశామన్నారు. కానీ బైసరన్ లోయలో ఇంత పెద్ద స్థాయిలో దాడి చేయడం మాత్రం 26 ఏళ్లలో ఇదే తొలి సారి అని వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి వచ్చిన అతిథులను కాపాడుకోవడం, వారిని సురక్షితంగా వారి ప్రాంతాలకు చేర్చడం అంతా రాష్ట్రం బాధ్యతే అని.. కానీ సీఎంగా తాను ఆ పని చేయలేక పోయనన్నారు. 26 మంది ప్రాణలు కాపాడడంలో పూర్తిగా విఫలం అయ్యానన్నారు. మృతుల కుటుంబాలు సహా క్షతగాత్రులకు బాధితులకు ఎలా క్షమాపణలు చెప్పాలో కూడా తెలియడం లేదని సీఎం ఒమబ్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తండ్రిని కోల్పోయిన పిల్లలకు, భర్తలను కోల్పోయిన భార్యలకు, హనీమూన్ కోసం వచ్చి తమలో సగభాగాన్ని కోల్పోయిన నవ వధువులకు ఏం చెప్పాలో, వారితో ఎలా మాట్లాడాలో కూడా తనకు తెలియడం లేదన్నారు. ఈ ఉగ్రదాడి తర్వాత తాను ఏ ముఖం పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్ర హోదాను డిమాండ్ చేయగలనన్నారు. తన రాజకీయాలు అంత చౌకబారువి కావంటూనే.. గతంలో రాష్ట్ర హోదా అడిగామని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా అడుగుతానని స్పష్టం చేశారు. కాకపోతే ఇప్పుడు 26 మంది చనిపోయారు కాబట్టి.. రాష్ట్ర హోదా ఇవ్వమని అడగడం చాలా సిగ్గుగా అనిపిస్తుందన్నారు.అలాగే రాష్ట్ర ప్రజలు తమకు మద్దతు ఇస్తే.. మిలిటెన్సీ, ఉగ్రవాదం పూర్తిగా అంతం అవుతాయని జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వివరించారు. దానికి ఇదే ఆరంభం అని.. ఈ ఉద్యమానికి హానీ కల్గించేదేదీ మాట్లాడకూడదు, చేయకూడదని సూచించారు. తాము మిలిటెంట్లను తుపాకులతో అదుపు చేయగలమని.. కానీ అందుకు ప్రజల మద్దతు చాలా అవసరం అన్నారు. వారంతా మద్దతిస్తే.. జమ్మ కశ్మీర్ ఇకపై చాలా ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు.

## పుట్టింది పాక్‌లో.. 19 ఏళ్లుగా ధర్మవరంలోనే.. ఇప్పుడేంటి పరిస్థితి?




**న్యూఢిల్లీ-నవభూమి:** అనుకుంటాం కానీ కొన్ని పరిణామాలు కొందరి జీవితాల్లో ఊహించని సమస్యల్ని తీసుకొ స్తాయి. అలాంటి సమస్యే 26 ఏళ్ల యువతికి వచ్చింది. ఆమె పుట్టింది పాకిస్తాన్ లోనే అయినా.. పెరిగింది భారత్ లోనే. గడిచిన 19 ఏళ్లుగా ఉమ్మడి అనంతపురం ధర్మవరం లోనే పెరిగింది. తాజాగా నెలకొన్న పరిస్థితుల్లో పాకిస్తాన్ కు తిరిగి వెళ్లేందుకు ఏ మాత్రం ఇష్టపడని ఆమె భవిష్యత్తు ఏమిటి? అన్నది ప్రశ్నగా మారింది. ఇంతకూ అసలేం జరిగిందంటే.. పాక్ లో పుట్టిన ఒక మహిళ భారత్ కు వచ్చి భారతీయుడ్ని పెళ్లాడింది. అయితే.. అనుకోని రీతిలో ఆమె తన కుమార్తెకు జనన్నాని పాకిస్తాన్ లో ఇచ్చింది. ఏడేళ్ల వయసులో భారత్ కు వచ్చేశారు. ప్రస్తుతం ఆ అమ్మాయికి 26 ఏళ్లు. ఏడేళ్ల వయసులో ఇండియాకు వచ్చేసినప్పటికీ.. ఇప్పటికి పాక్ పౌరురాలిగానే రికార్డుల్లో ఉంది. ఇంతకాలం భారత పౌరసత్వం గురించి ఆలోచించని ఆమె.. రెండేళ్ల క్రితం భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే.. ఆమె దరఖాస్తుకు అధికారుల ఆమోదముద్ర పడలేదు. తాజా పరిణామాల్లో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఆమె ఉంది. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన రంశా రఫిక్.. ఇప్పుడు పాక్ కు వెళ్లేందుకు ఇష్టం లేదు. అలా అని.. ఆమె వెళ్లకుండా ఉండేందుకు వీల్లేని పరిస్థితి. బళ్లారికి చెందిన మహబూబ్ పీరన్ అనే వ్యక్తి దేశ విభజన వేళలో పాక్ కు వెళ్లిపోయారు. అక్కడే ఆయనకు ఇద్దరు కొడుకులు.. ఇద్దరు కుమార్తెలు జన్మించారు. చిన్న కుమార్తె జీనత్ పీరన్ ధర్మవరంలోని తన చెల్లెలు కొడుకు రఫిక్ అహ్మద్ కు ఇచ్చి 1989లో పెళ్లి చేశారు. ఈ జంటకు మొదట కొడుకు పుట్టగా.. 1998లో రెండోసారి జీనత్ గర్భం దాల్చింది. ఆ సమయంలో ఆమె తండ్రికి ఆరోగ్యం బాగోలేకపోవటంతో తండ్రిని చూసేందుకు పాక్ కు వెళ్లింది. అదే సమయంలో కార్గిల్ యుద్ధం మొదలైంది. దీంతో తిరిగి వచ్చేందుకు వీలు కాలేదు. పాక్ కు వెళ్లే వేళకు గర్భవతిగా ఉన్న జీనత్ కు పాక్ లోనే ప్రసవమైంది. ఆమెకు రంశా రఫిక్ పుట్టారు. 2005లో ఆమెను తీసుకొని ధర్మవరం వచ్చేశారు జీనత్ పీరన్. పాక్ లో పుటటిన రంశా రఫిక్ కు పాక్ పౌరసత్వం వచ్చింది. తర్వాత ధర్మవరం వచ్చినప్పటికీ భారత పౌరసత్వం కోసం ప్రయత్నం చేయలేదు. 2018లో పాక్ పౌరసత్వాన్ని రెన్యువల్ చేసుకున్నారు. అది 2028 వరకు మనుగడలో ఉంది. అయితే.. రెండేళ్ల క్రితం భారత పౌరసత్వం కోసం అప్లై చేసుకుంటే రిజెక్టు చేశారు. ఇప్పుడు ఆమె పరిస్థితి ఇబ్బందికరంగా మారింది.

## మెట్రో రైల్లో ఆహారం తింటూ కెమెరాకు చిక్కిన మహిళ.. భారీ ఫైన్ వేసిన అధికారులు



**న్యూఢిల్లీ-నవభూమి:** సాధారణంగా ప్రయాణ సమయంలో ఆకలేస్తే తినడం సర్వసాధారణమే. అయితే, రూల్స్ పాటించకపోతే అధికారుల ఆగ్రహానికి గురికాక తప్పదు. తాజాగా ఓ మహిళకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఓ మహిళ మెట్రో రైల్లో ప్రయాణిస్తూ నిబంధనలను ఉల్లంఘించి ఆహారం తినింది . ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో.. అధికారులు ఆమెకు భారీ ఫైన్ వేశారు.బెంగళూరుకు చెందిన ఓ మహిళ ఈనెల 26న మాదవర స్టేషన్ నుంచి మాగడి రోడ్డు వరకూ మెట్రో రైల్లో ప్రయాణించింది. ఆ సమయంలో ఆమె రైల్లో కూర్చొని తన టిఫిన్ బాక్స్‌లోని ఆహారాన్ని తినింది. తోటి ప్రయాణికుడు ఈ విషయాన్ని గుర్తించి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. అంతే అదికాస్తా వైరల్‌గామారి మెట్రో అధికారుల దృష్టికి చేరింది. అప్రమత్తమైన అధికారులు మెట్రో నిబంధనలు ఉల్లంఘించిన సదరు మహిళను గుర్తించి ఫైన్ వేశారు. ఇవాళ ఉదయం స్టేషన్‌లో మహిళను ఆపి రూ.500 జరిమానా విధించారు. కాగా, మెట్రో ప్రాంగణంలో ఆహారం తినడం, పానీయాలు తీసుకోవడం వంటివి నిషిద్ధం. నిబంధనలు ఉల్లంఘించిన ప్రయాణికులకు అధికారులు ఫైన్ వేస్తారు.

# ఎవరీ సింగర్ నేహా సింగ్ రాథోడ్.. పహల్గామ్ ఉగ్రదాడిపై పోస్ట్‌లు పెట్టినందుకు దేశద్రోహం కేసు



**న్యూఢిల్లీ-నవభూమి:** పహల్గామ్ ఉగ్రదాడికి సంబంధించి సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టి సింగర్ నేహా సింగ్ రాథోడ్ చిక్కుల్లో పడింది. ఈ పోస్ట్‌లకు గానూ ఆమెపై దేశద్రోహం కేసు నమోదైంది. ఉగ్రదాడి నేపథ్యంలో ఆమె ఒక మతాన్ని టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ తీవ్ర వివాదాస్పదంగా మారడంతో ఆమెపై కేసు బుక్ చేశారు. ఆమె జాతి వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని.. మత ఘర్షణలను ప్రోత్సహించేలా ఉన్నాయని.. ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఈ దేశద్రోహం కేసు పెట్టారు. ఇంతకీ ఆమె ఎవరంటే?

జమ్మూ కాశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గామ్ సమీపంలోని బైసరన్ లోయల్ మంగళవారం జరిగిన ఉగ్రదాడి యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఉగ్రవాదుల మారణ హోమంలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అయ్యాయి. పైగా ఉగ్రవాదులు పురుషులను టార్గెట్ చేసుకుని దాడులు చేస్తూ.. మతం అడిగి మరీ కాల్పులు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షులు, బాధితులు వెల్లడించడం తీవ్ర దుమారానికి కారణం అయింది. ఈ నేపథ్యంలోనే ఈ ఉగ్రదాడి చేసిన ముష్కరుల భరతం పట్టాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు.. ఈ దాడి చేసిన ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా పట్టుకుని మట్టిలో కలిపేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఈ ఉగ్రదాడి గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఓ సింగర్‌పై దేశద్రోహం కేసు నమోదైంది.జానపద సింగర్ అయిన నేహా సింగ్ రాథోడ్‌పై.. ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లక్నోలో దేశద్రోహం కేసు నమోదు అయ్యింది. పహల్గామ్ ఉగ్రదాడి ఘటనపై సోషల్ మీడియాలో ఆమె ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకుని వివాదాస్పద పోస్టులు పెట్టడంతో.. ఫిర్యాదులు అందగా.. ఆమెపై కేసు బుక్ చేశారు. అభయ్ ప్రతాప్ సింగ్ అనే వ్యక్తి.. నేహా సింగ్ రాథోడ్‌పై ఫిర్యాదు చేశాడు. జాతి వ్యతిరేక వ్యాఖ్యలతోపాటు.. మతాల మధ్య చిచ్చు పెట్టేలా నేహా సింగ్ రాథోడ్ పోస్టులు ఉన్నాయని ఫిర్యాదులో ఆయన ఆరోపించారు.

**నేహా సింగ్ రాథోడ్ ఎవరు?**

నేహా సింగ్ రాథోడ్ బిహార్‌లోని జన్‌దాలో 1997లో పుట్టింది. ఆమె ఒక జానపద గాయని. భోజ్‌పురి పాటలను నేహా సింగ్ రాథోడ్ పాడుతుంది. అంతే కాకుండా ఆమె ఒక పొలిటికల్ సెటైరిస్ట్. 2018లో ఆమె కాన్పూర్ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ పట్టాను పొందింది. ఆ తర్వాత 2019లో భోజ్‌పురి పాటలు పాడడం మొదలు పెట్టి.. మొదట్లో సెల్ ఫోన్‌లో రికార్డ్ చేసి వాటిని ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేసేది. అయితే భోజ్‌పురి కవులు బికారి థాకూరి, మహేందర్ మిస్రీలు తనకు స్ఫూర్తి అని నేహా సింగ్ రాథోడ్ చెప్పేది.ఇక కరోనా సమయంలో 2020 మే నెలలో నేహా సింగ్ రాథోడ్ యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలోనే కొవిడ్-19 వైరస్ గురించి బాగా ప్రచారం చేయడంతో ఆమె బాగా పాపులర్ అయింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో తన వీడియోలను షేర్ చేసేది. 2020 అక్టోబర్ నాటికి రాజకీయ విమర్శకురాలిగా నేహా సింగ్ రాథోడ్ గుర్తింపు తెచ్చుకుంది. 2021 నాటికి ఆమె యూట్యూబ్ ఛానల్‌కు లక్ష మంది సబ్‌స్క్రైబర్లు వచ్చేశారు. బిహార్ మే కాబా, యూపీ మే కా బీ, యూపీ మే కాబా సీజన్ 2, ఎంపీ మే కాబా పాటలను నేహా సింగ్ రాథోడ్ పాడి.. మరింత పాపులర్ అయింది. అవన్నీ సోషల్ మీడియాలో బాగా హల్‌చల్ చేశాయి. 2023 జూలైలో ఓ గిరిజన కార్మికుడిపై మూత్రం పోసిన వీడియోతో ఆమె ఒక వివాదంలో ఇరుక్కుంది. తాజాగా పహల్గామ్ ఉగ్రదాడి గురించి చేసిన వ్యాఖ్యలతో ఆమె మరోసారి చిక్కుల్లో పడింది. నేహా సింగ్ రాథోడ్‌పై భారతీయ న్యాయ సంహిత చట్టం కింద కేసు బుక్ చేశారు. లక్నోలోని హజ్రత్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో కేసు రిజిస్టర్ అయింది.

# పెహల్గాం దాడి ఉగ్రవాదులను నాలుగు వైపులా గాలిస్తున్న భద్రతాదళాలు



**న్యూఢి ల్లీ -నవభూమి:** ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. ఈ ఘటనలో మొత్తంగా 26 మంది ప్రాణాలు కోల్పోగా.. ఈ మారణహోమం సృష్టించిన ముష్కరుల కోసం అప్పటి నుంచి భద్రతా బలగాలు వేట సాగిస్తూనే ఉన్నాయి. ఉగ్రవాదులు సైతం నాలుగు సార్లు చేతికి చిక్కినట్లే చిక్కి తప్పించుకుని పారిపోయారు. ఓసారి భారత బలగాలపై ఎదురు కాల్పులకు కూడా తెగ బడ్డారు. మరోచోట భోజనం చేస్తూ ఆహారం తీసుకుని తప్పించుకున్నారు. ఏప్రిల్ 22వ తేదీన జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది వరకు గాయపడ్డారు. కాల్పుల అనంతరం ముష్కరులు అడవుల్లోకి పారిపోగా భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు అప్పటి నుంచి ఉగ్రవాదుల కోసం గాలిస్తూనే ఉన్నారు. ఈక్రమంలోనే నాలుగు సార్లు ట్రాక్ చేయగా.. చేతికి చిక్కినట్టే చిక్కి తప్పించు కున్నారు. ఓసారి భద్రతా బలగాలపై కాల్పులకు కూడా తెగబడ్డారు. ఆపై మరోచోట భోజనం తీసుకుని పారిపోయారు. అయినా భారత బలగాలు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా వారి కోసం వేట కొనసాగిస్తూనే ఉన్నాయి. ఆ పూర్తి వివరాలు మీకోసం.దక్షిణ కశ్మీర్‌లోని అడవుల్లో ఉన్న ఉగ్రవాదులను పట్టుకునేందుకు భద్రతా బలగాలు విపరీతంగా కష్ట పడుతున్నాయి. ముఖ్యంగా స్థానిక ప్రజలు ఇచ్చిన సమాచారంతో ఇంటిలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తూ.. పట్టుకునేందుకు వెళ్లగా క్షణాల్లో తప్పించుకుంటున్నారు. అడవులు చిక్కగా ఉండడం, కనిపించే వాళ్లు ఉగ్రవాదులేనా కాదా అని ధ్రువీకరించుకోవాల్సి ఉండగా.. భద్రతా బలగాలు కాస్త సమయం తీసుకోవాల్సి వస్తోంది. కానీ ఉగ్రవాదులు మాత్రం అలికిడి వస్తే చాలు కాల్పులు జరుపుతూ క్షణాల్లో జారుకుంటున్నారు. వారెన్ని సార్లు తప్పించుకున్న అతి త్వరలోనే వాళ్లను పట్టుకుని తీరుతామని ఓ సైనిక అధికారి వెల్లడించారు.

ఎక్కడెక్కడ ట్రాక్ చేశారు, ఎలా తప్పించుకున్నారంటే?

అయితే తొలిసారి భద్రతా బలగాలు.. ఉగ్రవాదులను పహల్గాం తెహస్లీ వద్ద ట్రాక్ చేశారు. కానీ వీరు అక్కడకు వెళ్లేలోపే వారు మళ్లీ అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించగా.. భద్రతా బలగాలు అక్కడికి చేరుకున్నాయి. అయితే ముందుగానే విషయం గుర్తించిన ముష్కరులు.. అధికారులపై కాల్పులు జరిపి అక్కడి నుంచి తప్పించుకున్నారు. ఆ తర్వాత త్రాల్ కొండల్లో ఉగ్రవాదులు నక్కినట్లు గుర్తించగా.. అక్కడికి చేరుకునేలోపే కొకెర్నాగ్ లొకేషన్‌కు వెళ్లిపోయారు. అయితే ప్రస్తుతం వీరంతా ఆ ప్రాంతం చుట్టుపక్కలే ఉండొచ్చని అధికారలు వెల్లడిస్తున్నారు.

ముఖ్యంగా ఇక్కడి ఓ స్థానిక గ్రామంలోని ఇంట్లోకి వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకున్నాయి. అప్పుడు వారు ఆహారం తీసుకుని పారిపోయారు. అయితే ఈ విషయాన్ని నేరుగా సైనిక అధికారులే వెల్లడించారు. ఉగ్రవాదులు తరచుగా ప్రాంతాలు మారుస్తూ.. నడుస్తూనే తిరుగుతుండడం వల్ల ఆకలి, దప్పికలు, నిత్యావసర సేకరణ కోసం గ్రామాల్లోకి వెళ్తున్నారు. అక్కడే వారి సహాయకులకు చెప్పి కావాల్సినవి తెప్పించుకుంటుండగా.. హ్యూమన్ ఇంటెలిజెన్స్ లభిస్తోంది. కానీ ఉగ్రవాదులు ఈ విషయాన్ని ముందుగానే పసిగడుతూ.. చాలా జాగ్రత్తగా తప్పించుకోగల్గుతున్నారు. కానీ భద్రతా బలగాలు మాత్రం ముష్కరులను కచ్చితంగా పట్టుకుని పగ తీర్చుకుంటామని చెప్పుకొస్తున్నారు. .

## పాకిస్థాన్‌కు ఎలాంటి జవాబిస్తాడో ప్రధాని మోదీనే అడగండి : ఫరూక్ అబ్దుల్లా



**జమ్మూకశ్మీర్ -నవభూమి:** జమ్మూకశ్మీర్ లోని పహల్గాం సమీపంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపి 26 మందిని దారుణంగా చంపేశారు. మృతుల్లో 25 మంది భారతీయులు, ఒక నేపాలీ ఉన్నారు. ఈ నెల 22న జరిగిన ఈ క్రూర దాడితో దేశం యావత్తు దిగ్భ్రాంతికి గురైంది. ఈ దాడికి తామే బాధ్యులమని లష్కరే తోయిబా అనుబంధ విభాగమైన ది రెసిస్టెన్స్ ఫోర్స్ ప్రకటించింది. ఈ లష్కరే తోయిబా అనే ఉగ్రవాద సంస్థను దాయాది పాకిస్థాన్ పెంచి పోషిస్తున్నది. దాంతో ఉగ్రదాడికి ప్రతిగా పాకిస్థాన్‌కు భారత్ గట్టి సమాధానం ఇవ్వాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మీడియా ప్రతినిధులు తాము కలిసిన ప్రతి నాయకుడిని పాకిస్థాన్‌కు భారత ప్రభుత్వం ఎలాంటి సమాధానం ఇవ్వబోతోందనే ప్రశ్న అడుగుతున్నారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ ఫరూక్ అబ్దుల్లాను కూడా అదే ప్రశ్న అడిగారు. దాంతో ఆయన తనదైన శైలిలో సమాధానం చెప్పారు. పాకిస్థాన్‌కు భారత్ ఎలాంటి సమాధానం చెప్పబోతోందనే ప్రశ్న అడగాల్సింది తనను కాదని, ప్రధాని నరేంద్రమోదీని అడగాలని సూచించారు.

## ప్రమాద ఘంటికలు

మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో అన్నదాతల ఆత్మహత్యలు గత ఏడాది తొలి మూడు నెలలతో పోల్చితే ఈ సంవత్సరం అదే కాలంలో 32 శాతం పెరిగాయన్న వార్త ప్రమాద ఘంటికల్ని మోగిస్తోంది. మరాఠ్వాడా ప్రాంతంలోని 8 జిల్లాల్లో ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య 269 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అధికారిక నివేదిక ప్రకారం.. గతేడాది ఇదే కాలంలో 204 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో పోలిస్తే ఈ సారి రైతన్నల ఆత్మహత్యలు 32 శాతం పెరగడం ఆందోళనకరం. బీడ్ జిల్లాలో ఈ కేసులు అత్యధికంగా పెరిగాయి. 2024 మొదటి మూడు నెలల్లో 44 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా ఆ సంఖ్య 2025లో 71 కి పెరిగింది. అంటే 61.36 శాతం పెరిగిందన్నమాట! అన్నదాతల ఆత్మహత్యలకు పంటలు దెబ్బతినడం, పండిన చోట కూడా ధరలు గిట్టుబాటు కాక వెరసి ఆర్థిక ఇబ్బందులే కారణమని వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి డబుల్ ఇంజన్ సర్కారుగా గొప్పలు చెప్పుకొనే మహాయుతి పాలన అక్కడి రైతులను తీవ్ర కష్టాల్లోకి నెడుతున్నదని స్పష్టమవుతోంది. ఓట్ల కోసం 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని అమలు చేయకపోవడం మోసపూరితం. పంట రుణాల మాఫీకి వెంటనే చర్యలు చేపట్టాలన్న రైతాంగ ఆందోళనలు, వాటికి ప్రతిపక్షాల మద్దతు పెరుగడంతో మరాఠ్వాడా రగిలిపోతోంది.

మహారాష్ట్రలో నేడు నెలకొన్న దుస్థితి రేపు ఆంధ్రప్రదేశ్‌లో కూడా తలెత్తే ప్రమాదం పొంచివుంది. గడచిన ఖరీఫ్‌లో రాష్ట్రంలోని 466 మండలాల్లో డ్రైస్పెల్ (బెట్ట) పరిస్థితులు నెలకొనగా ప్రభుత్వం కేవలం 54 మండలాలనే కరువు గా ప్రకటించింది. అనావృష్టి, కాల్వ చివరలకు సాగు నీరందక రాష్ట్రంలోని దాదాపు మూడింట రెండు వంతుల భూభాగంలో పంటలు పూర్తిగా నాశనం కావడమో దెబ్బతినడమో జరిగింది. పులి మీద పుట్రలా తుఫాను, వరద నష్టాలు. వీటన్నిటితో పంట నష్టం సంభవించగా ఆమాత్రం పండిన పంటలకు సైతం గిట్టుబాటు ధర లేని పరిస్థితి. 2023-24 సీజన్ తో పోల్చితే 2024-25 ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు, డబ్బు చెల్లింపు మెరుగు పడినా తాజా రబీలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. వ్యాపార పంటల్లో ముఖ్యమైన మిర్చి కొనుగోళ్లు, ధర గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకుంటాయని ఘనంగా చెప్పారేతప్ప ఇంకా ఏ రైతుకూ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అసలు ఆ స్కీమ్‌కి సంబంధించిన నిర్దిష్ట మార్గదర్శకాలు కూడా ఇప్పటికీ విడుదల చేయకపోవడం పాలకుల చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. మిగిలిన పంటల ధరలు కూడా రైతుకు సానుకూలంగా లేవు.

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే ప్రమాద తీవ్రత అర్థం అవుతుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో రైతులు, కౌలు రైతులు పంట నష్టాలు, అప్పుల భారాన్ని తట్టుకోలేక తనువు చాలిస్తున్న వార్తలు వస్తున్నాయి. విషాదకరమైన ఈ పరిణామం రానున్న రోజుల్లో మరింత పెరిగే ప్రమాదమూ ఉంది. కరువు ప్రకటించిన మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడతామని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అది కూడా ఒక న్యాయవాది వేసిన పిల్ మూలంగా వచ్చిన ప్రకటనేతప్ప తనంతట తానుగా చేసింది కాదు. కరువు, వరద బాధిత రైతాంగానికి పంటల బీమా పరిహారం గానీ ఇన్‌పుట్ సబ్సిడీ కానీ చెల్లించలేదు. ఇక కేంద్రం నుండి రావలసిన వరద, తుఫాను సహాయం కూడా అంతంత మాత్రమే! అంతో ఇంతో సహాయకారిగా వున్న 'ఉపాధి' పనుల కల్పన కూడా మందగించింది. పైపెచ్చు అందులో వేతన భాగం తగ్గి, మెటీరియల్ భాగాన్ని పెంచడంవల్ల ఆపన్నులకు పనులు లభించడం లేదు. చేసిన పనులకూ దినసరి వేతనం గత ఏడాదితో పోల్చితే 52 రూపాయలు తగ్గడం దారుణమైన విషయం. వేతన బకాయిలు షరా మామూలే! రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని గ్రామీణ ప్రజలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం తనకు తాను పూనుకోకపోతే ప్రజా సంఘాలు ఉద్యమాల ముల్లుగర్రతో పొడవాలి. లేకపోతే రాష్ట్రంలోని వెనుకబడిన కరువు పీడిత ప్రాంతాల్లో మరాఠ్వాడా లాంటి దుస్థితి నెలకొనే ప్రమాదముంది!

# వాణిజ్య యుద్ధం అమెరికాకూ నష్టమే




'విమోచన దినం' పేరిట అమెరికా అధ్యక్షుడు డోనాల్ట్ ట్రంప్ ఏప్రిల్ 2న మొదలు పెట్టిన వాణిజ్య యుద్ధానికి అనేక పార్శ్వాలు ఉన్నాయి. చైనా, ఐరోపా యూనియన్, జపాన్, ఇండియా వంటి అతి పెద్ద దేశాలతోపాటు ప్రపంచంలో అతి పేద దేశమైన లెసోతో పాటు అనేక చిన్న దేశాల మీద కూడా వాణిజ్య సుంకాలు విధించాడు. ఇప్పుడంటే అమెరికా-చైనాలు దెబ్బకు దెబ్బ అన్నట్లుగా ఒకదాని మీద ఒకటి 145 శాతం సుంకాలు విధించుకున్నాయి. కాని లెసోతో మీద 50 శాతం సుంకాలు విధించే నాటికి చైనా మీద విధించిన సుంకాలు 45 శాతమే. ట్రంప్, అమెరికాల సుంకాల దెబ్బ పడని 'మిత్ర దేశం' అంటూ ఏదీ మిగలలేదు.

స్వేచ్ఛా వాణిజ్యం పేరిట ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులు ఎక్కడికైనా సంచరించడానికి కల్పించుకున్న వెసులుబాటు కూడా ధనిక దేశాల్లోని పెట్టుబడిదారీ సంక్షోభాన్ని అధిగమించడానికి అక్కరకు రాకుండా పోయింది. అందుకే ఇప్పుడు ప్రపంచాధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి అమెరికా కొత్త వ్యూహాన్ని అనుసరించాలని ట్రంప్ భావిస్తున్నాడు. సుంకాల యుద్ధం ద్వారా బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్య ఆర్థిక వ్యవస్థను కొత్త మార్గం పట్టించవచ్చని ఊహిస్తున్నాడు.అమెరికా ప్రస్తుతం అనేక దేశాలతో వాణిజ్య లోటు ఎదుర్కొంటున్నది. అంటే ఆ యా దేశాలకు అమెరికా చేసే ఎగుమతుల విలువ కన్నా ఆ యా దేశాల నుండి చేసుకుంటున్న దిగుమతుల విలువ ఎక్కువగా ఉంటుంది. దీనిని సరిదిద్దడానికే ట్రంప్ యంత్రాంగం సుంకాల పెంపును మార్గంగా ఎంచుకున్నది. అమెరికాతో వాణిజ్యం నెరపే ఏ దేశమైనా దానికి వాణిజ్య లోటు వున్నదా? మిగులు వున్నదా? అనే అంశంతో సంబంధం లేకుండా-కప్పం కట్టాల్సిందే. మాతో వ్యాపారం చేసే ఏ దేశమైనా మాకు లాభం చేకూర్చాల్సిందే అనేది ట్రంప్ వాదన. తద్వారా ప్రపంచ దేశాలతో అమెరికాకు ఉన్న భారీ వాణిజ్య లోటును పూడ్చుకోవాలని చూస్తున్నారు. వాస్తవానికి ఏ దేశానికైనా ఒక దేశంతో వాణిజ్య మిగులు ఉంటే ఇంకో దేశంతో వాణిజ్య లోటు ఉండనే ఉంటుంది. కానీ అమెరికా ప్రతి దేశంతో తనకు వాణిజ్య మిగులు ఉండాలని భావిస్తుంది. అందుకు సుంకాల విధింపును మార్గంగా ఎంచుకున్నది. అయితే ట్రంప్ వాణిజ్య వ్యూహం వికటించి అమెరికన్ స్టాక్ మార్కెట్, బాండ్ మార్కెట్ కుదేలైపోయాయి. ఈ అనూహ్య పరిణామాలతో ట్రంప్ సుంకాల అమలును 90 రోజుల పాటు వాయిదా వేశాడు. అయితే అమెరికాతో అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉన్న చైనాతో సుంకాల యుద్ధం మాత్రం తీవ్రతరంగా కొనసాగుతున్నది. మిగిలిన దేశాల మెడల మీద ఈ సుంకాల కత్తి ఇంకా వేలాడుతూనే ఉన్నది.ట్రంప్ ఏకపక్షంగా విధించిన ఈ సుంకాల పర్యవసానంగా అమెరికన్ స్టాక్ మార్కెట్ పతనాన్ని చవిచూసింది. దీని ప్రభావం బాండ్ మార్కెట్ల (అమెరికా వివిధ దేశాల నుండి తెచ్చుకున్న అప్పులకుగానూ హామీగా జారీ చేసే సార్వభౌమ తాకట్టు పత్రాల అమ్మకాలు-కొనుగోళ్లు జరిగే మార్కెట్) మీద కూడా పడింది. ఇది స్టాక్ మార్కెట్ కన్నా అత్యంత కీలకమైనది. ఇది కూడా దెబ్బతినేసరికి ట్రంప్ వెనుకడుగు వేశాడు.

సుంకాల అమలును 90 రోజులపాటు వాయిదా వేస్తున్నా, ఈ 90 రోజుల్లోగా ప్రతి దేశం వచ్చి మాతో వాణిజ్య ఒప్పందాలు చేసుకోవాల్సిందే. అప్పటిదాకా ప్రతి దేశం పది శాతం ఫ్లాట్ రేటున సుంకాలు చెల్లించాల్సిందేనని ట్రంప్ ప్రకటించాడు. అంటే మన సినిమాల్లో చూపిస్తున్నట్లు మాఫియా డాన్ ఆధిపత్యాన్ని అంగీకరించడానికి అతని ముందు మోకరిల్లి చేతిని ముద్దాడినట్లు సుంకాల తగ్గింపు కోరుకునే దేశాలన్నీ వచ్చి అమెరికన్ సామ్రాజ్య చక్రవర్తులుంగారుగా తనని తాను భావించుకుంటున్న ట్రంప్ ముందు సాగిలపడాలని కోరుకుంటున్నాడు. అయితే పది శాతం ఫ్లాట్ రేటు సుంకం మీద ఎలాంటి రాయితీ ఉండదని స్పష్టం చేశారు.

ట్రంప్ విధించిన ఈ సుంకాల మూలంగా 2024లో 2.5 శాతంగా ఉన్న సుంకాలు ఒక్కసారిగా 22 శాతానికి పెరిగాయని, 1910 తర్వాత అమెరికా విధించిన సుంకాల్లో ఇదే అత్యధికమని 'ఫిచ్' రేటింగ్ కంపెనీ పేర్కొన్నది.

చాలా దేశాలు అమెరికాతో వాణిజ్య చర్చలకు సిద్ధపడ్డాయి. కానీ చైనా మాత్రం ట్రంప్ ఆడమన్నట్లు ఆడడానికి సిద్ధపడకపోగా చైనా మీద అమెరికా ఎంత శాతం సుంకాలు విధిస్తే చైనా కూడా అమెరికా మీద అంతే సుంకాలు విధిస్తూ వచ్చింది. చైనా అమెరికన్ దిగుమతుల మీద, అమెరికా చైనా ఎగుమతుల మీద 145 శాతం సుంకాలు విధించింది. అయితే ట్రంప్ తనదే పైచేయి అని చాటి చెప్పడానికి చైనా మీద సుంకాలు 245 శాతానికి పెంచినట్లు ప్రకటించాడు. కానీ చైనా మాత్రం ఈ పెంపు 'నామ్ కే వాస్తే' తప్పితే 145 శాతానికి మించి సుంకం విధించడం సాధ్యమయ్యే పని కాదని స్పష్టం చేసింది.

ఇప్పుడు నడుస్తున్న అంతర్జాతీయ వాణిజ్యం అంతా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) విధివిధానాలకు లోబడి ఉంది. ఇది రూపొందించింది కూడా సామ్రాజ్యవాద శక్తులే. సైన్స్, టెక్నాలజీ రంగాల్లో అగ్రగామిగా ఉన్నందున డబ్ల్యుటిఓ చట్రం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని శాశ్వతంగా తాను శాసించగలనని అమెరికా భావించింది. అంతర్జాతీయంగా శ్రామికవర్గంలో ఉన్న విభజన కారణంగా పేద దేశాలు నాసిరకం సాంకేతికత కూడిన సరుకులు ఉత్పత్తి చేస్తే ఆధునిక సాంకేతికత ద్వారా తాను ఉత్పత్తి చేసే సరుకులకు మార్కెట్‌లో గిరాకీ ఏర్పడి మంచి లాభాలు సంపాదించుకోవచ్చని తలచింది. పేద దేశాలు ఎంత సాంకేతిక అభివృద్ధి సాధించినా తాము వాటికన్నా పదడుగులు ముందే ఉంటామని సామ్రాజ్యవాద దేశాలు ధీమాగా ఉండేవి. పరిశ్రమలు మాకు, వ్యవసాయం గనుల తవ్వకాలు మీకు అని వలస పాలనాకాలం నాటి విధానాన్ని మక్కీకి మక్కీగా కాదు గానీ దాదాపుగా అలాంటి నమూనానే డబ్ల్యుటిఓ ద్వారా బలహీన, పేద దేశాల మీద రుద్దారు. పనిలో పనిగా అమెరికా తన వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికి సబ్సిడీలు ఇచ్చుకునే అవకాశాన్ని అట్టేపెట్టుకున్నది.


డబ్ల్యుటిఓ చట్రం పరిధిలో కూడా శాస్త్ర సాంకేతిక రంగాలను అభివృద్ధి చేసుకుని, వాటిని పారిశ్రామిక రంగంతో అనుసంధానించుకుని సామ్రాజ్యవాద దేశాలు ఊహించినదానికన్నా వేగంగా, శీఘ్రంగా అంతర్జాతీయ వాణిజ్యంలో పై మెట్టుకు ఎదగడానికి వీలుగా రాజ్యం జోక్యం చేసుకునేందుకు అవకాశం ఉన్నది. సాంకేతిక అభివృద్ధి సాధించడానికి మానవ వనరులు, విజ్ఞానాలను అభివృద్ధి చేయడానికి రాజ్యం ప్రయత్నపూర్వకంగా, ప్రణాళికాబద్ధంగా పెట్టుబడులు పెట్టడానికి, టెక్ రంగానికి రక్షణలు కల్పించడానికి, రాజ్యం ఏ మేరకు సిద్ధపడితే ఆ మేరకు సానుకూల ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుంది. డబ్ల్యుటిఓ లో ఉన్న సంక్లిష్టతలు, ముఖ్యంగా మేథో హక్కుల విషయంలో ఉన్న అవాంతరాలన్నింటినీ అధిగమించి భారతదేశం ఫార్మాస్యూటికల్ రంగంలో ప్రపంచ అగ్రగామిగా నిలిచిందన్న అంశాన్ని మనం ఇక్కడ గుర్తుచేసుకోవాలి. అయితే మన ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాశీన వైఖరి కారణంగా మన అగ్రగామి స్థానాన్ని చైనాకు వదులుకునే దశకు చేరుకున్నాం. మందుల తయారీకి కీలకంగా అవసరమైన ఎ.పి.ఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇన్‌గ్రేడియంట్)ల ఉత్పత్తి మీద మన దేశం శ్రద్ధ పెట్టకపోవడం మూలంగా చాలా వరకు మన ఫార్మా రంగం చైనా దిగుమతుల మీదే ఆధారపడి ఉన్నది. ఎలక్ట్రానిక్స్ రంగంలో కూడా మన దృష్టి మసకబారిపోయింది. అభివృద్ధి చెందుతున్న దేశాలు-దక్షిణ కొరియా, చైనాలు సహా- సి.డాట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకుని సాంకేతిక రంగంలో శీఘ్రగతిన అభివృద్ధి చెందేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ మన పాలకులు సాఫ్ట్‌వేర్ రంగం మీద ఆధారపడితే చాలు, త్వరితగతిన అభివృద్ధి చెందుతాం అని సరిపెట్టుకున్నారు తప్పితే ఏకకాలంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలను అభివృద్ధి చేసుకోవచ్చన్న ఆలోచన చెయ్యలేదు. అందుకు కారణం పాలక వర్గాల బ్రాహ్మణవాద భావజాలమే. రెక్కల కష్టంకన్నా బుద్ధి బలమే గొప్పది అన్న శ్రమను గౌరవించలేని సంస్కృతే కారణం.ట్రంప్ సుంకాల ప్రకటన నేపథ్యంలో అంతర్జాతీయ వాణిజ్య, మీడియా రంగం మరీ ముఖ్యంగా ఫైనాన్షియల్ టైమ్స్, బ్లూమ్‌బర్గ్ తదితర పశ్చిమ దేశాల మీడియా చైనా మీద అమెరికా ప్రారంభించిన ఈ వాణిజ్య యుద్ధం అమెరికాకే ఎసరు తెస్తుందని ప్రచారం చెయ్యడం ఆసక్తికరంగా మారింది. 'ఎకనమిస్టు' పత్రిక అయితే 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అన్న ట్రంప్ నినాదాన్ని వెక్కిరిస్తూ ఈ సుంకాల యుద్ధంలో అమెరికా విల్ మేక్ చైనా గ్రేట్ ఎగైన్ (అమెరికాయే చైనాను గొప్ప శక్తిగా తీర్చిదిద్దుతుంది.) అన్న పతాక శీర్షికతో వార్త ఇచ్చింది. వాస్తవానికి వాణిజ్య యుద్ధాలు అన్ని దేశాలకూ నష్టంగా పరిణమిస్తాయని గుర్తించడం ముఖ్యం. అయితే ఏ దేశం తీవ్రంగా నష్టపోయే అవకాశం వుందనేది కూడా అంతే ముఖ్యంగా గుర్తించాల్సిన అంశం. అన్ని పక్షాలా నష్టం వాటిల్లే ఈ యుద్ధంలో ప్రధానంగా చైనా ఎక్కువగా నష్టపోతుందని ట్రంప్ అంచనా.

ట్రంప్, అతని ఆర్థిక సలహాదారులు ఈ రకమైన అంచనాకు రావడానికి గల కారణం అమెరికా చైనాకు చేసే ఎగుమతుల కన్నా రెండింతలు దిగుమతులు చేసుకుంటున్నది. కాబట్టి చైనా సరుకులు అమెరికన్ మార్కెట్‌లో అమ్ముడు పోనంత సుంకాలు విధిస్తే చైనా ఎగుమతులు దెబ్బతిని అంతిమంగా నష్టపోతుందన్న సాదాసీదా సిద్ధాంతాన్ని నమ్మడమే. అమెరికన్ మేథో మండలిలో భాగంగా వున్న విదేశాంగ వ్యవహారాల మండలి తరపున ప్రచురించే పత్రిక 'ఫారిన్ ఎఫైర్స్'లో ఆడమ్ పోజెన్ రాసిన వ్యాసాలు కానీ, అమెరికన్ ప్రధాన స్రవంతి మీడియాలో గానీ ఈ విశ్లేషణలే కనబడతాయి. కానీ వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. చైనా తన ఎగుమతులను వివిధ ప్రపంచ దేశాలకు మళ్లించుకోవచ్చు. అలాగే పెద్ద కష్టపడకుండా దేశవాళీ వినియోగాన్నే మరింత విస్తరించుకోవచ్చు. కానీ ప్రపంచంలోనే అగ్రగామి సరఫరాదారుగా ఉన్న చైనా స్థానాన్ని ప్రస్తుతం ఏ దేశమూ భర్తీ చేసే స్థితిలోగాని, స్థాయిలోగానీ లేవు. అమెరికా నుండి చైనా సోయా, నూనె విత్తనాలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను భారీగా దిగుమతి చేసుకుంటున్నది. చైనా ఈ దిగుమతులను నిలిపివేస్తే ట్రంప్‌కు బలమైన మద్దతుగల ఫ్లోరిడా, నెబ్రాస్కా వంటి రాష్ట్రాలు దెబ్బతినిపోతాయి. ఈ వాణిజ్య యుద్ధంలో అమెరికా అనూహ్యంగా నష్టపోతుంది. ఇప్పటికే చైనా అమెరికా నుండి సోయా దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. ఇండోనేషియా నుండి కావాల్సిన సోయా దిగుమతులకు ఒప్పందం కుదుర్చుకున్నది. చైనా అధ్యక్షుడు ఇండోనేషియా, వియత్నాం తదితర దేశాల పర్యటనల వెనుక ఉన్న ఉద్దేశం ఇదే. వాణిజ్య యుద్ధాల్లో మనం ఎంతో నష్టపోతున్నా ఎదుటి వాళ్లను అంతకంతా నష్టపరిచే 'సామర్థ్యం' ఏ దేశానికి ఎక్కువగా ఉంటుందో చివరికి ఆ దేశానిదే పైచెయ్యి అవుతుంది. అలాంటి 'సామర్థ్యం' ప్రస్తుతానికి చైనాకే ఉన్నదని ఆడమ్ పోజెన్ కూడా స్పష్టం చేశాడు.

ప్రస్తుతం చైనా మీద ఎక్కుపెట్టిన ఈ వాణిజ్య యుద్ధంలో యాపిల్ తదితర ఎలక్ట్రానిక్ వస్తూత్పత్తి పరిశ్రమలు దెబ్బతిని పోయే అవకాశం ఉందని గ్రహించాక ఐఫోన్లు, కంప్యూటర్లు ఉత్పత్తి చెయ్యడానికి అవసరమైన విడిభాగాల దిగుమతుల మీద 145 శాతం సుంకాలను ట్రంప్ ఉపసంహరించుకున్నాడు. చైనా-అమెరికాల మధ్య వాణిజ్య యుద్ధం కొనసాగినంత కాలం అమెరికన్ వస్తూత్పత్తి రంగం మీద వేటు కత్తి వేలాడుతూ ఉన్నట్లే.

తక్కువ సుంకాలతో అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధి సాధించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన డబ్ల్యుటిఓ శకం ముగిసిపోయిందనడానికి ట్రంప్ ప్రకటించిన సుంకాల యుద్ధమే ఒక సూచిక. చైనా, దక్షిణ కొరియా, భారత్ సహా మరిన్ని తూర్పు ఆసియా దేశాలు-ఇంకా సూక్ష్మంగా చెప్పుకోవాలంటే-ఒకప్పటి వలస దేశాలు అభివృద్ధి కావడం వలస పాలకులైన సామ్రాజ్యవాద దేశాలకు కంటగింపుగా మారింది. పతనాభిముఖంగా ఉన్నప్పటికీ ఇంకా ప్రధాన ఆర్థిక శక్తిగా ఉన్న దేశాలు అంతర్జాతీయ వాణిజ్య సరళిని పూర్తిగా తమ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చుకోవాలని ప్రయత్నించే క్రమంలో 'బొమ్మాబొరుసు' ఆట మొదలుపెట్టాయి. 'బొమ్మ పడితే మేం గెలిచినట్లు, బొరుసు పడితే మీరు ఓడినట్లు' అన్న తొండాట ఆడడానికి పూనుకున్నాయి. సామ్రాజ్యవాద శక్తులు ఈ వాణిజ్య యుద్ధంలో గెలిచే అవకాశాలు లేవు కానీ అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు, ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లేలా చేస్తాయి. ఈ సాకుతోనే ప్రపంచ దేశాలను 'బ్లాక్ మెయిల్' చేసేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. సైనిక పరంగా బలంగా ఉన్నాం కాబట్టి 'ఈ వాణిజ్య యుద్ధంలో నెగ్గకపోతే సైనిక యుద్ధం ద్వారా అయినా పై చెయ్యి సాధిస్తాం' అని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయి. ఫ్రాన్స్‌ను పరిపాలించిన 15వ లూయిస్ చక్రవర్తి 'నేను పోతే, ఉత్పాతమే' అని బలంగా విశ్వసించేవాడు.

# తెలుగు చరిత్రకారుడు ఫ్రికెన్‌బర్గ్




తెలుగువారి చరిత్ర-సంస్కృతులను, ఆధునిక యుగానికి సంబంధించి, తన పరిశోధనల ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిపిన ప్రముఖ చరిత్రకారుడు ఎరిక్ ఫ్రికెన్‌బర్గ్ కన్నుమూశారు. 1930లో జన్మించిన ఈయన, తమిళనాడులో విద్యాభ్యాసం మొదలుపెట్టి, ఆ తర్వాత అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం (బర్కిలీ)లో రాజకీయ శాస్త్రం చదివి, 1961లో లండన్‌లో స్కూల్ ఆఫ్ ఒరియంటల్ స్టడీస్‌లో డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. విస్కాన్సిన్%-%మేడిసన్ విశ్వవిద్యాలయం చరిత్ర విభాగంలో (1962%-%1997) బోధనావృత్తి చేపట్టారు. అక్కడున్నప్పుడు, భారతదేశ చరిత్రకు సంబంధించి భూసమస్యలు, మత మార్పిడులు, హిందూ జాతీయవాదం, భారతదేశంలో క్రైస్తవమత పుట్టుక, ఎదుగుదల గురించి గణనీయమైన కృషి సలిపి, రచనలు చేశారు.ఫ్రికెన్‌బర్గ్ పరిశోధించి, వెలువరించిన 'గుంటూర్ డిస్ట్రిక్ట్' గ్రంథం ఆయనకు ఎనలేని ఖ్యాతిని తీసుకొచ్చింది. ప్రభుత్వ పరిపాలనను, వలస పాలనాధికారుల కంటే భారతీయులే అమితంగా ప్రభావితం చేశారన్న అంశాన్ని విపులంగా చర్చించారు. బ్రాహ్మణులు- నియోగులు, దేశస్త బ్రాహ్మణులు, గ్రామకరణాలుగా, అనువాదకులుగా (దుబాషీలు), కచేరీ ఉద్యోగులుగా పనిచేస్తూ, వారి స్వప్రయోజనాలను పొందిన తీరు వివరిస్తూ, గ్రామకరణాలు లబ్ధిపొందిన తీరు, అవసరమైన రికార్డులను తొలగించి, వాటి స్థానంలో 'తప్పుడు' లెక్కలను చూపించిన పద్ధతులను వెలికి తీశారు. ఫ్రికెన్‌బర్గ్ అనుసరించిన భారతీయ చరిత్ర అధ్యయన విధానాన్నే ఆ తర్వాత ప్రాచుర్యానికొచ్చిన కేంబ్రిడ్జి స్కూల్ చరిత్రకారులు అనిల్ సీల్, డేవిడ్ వాష్‌బ్రూక్, క్రిస్ బేకర్, సి.ఎ. బెయిలీ తదితరులు అవలంబించారు.

ఫ్రికెన్‌బర్గ్, ఆ తర్వాతి కాలంలో తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాల్లో క్రైస్తవ మతవ్యాప్తి గురించి అధ్యయనం చేశారు. ఈ ప్రక్రియలో తనకు తోడ్పడిన భారతీయ మద్దతుదార్లను గూర్చి రాశారు. 'క్రిస్టియానిటీ ఇన్ ఇండియా: ఫ్రం బిగినింగ్స్ టు ద ప్రెజెంట్' ప్రచురించారు. భారతదేశ గతాన్ని గూర్చి ఆయన రచించిన, 'ఇండియాస్ రాజ్: ఎ?స్పేస్ ఇన్ హిస్టారికల్ అండర్‌స్టాండింగ్స్' గ్రంథం, ఫ్రికెన్‌బర్గ్ ప్రశంసాపూర్వక విద్వత్తుకూ, భారతదేశ చరిత్ర గతానికీ ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

# చందన చర్చిత.. అప్పన్న

భక్తి



అక్షయ తృతీయ పర్వదినం సింహాచల క్షేత్రంలో ప్రత్యేకంగా జరుగుతుంది. ఏడాదంతా మణుగుల కొద్దీ చందనాన్ని అలదుకున్న అప్పన్న అక్షయ తృతీయ సందర్భంగా నిజరూపంలో భక్తులను అనుగ్రహిస్తాడు. తన భక్తుడైన ప్రహ్లాదుడిని కాపాడేందుకు శ్రీహరి.. నరకేసరిగా ఈ సింహాచలంపై అవతరించాడు. ప్రహ్లాదునితో హరినామ స్మరణ మాన్పించడానికి హిరణ్యకశిపుడు నానా విధాలుగా పసిబాలకుణ్ని ఇక్కట్లకు గురిచేశాడు. ప్రహ్లాదుడిని సముద్రంలో పడవేయించాడు.ఆ పసిబాలుణ్ని శ్రీహరి కాపాడాడు. కొండపై నుంచి పడదోశాడు. మహావిష్ణువు అక్కడ ప్రత్యక్షమై.. మళ్లీ రక్షించాడు. తనను ఆదుకున్న నారాయణుడిని ప్రహ్లాదుడు స్తుతించగా.. ఆ బాల భక్తుడికి వరాహ నరసింహ రూపాన్ని అనుగ్రహించాడు విష్ణుమూర్తి. తన భక్తుడి కోరిక మీద ఆ కొండపైనే, అదే రూపంలో స్థిరంగా ఉండిపోయాడు. హిరణ్యకశిపుడి సంహారం తర్వాత ప్రహ్లాదుడు వరాహ నృసింహస్వామికి దేవాలయాన్ని కట్టించాడని స్థలపురాణం చెబుతున్నది.

ఇక్కడ కొలువుదీరిన స్వామికి చందనం ప్రీతి. స్వామి ఉగ్రరూపాన్ని ఉపశమింపజేయడానికి నిత్యం మణుగుల కొద్దీ చందనాన్ని మూలమూర్తికి అలదుతుంటారు అర్చకులు. పొరలు పొరలుగా చందనం అలదడంతో స్వామి విగ్రహం లింగాకారంగా దర్శనమిస్తుంది. ఏటా వైశాఖ శుక్ల తదియ (అక్షయ తృతీయ) నాడు సశాస్త్రీయంగా, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ చందనాన్ని మొత్తంగా తొలగిస్తారు. ఆనాడు లభించే నిజరూప దర్శనం కోసం భక్తులు పోటెత్తుతారు. స్వామి నుంచి వెలికి తీసిన చందనాన్ని ప్రసాదంగా భక్తులు తీసుకుంటారు. దీనిని ధరించడం ద్వారా, ప్రసాదంగా తీసుకోవడం ద్వారా సకల అభీష్టాలు నెరవేరుతాయనీ, ఆరోగ్యం లభిస్తుందని భక్తుల నమ్మిక.కాలక్రమంలో ఈ ఆలయం శిథిలం కాగా, పురూరవ చక్రవర్తికి వరాహ లక్ష్మీనరసింహ స్వామి దర్శనమైందట. ఆయనే సింహాద్రి ఆలయాన్ని పునరుద్ధరించాడట. ఆ సమయంలో పురూరవుడు స్వామి పాదాలను దర్శించలేకపోయాడట. కలత చెందిన పురూరవుడితో అశరీరవాణి 'మహారాజా! ఈ స్వామి పాదాలను నీవు దర్శించలేవు, కానీ స్వామి వారిని శాస్త్రోక్తంగా అర్చించి, ఆ దివ్య మంగళ విగ్రహం నిండా చందనం అలంకరించు. భక్తులెవ్వరూ మిగిలిన రోజులలో స్వామి నిజరూపాన్ని దర్శించలేరు, అక్షయ తదియ రోజు మాత్రమే చందనం పూర్తిగా తొలగించిన తరువాత నిజరూప దర్శనం చేసుకోగలరు' అని పలికిందట. పురూరవుడు అలాగే చందనం అలది స్వామిని పూజించాడట. అప్పటినుంచి ఇక్కడ నిత్య చందనోత్సవం సంప్రదాయంగా వస్తున్నది.

## ఏసీ చల్లదనంతో సమస్యా



వేసవిలో మండే ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లలో ఎయిర్ కండిషనర్‌లను వాడతాం. కానీ కొంతమందికి ఏసీ చల్లదనం సరిపడక తలనొప్పి, చర్మం పొడిబారడం, కళ్ల దురద, జలుబు, గొంతు పట్టేయడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక ఏసీని ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యల నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.
ఏసీ ఫిల్టర్లలో ఎక్కువగా దుమ్ము చేరుతూ ఉంటుంది. ఏసీని ఉపయోగిస్తున్నప్పుడు ఈ దుమ్ము కణాలు వాటిలోని హానికారక బ్యాక్టీరియా గది అంతటా వ్యాపిస్తాయి. గదిలోకి రాగానే ఇవి శ్వాసకోశాల్లోకి చేరి జలుబు, తుమ్ములు, దగ్గు లాంటి సమస్యలను కలిగిస్తాయి. తరచూ ఏసీని, ఫిల్టర్లను శుభ్రం చేస్తూ ఉంటే వీటిని అధిగమించవచ్చు.
ఏసీ వేసి ఉన్న గదిలో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు ఇలాంటి చల్లని వాతావరణంలో గడపడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది. తలనొప్పి, ముక్కు దిబ్బడ, కళ్ల దురద వస్తుంటాయి. చర్మం పొడిబారుతుంది కూడా. గదిలో చల్లదనం మరీ ఎక్కువగా కాకుండా మధ్యమంగా ఉండేలా ఏసీ ఉష్ణోగ్రతను నియంత్రిస్తే ఈ సమస్యలు రావు.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9
హైదరాబాద్
మంగళవారం
29 ఏప్రిల్ 2025


# కాఫీ పొడితో తెల్లజుట్టు నల్లగా..

చాలామంది తమ రోజును కాఫీతో ప్రారంభిస్తారు. ఉదయం పూట ఒక కప్పు వేడి కాఫీ తాగితే రోజంతా ఫ్రెష్‌గా ఉంటుంది. దాని సువాసన ఎంతటివారినైనా తనవైపుకు ఆకర్షింప చేస్తుంది. అదే కాఫీ జుట్టుకు ఎంతో ఉపయోగకారి అని మీకు తెలుసా? చెంచాడు కాఫీ పొడితో తెల్లజుట్టును నల్లగా చేయగలదంటే ఆశ్చర్యంగా ఉంది కదా.. ఇంకా జుట్టు ఆరోగ్యానికి కాఫీ ఎంతలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం..
కాఫీలో పొటాషియం, మెగ్నీషియం, యాంటీ–ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. అదే కాఫీ జుట్టుకి, చర్మానికి కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలుసుకున్నారు. అవును జుట్టు పెరుగుదలకు కాఫీ సహాయపడుతుంది. శరీరానికి, అలాగే జుట్టుకు ప్రయోజనకరంగా భావించే కాఫీలో చాలా ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ



రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి జుట్టును రక్షిస్తాయి. దీనితో పాటు, కాఫీలోని కెఫిన్ జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది. జుట్టు పొడవుగా, నల్లగా, ఒత్తుగా చేయడానికి కాఫీని అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. కొన్నింటిలో ఈ కాఫీపొడిని మిక్స్ చేసి ఉపయోగించే చిట్కాలు ఏమిటో తెలుసుకుందాం.

**కొబ్బరినూనెతో..**

జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి కాఫీ, కొబ్బరినూనెను ఉపయోగించవచ్చు. కొబ్బరినూనెలో ఒక చెంచా కాఫీ పొడి వేసి బాగా కలపాలి. దీన్ని పూర్తిగా జుట్టుకు పట్టించాలి. కాసేపు మసాజ్ చేసి 30 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. తర్వాత షాంపూ ఉపయోగించి జుట్టును శుభ్రం చేసుకోవాలి. ఉత్తమ ఫలితాల కోసం వారానికి రెండుసార్లు ఈ హెయిర్ మాస్క్‌ని ఉపయోగించండి. కొబ్బరినూనెలో ప్రోటీన్, విటమిన్ ఇ, యాంటీ–ఆక్సిడెం, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ పుష్కలంగా ఉన్నాయి. ఇది జుట్టును బలోపేతం చేయడంలో సహాయపడుతుంది.

**కలబందతో..**

కాఫీ, కలబంద కూడా జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడతాయి. ఒక గిన్నెలో రెండు చెంచాల అలోవెరా జెల్, చెంచా కాఫీ పొడి వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ పేస్ట్‌ను స్కాల్ప్, హెయిర్‌కి అప్లై చేసి కాసేపు మసాజ్ చేయండి. అరగంట తర్వాత తేలికపాటి షాంపూతో జుట్టును కడగాలి. ఉత్తమ ఫలితాల కోసం వారానికి ఒకసారి ఈ హెయిర్ మాస్క్‌ని ఉపయోగించండి.

**పెరుగుతో..**

పెరుగు జుట్టుకు సహజమైన కండిషనర్‌గా పనిచేస్తుంది. ఇది జుట్టును సిల్కీగా మార్చడంలో సహాయపడుతుంది. దీని నుండి హెయిర్ మాస్క్ చేయడానికి, ఒక కప్పు తాజా పెరుగు తీసుకోండి. అందులో ఒక టేబుల్ స్పూన్ కాఫీ పోడి వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమానికి నిమ్మరసం కూడా కలపండి. ఇప్పుడు దీన్ని తలకు పట్టించి 30 నిమిషాల తర్వాత నీటితో కడగాలి.

**తేనెతో..**

తేనె జుట్టును బలపరుస్తుంది. దీని కోసం, ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ కాఫీ పొడిని తీసుకోండి. దానికి తేనెను యాడ్ చేయాలి.. ఈ మిశ్రమాన్ని బాగా కలిపి పేస్ట్‌లా చేసుకోవాలి. ఇప్పుడు జుట్టుకు అప్లై చేయండి. సుమారు 20 నిమిషాల తర్వాత నీటితో కడగాలి.

**ఆముదంతో..**

ఈ హెయిర్ మాస్క్ చేయడానికి, ఒక గిన్నెలో ఒకటి లేదా రెండు చెంచాల కాఫీ పొడిని తీసుకుని, దానికి ఆముదం కలపండి. దీని నుండి మందపాటి పేస్ట్‌ను సిద్ధమవుతుంది. ఇప్పుడు దీన్ని మీ జుట్టుకు అప్లై చేయండి. సుమారు గంట తర్వాత

# కుండ వాడదామిలా!



ఎండకాలంలో చల్లటి నీళ్లు తాగడానికి కుండ ప్రకృతిసిద్ధమైన పరిష్కారం. ఫ్రిజ్‌లు ఉన్నప్పటికీ వేసవిలో కుండలకు గిరాకీ ఎక్కువే ఉంటుంది. పైగా కరెంట్ వాడకుండానే నీళ్లు చల్లబడిపోతాయి. మట్టిలో ఉండే మినరల్స్ నీళ్లలో చేరిపోతాయి. అలా కుండ నీళ్లు ఆరోగ్యకరం కూడా. అయితే, దీని వాడకంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

**1 బాగా కడగాలి**

కుండ కొన్న తర్వాత మొదటిసారి ఉపయోగానికి ముందు బాగా కడగాలి. మట్టికుండలు పొరలు పొరలుగా ఉంటాయి. కాబట్టి, వాటిని నిల్వచేయడం, రవాణా చేసే క్రమంలో దుమ్ము, బ్యాక్టీరియాల్లాంటివి పేరుకుని ఉండే అవకాశం ఉంది. ఎలా కడగాలి?
ముందుగా కుండను లోపలా బయటా శుభ్రంగా కడిగి, కొన్ని గంటలపాటు కుండను మంచినీళ్లతో నింపి పెట్టాలి. దీంతో ఏవైనా ధూళి కణాలు ఉంటే వదిలిపోతాయి.
ఆ తర్వాత మెత్తటి బ్రష్ కానీ, కొబ్బరి పీచును కానీ ఉపయోగించి వేడినీటితో సున్నితంగా కడగాలి. సబ్బు లాంటివి వాడొద్దు. కుండ శుభ్రపడే వరకు ఇలా చేయాలి.
ఇక రోజూ ఉపయోగించేటప్పుడు కూడా వారానికి ఓసారైనా కడగాలి. లేకుంటే కుండలో నాచు, మురికి పేరుకుపోతాయి. 2 మూసి ఉంచాలి
కుండకు సూక్ష్మమైన రంధ్రాలు ఉంటాయి. వీటి ద్వారా గాలి ప్రసరించి నీళ్లను చల్లబరుస్తుంది. అయితే, రంధ్రాల ద్వారా దుమ్ము, కీటకాలు, బ్యాక్టీరియా లాంటివి ప్రవేశించే వీలుంది. కాబట్టి కుండను మూసి ఉంచాలి.

**ఏం చేయాలి?**

కుండ పైభాగాన్ని మూతపెట్టి ఉంచాలి.
ఒకవేళ బట్టను కప్పి ఉంచేట్లయితే దాన్ని క్రమం తప్పకుండా శుభ్రపరుస్తూ ఉండాలి.
కుండను పరిశుభ్రమైన చల్లటి ప్రదేశంలో పెట్టాలి. సూర్యకాంతి, కాలుష్యం పడకుండా చూసుకోవాలి. 3 నీళ్లు మార్చాలి
కుండలోపల తడిగా ఉంటుంది కాబట్టి, ఎప్పటికప్పుడు నీళ్లు మారుస్తూ ఉండకపోతే బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుంది. ఏం చేయాలి?
ప్రతి 24 గంటలకోసారి నీళ్లు మారుస్తూ ఉండాలి.
కుండలో కొంతమేరకు నీళ్లు ఉంటే మిగిలిన భాగం నింపకూడదు. అవి అయిపోయాకే మళ్లీ నీళ్లు పోయాలి.
వానకాలం, తేమగా ఉండే సమయాల్లో కుండను తరచుగా కడుగుతూ ఉండాలి. లేకపోతే బూజు ఏర్పడుతుంది. 4 నేలపై ఉంచొద్దు
కుండను నేరుగా నేలపైనే ఉంచకూడదు. నేల సరిగ్గా లేకపోతే కుండ పగిలిపోవచ్చు. పైగా కుండలో నీళ్లు నేలమీద ఉండే దుమ్ము, బ్యాక్టీరియాతో కలుషితం కావొచ్చు. ఎలా ఉంచాలి?
చెక్క, ప్లాస్టిక్, మెటల్ స్టాండ్ మీద ఉంచాలి.
గాలి వెలుతురు ధారాళంగా వచ్చే చోట పెట్టాలి. వేడి ప్రదేశంలో ఉంచకూడదు. సూర్యకాంతి నేరుగా పడకూడదు. వేడి వల్ల కుండలో నీళ్లు తొందరగా ఆవిరైపోతాయి.

# మార్పుని స్వీకరిద్దాం!



అవునుగానీ ఓ మాటడుగుతాను. విని మరట్టే న్యాయం చెప్పండి. మూడు ముక్కల్లో చెప్పనుగాక చెప్పను. కనక కాస్త ఓపిక పట్టండి. మనదేశంలో, అనగా యీ విశాల భారత దేశంలో అనాది నించీ యెవరికి తోచినట్లుగా వాళ్లు బట్టలు కట్టుకుంటూనే వచ్చారు గద. సంప్రదాయమో దిబ్బో దిరుగుండమో యెవరి అలవాట్లో, పొరపాట్లో వారివిగా చేసుకుంటూ వేసుకుంటూ వచ్చాము. ఇకముందూ వేసుకుంటూ వస్తాము కూడా. దీనికి గానూ నిర్దిష్టమైన పద్ధతులు పాటించేవారు కొందరయితే, మరికొందరు మాకు తోచినట్లు బట్టలు కట్టుకుంటామూ మా సౌఖ్యం, మా సరదా అనీ అంటున్నాము. అవునా? ఆ మాత్రం స్వాతంత్ర్యం మనిషికి వుండాలి మరి.
ఒకప్పుడు చీర తప్ప మరోటేదీ కట్టి యెరగని స్త్రీలూ యిప్పుడు పంజాబీ దుస్తులూ కాశ్మీరీ దుస్తులూ వేసుకుని హాయిగా తిరుగుతూండగా లేనిది, ఆడపిల్లలు బ్లూజీన్స్ చొక్కాయిలూ వేసుకునేసరికి నిందలు పడాల్సి రావడం ఆశ్చర్యంగానే వుంది. కేరళలో చాలా కాలం వరకూ ఆడవాళ్లు వేసుకుండిన ఖాళీ వృక్షోజాల బట్టల విషయమూ, బాగా తూరుపున ఆడవాళ్లకి రవికెలు లేని వైనమూ అందరికీ తెలిసినదే.
మా నాయనమ్మ 1900 చిల్లరలో లో జాకట్లు వేసుకునేసరికి అప్పటి వాళ్లు అపచారం అని గగ్గోలు పెట్టారట. అప్పటికి పది నెలల వయసున్న మా పెదనాన్నతోటీ మా తాతగారితోటీ తీయించుకున్న ఫొటోల్ని మేమంతా చూసినవాళ్లమే. మహీధర రామ్మోహన్ రావు ఆ చంటి పిల్లడు. ఆయన పుట్టినది నవంబరు 1909లో. మా వూళ్లోనే గాదు, మన సరమ్మ బూబమ్మ అయిపోయిందని ఆవిణ్ని, భ్రష్టుడయిపోయాడని మా తాతయ్యను కోనసీమలో తిట్టని బట్టలు కుట్టడమూ పై సంస్కృతుల నించి దిగుమతి అయినదే అని తెలుసుకుంటే మనకి పోయినదేముందీ? తప్పేముందీ? అందులో పరువు నష్టమేముందీ?
ఈలోగా మగాళ్లు మాత్రం తమకి పై చదువులనో, వుద్యోగాలనో ముందస్తుగా చొక్కాలు కోట్లతో మొదలెట్టి నెమ్మదిగా పొడుగు లాగుల్లోకి, మరో వాటిలోకీ దిగారుగద. మగవాళ్ల దుస్తులలోని యీ మార్పుల్ని ఒప్పుకున్నవాళ్లు కూడా ఆడవాళ్ల దుస్తులలోని మార్పుల్ని ఒప్పుకోలేదోపట్టాన్ని. అందులోనూ ఆడవాళ్లే తీవ్ర విమర్శకులయ్యారు! అప్పుడూ యిప్పుడూ కూడా ఆడవాళ్లే తమ తోటి ఆడవాళ్ల వేషధారణనీ వాళ్ల బట్టల యెన్నికలనీ ఎత్తి చూపి మరీ వాళ్లని ఆక్షేపించేది! ఇది
వాళ్లు లేరట.
ఆడాళ్లు జాకట్లు వేసుకోవడం వచ్చినాక మరెన్నో మార్పులు వచ్చినాయి. ఇప్పుడంతా కాలమెంతో మారిన చరిత్ర మరిచిపోయారు! మా అమ్మా, పెద్దమ్మా అత్తలూ గూడకట్టు కట్టుకుంటాము, గోచిపోసి చీరలు కట్టుకోమని 1930 ల తరవాతిరోజుల్లో తిరుగుబాటు చేశారుట. అప్పుడూ వూరూవాడా పెద్ద రగడలే వచ్చాయి మరి. మా బామ్మ పెద్ద సపోర్టుగా నిలిచిందీమాటు మా తాతకి.
ఆ తర్వాత వాళ్లు మేము చీరల కింద లంగాలు కట్టుకుంటామూ అనేసరికి మరో తిరుగుబాటు అవసరమైంది. ఇదంతా యెందుకు చెబుతున్నాను? గొప్పలకి కాదు. నేనెప్పుడూ సాధ్యమైనంతవరకూ అనుభవాలూ జ్ఞాపకాలూ వున్న విషయాల్ని చెప్తేనే మంచిదనుకుంటాను. అంతే కాదు. ఆగథా క్రిస్టీ ఒక నవలలో లాగ అవే కాదు నేనూనూ. నిఱ ఇలా అంటున్నానని తిట్టకండి, కానీ సూయీ ధాగా లోనించి సూది దారమూ వచ్చినట్లు భాషా వేత్తలు చెప్పారు. మనకి మహా బాగుందా?
తర్వాత చదువులు పెరిగే కొద్దీ ముచ్చట్లూ లావయ్యాయి. పై ప్రపంచమూ మరింతగా పరిచయమవుతూ వచ్చింది. తిరుగుళ్లూ పెరిగాయి. రుచులూ మారుతూ వచ్చాయి.
మొదట నైటీ యెవరేసుకున్నారో తెలీదుగానీ ఆ మహాతల్లి దేశాన్నే మార్చేసింది. ఆవిడకి జిందాబాద్, ఆవిడ (అదేమిటీ? ఆ, ) అమర్ రహే! ఇప్పుడయితే, ఒకప్పుడు తట్టెడు చీరలూ వుతకలేక చచ్చిన వాళ్లంతా (యిప్పుడు మెషీనులొచ్చినా) ఆవిడ పేరు పెట్టి అఖండ దీపం వెలిగించాల్సిందే!
నేనూ ఓ దీపం వెలిగించాల్సిందే! ఏమయిందీ? నేను, మా ఆయనా పెళ్లయిన తర్వాత అత్తారు నగలకోసం యిచ్చిన డబ్బు తీసుకుని నైనితాల్ కి పరారయ్యాము. మూడు వారాలపాటు హాయిగా తిరిగేసి ఖాళీ చేతులతో నయినా వాపసు రాకండా నేను మాత్రం రెండు నైటీలతో తిరిగొచ్చాను. అది 1962.. ఇంకేముందీ కొంపలంటుకున్నాయి. ఇరుగూ పొరుగూ మా అత్తగారిని ఘాటుగా మాటలన్నారు. పాపం యెంత మారుతూ వచ్చినా యీ విమర్శలకి ఆవిడకీ చుర్రుమంది. అవి పెట్టెలో దాచెరు అన్నారు. అసలే నా ముద్దు పేరు చండిక మా పుట్టింట. 'అవునంటే కాదందీ మరి కాదంటే అవునందీ' అనేరకం. చివరికి రాత్రి తొమ్మిది దాటాకా , పొద్దుటే ఆరింటి లోగానూ మార్చేందుకు సంధి పత్రాల మీద ఒప్పందం జరిగింది.
చూడండిప్పుడు లోకమెంతగా మారిందో? కనక ఆ తొట్టతొలి వనితకి జోహార్లిద్దామా వద్దా? వెధవది బట్టలతోటే యింత వివాద వాగ్వివాద ప్రతివాదాలా?
ఇక ఆడపిల్లల చదువులూ పెళ్లిళ్లో ? అబ్బూరి ఛాయాదేవి చదువూ పెళ్లీ నాకింకా గుర్తున్నాయి. పాపం మద్దాలి వెంకటచలం గార్ని విమర్శించారు. ఆయన మహా గట్టి మనిషి. తన ఆదర్శాలకి కట్టుబడ్డ మనిషి. సరే మావాళ్లు మరీ ముదిరిపోయారని దూరం తప్పుకున్నారు. మహీధర వాళ్లు మరీ బరి తెగించిన రకమని ఒగ్గేశారు. నాకు బాగా గుర్తున్న ఒక విషయం. 1965 లో గాల్వస్టన్ బీచికి (హ్యూస్టను పక్కని) విద్యార్థుల ప్రయాణం. కొందరు లాగులూ చొక్కాలు వేసుకున్నారు, మరి కొందరు పొట్టి లాగులూ వేసుకున్నారు.
అది నానా దేశ జాతి సమ్మేళనం. సరేనని నేనూ పొడుగు లాగే సుమండీ, పాదాలు దాటినదే వేసుకున్నాను. అప్పుడు రెండు వేళ్ల వెడల్పే కూడా వుంటిని. మనవాళ్లెవరూ లేరుగదానని నెలికాను కూడా. నా చొక్కాయి కూడా గలీబు వలే వదులయినదే సుమండీ. మనలో మనమాట. అది నా వినయం కాదు నా మిడ్జెట్ సైజు అలాంటిది! అనుకోకుండా బీచిలో ఓ చెత్త పత్రిక వాడు అడ్డుతగిలి మీ దేశస్తులు స్విమ్ సూటు వేసుకోకూడదా, తప్పా అని అడిగాడు. నేను బహు దేశభక్తితో మాది స్వతంత్ర దేశం యిష్టమైతే వేసుకోవచ్చు.. అని చెప్పాను. తప్పేముంది చెప్పండి? నేనెంత రాజమండ్రి వాసినయినా మనకీ మహా నగరాలున్నాయి గదా? హిందీ సినిమాలు దండిగా చూసిన వారమేగా.. అందుకని అలా చెప్పాను.
అయితే నేను చూసుకోలేదు దూరంగా పట్టుచీర ధరించిన మరో మాధవీలత గారి వంటి విదుషీమణి వున్నారని. ఆమె ఏక ధాటిగా నన్ను ఒక చవకబారు మనిషిగా, దేశద్రోహిగా చీల్చి చెండాడి.. దూది యేకినట్లు యేరి పారేసింది. అసలయిన భారతీయ వనితలు పాశ్చాత్య వేషధారణ మరణించినా వేసుకోరు. ఈమె క్రిస్టియన్ అయి వుంటది.. అని కూడా వుద్ఘాటించింది. నా మిత్రులూ పక్కనున్నవారూ తెల్లబోయి చూశారు. అకస్మాత్తుగా యీ విజృంభణకి. నా నోరు తడారిపోయింది.
ఇదంతా యివాళ నవ్వుతూ చెప్తున్నాను గానీ అప్పుడు మాత్రం చాలా నొప్పి కలిగిన మాట వాస్తవం. మన మాధవీలతగారి ఘాటు విమర్శలు ఇవాళ యూ ట్యూబులో చూసేసరికి, నన్ను చూడడానికొచ్చిన నా చెల్లి కొడుకు కూడా ఆ వీడియో చూసి హడిలిపోయినాక వాడితో చెప్పాను..
"లోకమూ మారెనూ, రోజులూ మారెనూ

# ముంజలు ఎప్పుడూ ఒకేలా తిని బోర్ కొడుతోందా?



ముంజలు అంటేనే నోరూరిపోతుంది. వేసవి వేడినంతా పోగొట్టి చల్లదనాన్ని ఇస్తాయి ఇవి. డీహైడ్రేషన్ అయిన వెంటనే వీటిని తింటే చాలా త్వరగా యాక్టివ్ అయిపోతారు. ఇందులో వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. వేసవిలో రోజూ తీసుకుంటే కడుబు ఉబ్బరం, అజీర్తి లాంటి సమస్యలూ తగ్గిపోతాయి. బరువు పెరగడాన్నీ నియంత్రిస్తాయి ముంజలు. కాలేయాన్ని కాపాడడంతో పాటు ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇన్ని లాభాలున్నాయి కాబట్టే ఎండాకాలంలో తప్పనిసరిగా ముంజలు తినాలని వైద్యులు సూచిస్తారు. అయితే..ఎంత ఆరోగ్యకమరైనదైనా రోజూ ఒకేలా తింటే బోర్ కొట్టేస్తుంది.
ఎప్పుడైనా కాస్త వెరైటీగా తినాలని అనిపిస్తుంది. లేదా జ్యూస్ లా అయినా తాగాలనిపిస్తుంది. మిగతా పండ్లు అంటే పర్లేదు. మరి ముంజల్లో ఎలాగో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. మరి దీన్ని జ్యూస్ చేసుకుని తాగితే ఏం రుచి ఉంటుందని అనుకోవచ్చు. కానీ..చాలా సింపుల్ గా, ఎక్కువ ఇన్ గ్రీడియెంట్స్ కలపకుండానే రుచికరమైన జ్యూస్ లు తయారు చేసుకుని తాగొచ్చు. పైగా ఇందులో ఎన్నో వెరైటీలున్నాయి. రోజుకోటి ట్రై చేసినా రుచితో పాటు ఆరోగ్యాన్నీ పొందొచ్చు.

**మాక్ టెయిల్**

?ముంజలతో మాక్ టెయిల్ తయారు చేసుకోవచ్చు. అది కూడా చాలా సింపుల్ గా. మీకు మొజిటో లాంటి డ్రింక్స్ బాగా ఇష్టమైతే అదే రెసిపీ ట్రై చేయొచ్చు. అందుకోసం ముందుగా ముంజలను బాగా మిక్సీ పట్టాలి. అందులో మీకు నచ్చిన స్వీట్ నర్ ని యాడ్ చేసుకోవాలి. ఇంకాస్త టేస్ట్ కోసం పుదీన కలుపుకోవచ్చు. కూల్ గా తాగాలనుకుంటే ఐస్ వేసుకోవాలి. వీటన్నింటినీ కలుపుకుంటే అది మొజిటోలా మారిపోతుంది. మరీ అతిగా స్వీట్ నర్ కలపకపోవడం మంచిది. ఈ ఎండల వేడిని ఈ చల్లచల్లని ముంజల మాక్ టెయిల్ తో తగ్గించుకోవచ్చు. ఇంకాస్త టేస్ట్ కావాలి అంటే పుచ్చకాయ ముక్కలు కలుపుకుని మిక్సీ పట్టాలి.



**రోజ్ మిల్క్ తో**

ముంజలను, రోజ్ మిల్క్ తో కలిపితే ఆ టేస్టే వేరు. ఇది కూడా చాలా సింపుల్ గా తయారు చేసుకోవచ్చు. ముంజలను ముందుగా ముక్కలుగా చేసుకోవాలి. అందులో రోజ్ మిల్క్ యాడ్ చేయాలి. చిక్కగా కావాలనుకుంటే కాస్తంత ముక్కలు ఎక్కువ వేయాలి. ఇది మిక్స్ చేసుకుని నేరుగా తాగొచ్చు. లేదు కాస్తంత తియ్యగా కావాలంటే చక్కెర లేదా స్వీట్ నర్ యాడ్ చేసుకోవాలి. చల్లగా తాగాలనుకుంటే ఐస్ వేసుకోవచ్చు లేదా అలా నేరుగా తాగొచ్చు.

**ఐస్ యాపిల్ స్మూతీ**

ముంజలతో స్మూతీ కూడా తయారు చేసుకోవచ్చు. పిల్లలైతే చాలా ఇష్టంగా తాగుతారు. యోగర్ట్, అరటి పండు, తేనె. ఇవి ఉంటే చాలు. చాలా సులభంగా స్మూతీ చేసేయొచ్చు. ముంజలతో పాటు వీటన్నింటినీ కలిపి మిక్సీ పడితే సరిపోతుంది. చిక్కనైన, రుచికరమైన స్మూతీ తయారైపోతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ టైమ్ లో లేదా వర్కౌట్స్ చేసిన తరవాతైనా తాగితే శరీరానికి కావాల్సినంత శక్తి వస్తుంది. ముంజల్లో సహజంగానే స్వీట్ నెస్ ఉంటుంది. యోగర్ట్ తో కలిపినప్పుడు ఈ టేస్ట్ ఇంకాస్త పెరుగుతుంది.

**ముంజలతో పాయసం**



తమిళనాడులో ముంజలతో పాయసం చేసుకుంటారు. ఇది అక్కడ చాలా ఫేమస్. సింపుల్ గా చెప్పాలంటే ఇదో డిసర్ట్ లా అన్నమాట. ఇది తయారు చేసుకోవడం చాలా సులభం. ముందుగా ముంజలను ముక్కలుగా చేయాలి. అందులో కొన్ని పాలు, బాదం పప్పులు వేసి మిక్సీ పట్టాలి. అది పేస్ట్ లా మారిన తరవాత అందులో మళ్లీ కాసిన్ని పాలు, చక్కెర వేసి వేడి చేయాలి. థిక్ గా మారేంత వరకూ మరిగించాలి. కాసేపటికి అది పాయసంలా మారిపోతుంది. పెద్దలు, పిల్లలు అన్న తేడా లేకుండా అంతా చాలా ఇష్టంగా తింటారు.

**ఐస్ క్రీమ్ కూడా..**ముంజలతో ఐస్ క్రీమ్ కూడా తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం ఇందులో కొబ్బరి నీళ్లు పోసి మిక్సీ పట్టాలి. ఈ మిశ్రమాన్ని పాప్సికల్ కేస్ లో ఆ షేప్ కి తగ్గట్టుగా పోయాలి. అది గడ్డ కట్టేంత వరకూ ఉంచాలి. ఆ తరవాత బయటకు తీస్తే అచ్చం అవి పాప్సికల్స్ లాగే మారిపోతాయి. పైగా కొబ్బరి నీళ్లు పోయడం వల్ల మంచి టేస్ట్ వచ్చేస్తుంది. ఐస్ క్రీమ్ లు అంటే ఇష్టపడే పిల్లలకు ఇది బాగా నచ్చుతుంది. పైగా బయట దొరికే పాప్సికల్స్ లో షుగర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది పిల్లలకు ఏ మాత్రం మంచిది కాదు. అందుకే ఇంట్లోనే ఈ సమ్మర్ లో ఇలా ముంజలతో పాప్సికల్స్ తయారు చేసి ఇస్తే ఆరోగ్యానికి ఆరోగ్యం..రుచికి రుచిని ఆస్వాదించవచ్చు.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. వెయ్యి పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!



**ముంబై- నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. గత సెషన్‌లో సూచీలు పహల్గాంలో ఉగ్రవాదుల దాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తల కారణంగా మార్కెట్లు పతనమయ్యాయి. అయితే, వారంలో తొలిరోజైన సోమవారం లాభాల్లో ప్రారంభమయ్యాయి. విదేశీ పెట్టుబడులు కొనసాగడం.. బ్లూ చిప్ స్టాక్స్ రాణించడంతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ సెన్సెక్స్ 79,343.63 పాయింట్ల లాభాల్లో మొదలైంది. ఏ దశలోనూ మళ్లీ వెనక్కి తగ్గకుండా వరుస సెషన్లలో లాభాల్లో ట్రేడయ్యింది. ఈ క్రమంలో సెన్సెక్స్ 80,321.88 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 1,005.84 పాయింట్ల లాభంతో 80,218.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272.90 పాయింట్లు పెరిగి.. 24,312.25 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1,877 షేర్లు లాభపడ్డాయి. మరో 1,961 షేర్లు పతనయ్యాయి. నిఫ్టీలో అత్యధికంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ లైఫ్, భారత్ ఎలక్ట్రానిక్స్, సన్ ఫార్మా, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అత్యధికంగా లాభపడ్డాయి. శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎటర్నల్, అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌యూఎల్ నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.3 శాతం పెరిగింది. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.4 శాతం పెరిగింది. ఐటీ మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, రియాల్టీ, ఆయిల్, గ్యాస్, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్ ఒకటి నుంచి 3శాతం పెరిగాయి.




# మీకు ఒకటికంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలున్నాయా.. అయితే ఈ నష్టాలు భరించాల్సిందే..!




**న్యూఢిల్లీ-నవభూమి:** చాలామందికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంక్ ఖాతాలు ఉంటాయి. అయితే వాటిలో ఒకటి లేదా రెండు మాత్రమే యాక్టివ్‌గా ఉంటాయి. మిగతావాటిని నిరుపయోగంగా వదిలేస్తారు. ఇలా బ్యాంకు ఖాతాను నిరుపయోగంగా వదిలేయడంవల్ల కొన్ని నష్టాలు భరించాల్సి వస్తుంది. మరి బ్యాంకు ఖాతాను ఉపయోగించకుండా వదిలేయడంవల్ల వచ్చే ఆ నష్టాలేమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

**పెనాల్టీ చార్జీలు**

బ్యాంకులో మనకు ఒక అకౌంట్ ఉందంటే అందులో మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెనెన్స్ చేయాల్సిందే. ఒకవేళ మినిమమ్ బ్యాలెన్స్ మెయింటెయిన్ చేయకపోతే వాటిపై బ్యాంకు చార్జీలు వసూలు చేస్తుంది. చార్జీలు చెల్లించకపోతే ఖాతా మైనస్ బ్యాలెన్స్‌లోకి కూడా వెళ్తుంది. ఆ తర్వాత ఆ బ్యాంకు ఖాతాను ఉపయోగించి లావాదేవీలు చేయాలంటే ముందుగా మైనస్ బ్యాలెన్స్‌ను క్లియర్ చేయాల్సిందే.

**ఖాతాలో సొమ్ము మాయం**

బ్యాంక్ అకౌంట్ ఉపయోగించకుండా అలాగే వదిలేస్తే అందులో ఉన్న మినిమమ్ బ్యాలెన్స్ క్రమంగా మాయమవుతుంది. ఉదాహరణకు మీకు ఓ ఐదు ఖాతాలు ఉన్నాయనుకుంటే.. మీరు ఎన్ని ఖాతాలను ఉపయోగించకుండా వదిలేస్తారో అన్ని ఖాతాల్లో ఉన్న నగదు చార్జీల రూపంలో క్రమంగా మాయమవుతుంది. కాబట్టి ఉపయోగంలో లేని ఖాతాలు ఉంటే వెంటనే క్లోజ్ చేసుకోవడం ఉత్తమం.

**మోసపోయే ప్రమాదం**

టెక్నాలజీ పెరుగుతున్న వేళ మోసాలు కూడా ఎక్కువవుతున్నాయి. మీరు మీ ఖాతాను ఎక్కువ కాలం ఉపయోగించకుండా ఉంటే.. వాటిని సైబర్ నేరగాళ్లు ఉపయోగించుకునే ప్రమాదం ఉంది. దాంతో మీరు చిక్కుల్లో పడే ఆస్కారం ఉంటుంది. కాబట్టి బ్యాంక్ ఖాతాను ఉపయోగించకపోతే కనీసం అప్పుడప్పుడైనా చెక్ చేస్తుండాలి. వద్దు అనుకుంటే క్లోజ్ చేయాలి.

**సిబిల్‌పై ప్రభావం**

బ్యాంకు అకౌంట్‌ను ఉపయోగించకుండా వదిలేస్తే అందులో ఉన్న బ్యాలెన్స్ చార్జీల రూపంలో తరిగిపోతుంది. ఆ తర్వాత కూడా నిరుపయోగంగా ఉంటే మైనస్ బ్యాలెన్స్‌లోకి వెళ్తుంది. మైనస్ బ్యాలెన్స్ అంటే మనం బ్యాంకుకు అప్పు ఉన్నామని అర్థం. కాబట్టి అకౌంట్ మైనస్‌లోకి వెళ్తే.. మీ సిబిల్‌పై ప్రభావం పడుతుంది. అలా జరగవద్దంటే ఉపయోగంలో లేని ఖాతాలను వెంటనే క్లోజ్ చేయాలి.

# పొదుపు ఖాతాతోనే 7 శాతం వడ్డీ.. నెల నెలా జమ.. మే 1 నుంచే అమలు!




ప్రతి ఒక్కరికి బ్యాంకులో పొదుపు ఖాతా ఉండడం అనేది సర్వసాధారణం. ఏ చిన్న ఆర్థిక లావాదేవీ నిర్వహించాలన్నా బ్యాంక్ అకౌంట్ ఉండాలి. బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్లో ఉండే బ్యాలెన్స్ పై బ్యాంకులు సైతం వడ్డీ చెల్లిస్తాయి. అయితే చాలా తక్కువగా ఉంటుంది. కొందరికి వడ్డీ వస్తుందని తెలియదు కూడా. దీంతో సేవింగ్స్ అకౌంట్‌లోని డబ్బులను తీసి ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తుంటారు. కానీ, ఆర్‌బీఎల్ బ్యాంక్ (%=దీూ ధీుఅ౯%) అదిరే శుభవార్త చెప్పింది. మే 1, 2025 నుంచి కొత్త రూల్స్ తీసుకొచ్చింది. సేవింగ్స్ అకౌంట్ వడ్డీని నెల నెలా జమ చేసేందుకు సిద్ధమైంది. దీంతో అధిక వడ్డీ రానుంది. సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటును రోజు వారీ ముగింపు బ్యాలెన్స్ ఆధారంగా లెక్కించనున్నారు. ఇలా వచ్చిన వడ్డీని నెల చివర్లో ఖాతాలో జమ చేస్తారు. ఆర్‌బీఎల్ బ్యాంక్ ఏప్రిల్ 26, 2025 రోజున ఈ-మెయిల్ ప్రకారం సేవింగ్స్ అకౌంట్లోని బ్యాలెన్స్ ఆధారంగా వడ్డీ చెల్లించనుంది. గరిష్ఠంగా 7 శాతం వరకు వడ్డీ ఆఫర్ చేస్తోంది. కొత్త రూల్స్ మే 1, 2025 నుంచే అమలులోకి వస్తాయని తెలిపింది. ఇకపై ఆర్‌బీఎల్ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ ఉన్న వారికి నెల నెలా వడ్డీ జమ కానుంది. ఇది అదనపు లాభాన్ని అందించనుంది.

**సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేట్లు**

పొదుపు ఖాతాలో రోజు వారీ బ్యాలెన్స్ రూ. 1 లక్ష వరకు ఉంటే 3.25 శాతం వడ్డీ చెల్లించనుంది.
రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షల వరకు 3.5 శాతం వడ్డీ ఇవ్వనుంది.
రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు 5 శాతం ఆఫర్ చేస్తోంది.
రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు 6.50 శాతం వడ్డీ ఇవ్వనుంది.
రూ. 25 లక్షల నుంచి రూ. 3 కోట్ల వరకు బ్యాలెన్స్ ఉంటే 7 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.
రూ. 3 కోట్ల నుంచి రూ. 7.5 కోట్ల వరకు బ్యాలెన్స్ ఉంటే 6.50 శాతం వడ్డీ ఇస్తోంది.
రూ. 7.5 కోట్ల నుంచి రూ. 50 కోట్ల వరకు బ్యాలెన్స్ మెయింటెన్స్ చేస్తే 6.25 శాతం వడ్డీ వస్తుంది.
రూ. 50 కోట్ల నుంచి రూ. 200 కోట్ల వరకు బ్యాలెన్స్ ఉంచితే 6 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది.
రూ. 200 కోట్ల నుంచి రూ. 400 కోట్ల వరకు బ్యాలెన్స్ ఉంటే %MIBOR% వడ్డీ ఇస్తుంది.

# ఎల్&టీ ఫైనాన్స్ లిమిటెడ్రూ.2,644 కోట్ల కన్సాలిడేటెడ్ లాభంతో ఆల్-టైమ్-హై రికార్డ్

**న్యూఢిల్లీ-నవభూమి:** భారతదేశంలోని ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలలో ఒకటైన ఎల్&టీ ఫైనాన్స్ లిమిటెడ్ (2024-25 ఆర్థిక సంవత్సరానికి పన్ను తర్వాత రూ.2,644 కోట్ల కన్సాలిడేటెడ్ లాభాన్ని సాధించి ఆల్-టైమ్-హై రికార్డ్‌ను నమోదు చేసింది, ఇది గత ఏడాదితో పోల్చితే 14% వృద్ధిని సూచిస్తుంది. అలాగే, మార్చి 31, 2025తో ముగిసిన నాల్గవ త్రైమాసికంలో కంపెనీ రూ. 636 కోట్ల ఎల్&టీ ని ప్రకటించింది, ఇది నాల్గవ త్రైమాసికంలో 15% వృద్ధిగా నమోదైంది. రెటైల్ బుక్ ఇప్పుడు రూ.95,180 కోట్ల వద్ద నిలిచింది, ఇది మార్చి 31, 2024తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి సరిపోల్చితే 19% వృద్ధిని చూపుతోంది. సంస్థ వార్షికంగా రూ.60,040 కోట్ల రెటైల్ డిస్బర్స్‌మెంట్లను నమోదు చేసింది, ఇది సంవత్సరాంతరంగా 11% పెరుగుదల. మార్చి 31, 2025తో ముగిసిన నాల్గవ త్రైమాసికానికి సంబంధించి, త్రైమాసిక రెటైల్ డిస్బర్స్‌మెంట్ రూ.14,899 కోట్ల స్థాయిలో స్థిరంగా ఉంది. ఏప్రిల్ 25, 2025న జరిగిన బోర్డు సమావేశంలో, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి %బాడు% ఫైనాన్స్ లిమిటెడ్ బోర్డు ఈక్విటీ షేర్‌కు రూ.2.75 తుది డివిడెండ్‌ను (షేర్ ముఖ విలువ రూ.10) సిఫార్సు చేసింది. ఇది సంస్థ ఇప్పటివరకు ప్రకటించిన అత్యధిక డివిడెండ్‌గా నిలిచింది. ఈ డివిడెండ్‌కి సభ్యులు రానున్న వార్షిక సాధారణ సమావేశంలో ఆమోదం తెలిపిన తర్వాత, AGM తేదీ నుండి 30 రోజులలోపు ఈ డివిడెండ్ చెల్లించబడుతుంది. ఇంకా, కస్టమర్ల కోసం శక్తివంతమైన డిజిటల్ ఛానెల్‌గా ఎదిగిన కంపెనీ యొక్క కస్టమర్-ఫేసింగ్ PLANET యాప్ 3.0 (బీటా) ఇప్పటి వరకు 1.72 కోట్లకు పైగా డౌన్‌లోడ్‌లను సాధించింది, వీటిలో 16 లక్షలకు పైగా డౌన్‌లోడ్‌లు గ్రామీణ ప్రాంతాల్లో నుంచి వచ్చాయి. ఈ యాప్ ద్వారా ఇప్పటివరకు 6.85 కోట్లకుపైగా అభ్యర్థనలు ప్రాసెస్ చేయబడినాయి, రూ.3,800 కోట్లకుపైగా వసూలు చేయబడింది, అలాగే వెబ్‌తో కలిసి కలిపి రూ.12,700 కోట్లకుపైగా రుణాలు మంజూరయ్యాయి. కంపెనీ తాజాగా మరింత స్మార్ట్, వేగవంతమైన మరియు కస్టమర్-సెంట్రిక్ వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించింది. ఆర్థిక ఫలితాలపై వ్యాఖ్యానిస్తూ, మిస్టర్ సుదీప్తా రాయ్, మేనేజింగ్ డైరెక్టర్ - సిఇఒ, LTF ఇలా అన్నారు, "గణనీయమైన ప్రతికూల పరిస్థితులతో కూడిన సంవత్సరంలోనూ, సవాలుతో కూడిన వాతావరణంలో మేము వృద్ధి చెందగలమన్న మా సామర్థ్యాన్ని చాటుతూ, మా పనితీరు స్థిరంగా నిలిచింది. వ్యాపారాల్లో సేకరణ సామర్థ్యంపై గట్టిగా దృష్టి పెట్టడం మరియు బలమైన ఆస్తి నాణ్యతపై మా అచంచలమైన నిబద్ధత ఈ స్థిరతకు బలాన్ని చేకూర్చాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం, సుస్థిరమైన మరియు ఊహించదగిన వృద్ధికి పునాది వేసిన ముఖ్యమైన దశగా మేము భావిస్తున్నాము."కార్యాచరణపరంగా, ద్విచక్ర వాహన ఫైనాన్స్ విభాగంలో మా తదుపరి తరం AL-ML ఆధారిత క్రెడిట్ పూచీకత్తు ఇంజిన్ అయిన 'ప్రాజెక్ట్ సైక్లోప్స్ 2.0'ను 100% విజయవంతంగా అమలు చేయడం ద్వారా, అలాగే వ్యవసాయ పరికరాల ఫైనాన్సింగ్‌లో కొనసాగుతున్న రోల్‌అవుట్‌తో, మేము గణనీయమైన పురోగతిని సాధించాము. అదేవిధంగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించిన PhonePe, CRED మరియు అమెజాన్ పే లాంటి ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లతో మా భాగస్వామ్యాలు మంచి ఊపందుకున్నాయి. ఈ సంవత్సరంలో మేము రిస్క్ మరియు క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌లను బలోపేతం చేయడంపై ప్రధానంగా దృష్టి పెట్టినప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానం మరియు మానవ వనరుల పరంగా సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో కూడా మేము ప్రాధాన్యత ఇచ్చాముఇది భవిష్యత్‌లో మాకు ముఖ్యమైన ఆధారంగా నిలవనుంది. ఎల్&టీ ఫైనాన్స్ లిమిటెడ్ తన కస్టమర్లకు నాణ్యమైన సేవలను అందించడంపై నిరంతర దృష్టి సారిస్తోంది. సంస్థ ఎప్పటికప్పుడు ఆపరేషనల్ ఎక్సలెన్స్, కస్టమర్ సెంట్రిసిటీ, బలమైన పాలన, మరియు జాగ్రత్తగా అమలు చేసే రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఇవన్నీ డిజిటల్-ఫస్ట్ దృక్పథంతో శక్తిని పొందుతున్నాయి, ఇది సంస్థ యొక్క వృద్ధి ధోరణిని సస్టెయిన్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తోంది. కస్టమర్‌ను కేంద్రబిందువుగా చేసుకుని, పూర్తిగా డిజిటల్-ఆధారితమైన ఫైనాన్షియల్ సర్వీసెస్ పవర్‌హౌస్‌గా మేము ఎదుగుతూనే ఉంటాము."

# గుడ్ న్యూస్..అక్షయ తృతీయకు ముందే తగ్గిన బంగారం, వెండి ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో బంగారం ధరలు ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరుకున్న తర్వాత క్రమంగా మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు (ఏప్రిల్ 28న) గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం 24 క్యారెట్ల బంగారం ధర స్వల్పంగా తగ్గి రూ. 98,200 స్థాయిలో ఉండగా, 22 క్యారెట్ల పసిడి రేటు రూ. 90,010గా ఉంది. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ. 98,300 స్థాయిలో ఉండగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 90,160గా కలదు.
వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..మరోవైపు ఈరోజు కేజీ వెండి ధర కిలోకు 100 రూపాయలు తగ్గాయి, హైదరాబాద్‌లో రూ. 111,800గా ఉంది. ఇక ఢిల్లీలో కిలో వెండి రేటు రూ.101,800 కాగా, చెన్నైలో రూ. 111,800, పూణేలో రూ.101,800, బెంగళూరులో రూ.101,800గా ఉంది. మార్కెట్లు మొదలైన తర్వాత వీటి ధరలు మళ్లీ మారే అవకాశం ఉంది. అంతేకాదు ఇప్పటికే లక్ష రూపాయలకు చేరుకున్న పసిడి ధరలు అక్షయ తృతీయ పండుగ రోజు ఇంకా పెరిగే ఛాన్స్ ఉందని పలువురు చెబుతుండగా, తగ్గుతాయని మరికొంత మంది అంటున్నారు.

**పసిడి స్వచ్ఛత ఎలా తెలుసుకోవాలి..**

బంగారం స్వచ్ఛతను అంచనా వేయడంలో (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్) హాల్ మార్కు ఒక ప్రధాన సూచికగా ఉంటుంది. ఈ క్రమంలో 24 క్యారెట్ల బంగారం 99.9% స్వచ్ఛమైనదిగా గుర్తించబడుతుంది. అంటే ఇందులో ఎలాంటి కల్తీ లేకుండా శుద్ధ బంగారం ఉంటుంది. 22 క్యారెట్ల బంగారం దాదాపు 91% స్వచ్ఛత కలిగి ఉంటుంది. ఇందులో 9% ఇతర లోహాలు కలిపి బంగారం తయారు చేస్తారు. ఇది రాగి, వెండి, జింక్ వంటి లోహాలను కలిపి ఆభరణాలను రూపొందించేందుకు ఉపయోగిస్తారు.
మార్కెట్లో ఉన్న డిమాండ్:ప్రతీ క్యారెట్ బంగారంపై ప్రత్యేకమైన హాల్ మార్కు ఉంటుంది. 24 క్యారెట్ల బంగారంపై 999, 23 క్యారెట్లపై 958, 22 క్యారెట్లపై 916, 21 క్యారెట్లపై 875, 18 క్యారెట్లపై 750 అనే సంఖ్యలు ఉంటాయి. ఈ హాల్ మార్కుల ద్వారా మీరు బంగారం స్వచ్ఛతను సులభంగా అంచనా వేసుకోవచ్చు. అమెరికా డాలర్ విలువ పడిపోవడం, అంతర్జాతీయ మార్కెట్లో బంగారానికి ఉన్న డిమాండ్, వాణిజ్య యుద్ధం వంటి పరిస్థితుల నేపథ్యంలో వీటి ధరలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# గోల్డ్ కాయిన్స్ కొనాలా లేదా బంగారు నగలు కొనాలా అని డౌటా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రస్తుతం భారత్‌లో బంగారం ధర లక్షకు చేరువగా ఉంది. ధర మరింత పెరగొచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనేక మంది బంగారంపై పెట్టుబడులకు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటప్పుడు సహజంగానే గోల్డ్ కాయిన్స్ కొనాలా లేదా బంగారు నగలు కొనాలా అన్న ప్రశ్న తలెత్తుతుంది. రెండింట్లో ఏది ఎంపిక చేసుకోవాలనే దానిపై నిపుణులు పలు సలహాలు సూచనలు చేశారు. వీటి ఆధారంగా వినియోగదారులు ఓ నిర్ణయానికి రావచ్చు. నిపుణులు చెప్పే దాని ప్రకారం.. గోల్డ్ కాయిన్స్, బంగారు నగలు వేటికవే ప్రత్యేకమైనవి. వేటి ఉపయోగాలు వాటికి ఉన్నాయి. అయితే, బంగారంపై పెట్టుబడులు పెట్టాలనుకునే వారికి గోల్డ్ కాయిన్స్ అత్యంత అనుకూలం. గోల్డ్ కాయిన్స్ స్వచ్ఛత విషయంలో సందేహాలకు తావు ఉండదు. ప్రమాణిక తూకం, సర్టిఫికేషన్‌తో ఇవి అందుబాటులో ఉంటాయి. ఇక సాధారణ బంగారు నగల కంటే వీటి నిల్వ రవాణా చాలా సులభం. దీర్ఘకాలిక పెట్టుబడులకు బంగారపు నాణేలు అత్యంత అనుకూలం. వీటికి మార్కెట్‌లో ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. దీంతో, తక్షణం విక్రయించి సొమ్ము చేసుకోవచ్చు. తయారీ ఖర్చులు వంటి వాటి బెడద ఉండదు కాబట్టి వాటి విలువలో తరుగు ఉండదు. బంగారాన్ని కేవలం పెట్టుబడి సాధనంగా భావించే వారికి గోల్డ్ కాయిన్స్‌కు మించినవి లేవని నిపుణులు చెబుతున్నారు. ఇక బంగారు నగలకు పెట్టుబడి సాధనాలుగానే కాకుండా సాంస్కృతిక విలువ కూడా ఉంటుంది. బంగారు నగలు ధరించడం ఎంతో మందికి ఓ సెంటిమెంట్. తల్లిదండ్రులు లేదా తాతముత్తాల నుంచి వచ్చిన కొన్న ఆభరణాలను కొందరు జాగ్రత్తగా దాచుకుంటారు. నచ్చిన వ్యక్తులు ఇచ్చిన బంగారు నగలకు ప్రాముఖ్యత గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కాబట్టి, జనాల దృష్టిలో బంగారు నగలకు సాంస్కృతిక ప్రాముఖ్యత చాలా ఎక్కువ. ఇక తయారీ ఖర్చులు, తరుగు వంటి వాటి కారణంగా బంగారం నగల రీసేల్ వాల్యూ తక్కువగానే ఉంటుంది. దీంతో, పెట్టుబడి సాధనంగా వీటి విలువ కొంత తగ్గుతుంది. ఇక బంగారు కాయిన్స్ కంటే ఎక్కువ డబ్బు వెచ్చించి వీటిని సొంతం చేసుకోవాల్సి ఉంటుంది. నగల డిజైన్ పాతదనో, లేదా తరుగు ఉందనే కారణాలతో వీటిని తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది. బంగారు నాణేలతో పోలిస్తే వీటి లిక్విడిటీ (డబ్బుగా మార్చుకునే సౌలభ్యం) తక్కువ. ఇక బంగారు నగలను స్టేటస్ సింబల్‌గా భావించేవారు వీటిపైనే ఎక్కువ మొగ్గు చూపుతారు.

# యూట్యూబ్ భారత్ మేనేజింగ్ డైరెక్టర్‌గా గుంజన్ సోనీ..



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ దిగ్గజం యూట్యూబ్ కంపెనీ భారత దేశం మేనేజింగ్ డైరెక్టర్‌గా గుంజన్ సోనీని నియమించినట్లుగా సోమవారం వెల్లడించింది. బిజినెస్, టెక్నాలజీ, మార్కెటింగ్, ఈ-కామర్స్ రంగాల్లో రెండు దశాబ్దాలకుపైగా అనుభవం ఉన్న ఆమె భారత్‌లో యూట్యూబ్ వృద్ధి, ఆవిష్కరణ ప్రయత్నాలకు బాధ్యత వహించబోతున్నట్లుగా ఆల్ఫాబెట్ యాజమాన్యంలోని వీడియో ప్లాట్‌ఫామ్ ప్రకటించింది. ఈ సందర్భంగా యూట్యూబ్ ఆసియా పసిఫిక్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ ఆనంద్ మాట్లాడుతూ.. భారత్‌లో యూట్యూబ్ ప్రయాణం ఎంతో ఉత్సాహంగా, శక్తివంతంగా సాగుతోంద న్నారు. అపారమైన సృజనాత్మకత, సామర్థ్యం ఉన్న దేశం భారత్ అన్న ఆయన.. అపారమైన అనుభవం ఉన్న గుంజన్‌కు స్వాగతం పలుకుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. క్రియేటర్ ఎకానమీ, భారతదేశ వీడియో కామర్స్ రంగంపై ఆమెకున్న లోతైన అవగాహన, నాయకత్వ పటిమతో క్రియేటర్ల వృద్ధిని వేగవంతం చేసేందుకు, కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడం, వినియోగదారులను ఆకట్టుకునేందుకు, డిజిటల్ ఇండియా ప్రయాణానికి మరింత తోడ్పాటునందించేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంజన్ సోనీ మాట్లాడుతూ.. యూట్యూబ్‌లో చేరడం గౌరవంగా భావిస్తున్నానని.. అదే సమయంలో ఉత్సాహంగా ఉన్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా క్రియేటర్లను యూట్యూబ్ శక్తివంతం చేస్తున్న తీరు, కమ్యూనిటీలను కలుపుతున్న విధానం స్ఫూర్తిదాయకమని.. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ క్రియేటర్లకు కొత్త అవకాశాలను అందించడంలో, ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకులను చేరుకునేలా యూట్యూబ్ పాత్రను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని గుంజన్ పేర్కొన్నారు. ఆమె గతంలో సింగపూర్ కేంద్రంగా పని చేసిన జలోరాలో గుంజన్ గతంలో జలోరా, స్టార్ ఇండియా, మింత్రాలో సేవలందించారు. సింగపూర్ కేంద్రంగా పనిచేసిన జలోరా గ్రూప్‌కు ఆరేళ్లపాటు సీఈఓగా పని చేశారు. అక్కడ ఆమె కొత్త కేటగిరీలు, వ్యాపార నమూనాలను పరిచయం చేయడంలో, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు. అంతకు ముందు ఆమె స్టార్ ఇండియాలో ఈవీపీగా, మింత్రాలో సీఎంఓగానూ సేవలందించారు. పనిచేశారు.

మెకిన్సీలో కన్స్యూమర్ అండ్ మార్కెటింగ్ విభాగంలో భాగస్వామిగా వ్యవహరించారు.

# అక్షయ తృతీయకు గోల్డ్ కొనలా..వెయిట్ చేయాలా

**న్యూఢిల్లీ-నవభూమి:** అక్షయ తృతీయ రోజు వస్తే చాలు, అనేక మంది కూడా బంగారం కొనుగోలు చేయాలని భావిస్తారు. వేదాలు, పురాణాల ప్రకారం, సంపద, ఐశ్వర్యం పొందడానికి ఈరోజు మంచిదని చెబుతుంటారు. కానీ సంపదను ఆకర్షించే ఈ రోజున గోల్డ్ కొనడం ప్రస్తుతం ఎక్కువగా చర్చించబడే విషయంగా మారిపోయింది. ఎందుకంటే పసిడి ధరలు ఇప్పుడు దాదాపు లక్షకు చేరి మళ్లీ కొంత తగ్గుముఖం పట్టాయి. ఇలాంటి సమయంలో గోల్డ్ కొనుగోలు చేయాలా వద్దా, కొంటే ఎలాంటి పసిడి తీసుకోవాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. ప్రస్తుతం ఏప్రిల్ 27, 2025న హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.98,240 (10 గ్రాములకు) గా ఉంది. అయితే, ఈ ధర అక్షయ తృతీయ (ఏప్రిల్ 30న) సందర్భంగా తగ్గుతుందా, లేదంటే పెరుగుతుందా అని అనేక మంది ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ధరలు తగ్గింతే కొనుగోలు చేయాలని పలువురు చూస్తుండగా, మరికొంత మంది మాత్రం పెరిగినా కూడా మంచి రోజు కాబట్టి కొంత వరకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ప్రతి ఏటా కూడా అక్షయ తృతీయ రోజు అలవాటుగా గోల్డ్ కొనుగోలు చేసేవారు సైతం ఈసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.
ధరల మార్పు..గత వారం (ఏప్రిల్ 18, 2025) 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.97,580 (10 గ్రాములకు)గా ఉంది. అంటే పది రోజుల్లో ధరలో రూ.660 పెరుగుదల వచ్చింది. మరోవైపు గత నెల (మార్చి 20, 2025)న 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.89,320 (10 గ్రాములకు) గా ఉంది . ఈ ధర నెల రోజుల్లో రూ.8,920 పెరుగుదలతో ప్రస్తుతం రూ.98,240కి చేరుకుంది. రానున్న రోజుల్లో మాత్రం ఈ ధరలు మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.


**కొనుగోలు చేయాలా, వేచి ఉండాలా**

అక్షయ తృతీయ పండుగ సందర్భంగా గోల్డ్ ధరలు సాధారణంగా పెరుగుతాయి. అయినప్పటికీ ఈ సీజన్‌లో కొనుగోలు చేయడం మంచిదని భావిస్తారు. కానీ ప్రస్తుత ధరలు, భవిష్యత్తులో రేట్లు పెరిగే అవకాశాలను పరిగణలోకి తీసుకుని కొనుగోలు చేయాలని నిపుణులు చెబుతున్నారు. గత వారం, గత నెలలో ట్రెండ్ కొనసాగే అవకాశం ఉన్నందున ఆఫర్లను తెలుసుకుని కొనుగోలు చేయవచ్చని అంటున్నారు. అంతేకాదు కొనుగోలు చేసే విషయంలో మీ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తులో ధరల పెరుగుదల వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని చెబుతున్నారు. భారీగా ధరలు పెరిగితే కొంత రోజులు వేచి చూడడం మంచిదంటున్నారు.
దీంతోపాటు గోల్డ్ కొనుగోలు చేసే సమయంలో హాల్‌మార్క్ ఉన్న వాటిని చూసి తీసుకోవాలని సూచిస్తున్నారు.

# వజ్రాలు కొంటున్నారా.. ఈ విషయాల్లో జాగ్రత్త



**న్యూఢిల్లీ-నవభూమి:** వజ్రాలు మొదటి సారి కొనే వారికి మనసులో అనేక సందేహాలు ఉంటాయి. వాటి క్వాలిటీ, సర్టిఫికేషన్ వంటి విషయాలపై పలు ప్రశ్నలు వస్తాయి. అయితే, వీటి గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. వెచ్చించిన డబ్బుకు తగిన వజ్రం దక్కుతుందని భరోసా ఇస్తున్నారు.
నిపుణులు చెప్పే దాని ప్రకారం, వజ్రాలు ధర ప్రధానంగా కట్, కలర్ (రంగు), క్లారిటీ, క్యారెట్‌పై ఆధారపడి ఉంటుంది. వజ్రాలు మిలమిలా మెరవాలంటే దాన్ని అత్యంత నైపుణ్యంతో కట్ చేయాల్సి ఉంటుంది. ఈ సానబెట్టడంలో ప్రామాణికత పాటించకపోతే వజ్రం డల్‌గా, మెరుపులు లేకుండా కనిపిస్తుంది. ధర కూడా తక్కువగానే ఉంటుంది. సాధారణంగా వజ్రంలో రంగులు తక్కువగా ఉంటే విలువ పెరుగుతుంది. వినడానికి కాస్త వింతగా ఉన్నా ఇది నిజం. ఇక వజ్రంలోపల ఉండే చిన్న చిన్న మలినాలు, మరకలు వజ్రం విలువను తగ్గిస్తాయి. వీటిని గుర్తించడం కూడా కొంచెం కష్టమే. నిపుణులు ప్రత్యేక పరికరాలతో వజ్రంలోని ఈ లోపాలను గుర్తించగలుగుతారు. ఇక వజ్రం బరువును క్యారెట్లలో కొలుస్తారు. అయితే, ఒకే క్యారెట్ వెయిట్ ఉన్న రెండు వజ్రాలు వాటిని సాన బెట్టిన తీరునుబట్టి భిన్నమైన సైజుల్లో కనిపిస్తాయి. ఇందులో ఆందోళన చెందాల్సిందేమీ లేదని నిపుణులు భరోసా ఇస్తున్నారు. క్యారెట్ అంటే చాలా మంది వజ్రం సైజు మాత్రమే అని అనుకుంటూ ఉంటారని, కాని వజ్రాన్ని ఎలా సానబెట్టారన్న దానిపై కూడా ఇది ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.
ఇక సహజసిద్ధంగా లభించే వజ్రాలకు, ల్యాబ్‌లో తయారు చేసే వజ్రాలకు వేటి ప్రత్యేకత వాటికి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సహజ వజ్రాలు భూగర్భంలో అత్యధిక పీడనం, ఉష్ణోగ్రతల మధ్య ఏర్పడతాయి. ల్యాబ్‌లో సరిగ్గా ఇవే పరిస్థితులను సృష్టించి వజ్రాలను తయారు చేస్తారు. నేరుగా చూస్తే ఈ రెండింటి మధ్య ఎటువంటి తేడా కనిపించదు. సాధారణ వజ్రాలతో పోలిస్తే 60 నుంచి 90 శాతం తక్కువ ధరకే లభిస్తాయి. ప్రజల్లో పర్యావరణంపై పెరుగుతున్న అవగాహన, నైతికత అంశాలు కారణంగా అనేక మంది ప్రస్తుతం ల్యాబ్‌లో తయారు చేసిన వజ్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇక నాణ్యతాపరంగా ల్యాబ్‌లో తయారు చేసిన వజ్రాల మధ్య తేడాలు దాదాపుగా ఉండవు.



## యూట్యూబర్ అల్లబదియా పాస్‌పోర్టు ఇచ్చేయండి.. సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** యూట్యూబర్ రణ్‌వీర్ అల్లబదియాకు సుప్రీంకోర్టు ఊరట కల్పించింది. పాస్‌పోర్టును అతనికి ఇచ్చేయాలని కోర్టు ఇవాళ ఆదేశించింది. అతనిపై నమోదు అయిన కేసుల్లో విచారణ పూర్తి అయిన నేపథ్యంలో కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూట్యూబర్ అల్లబదియా.. బీర్‌బైసెప్స్ షోతో పేరుగాంచిన విషయం తెలిసిందే. విదేశీ ప్రయాణం నేపథ్యంలో అతనికి పాస్‌పోర్టును అప్పగించాలని కోర్టు పోలీసుల్ని ఆదేశించింది.జస్టిస్ సూర్యకాంత్, ఎన్ కోటేశ్వర్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. అస్సాం, మహారాష్ట్ర ప్రభుత్వాలు విచారణ పూర్తి చేసినట్లు పేర్కొన్నాయి. పాస్‌పోర్టు కోసం మహారాష్ట్ర సైబర్ క్రైం బ్యూరోకు వెళ్లాలని కోర్టు ఆదేశించింది. అల్లబదియా తరపున సీనియర్ న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ వాదించారు. అల్లబదియాపై నమోదు అయిన కేసులన్నీ ఒక్కచోటకు చేర్చాలన్న అడ్వకేట్ అభ్యర్థనను స్వీకరిస్తున్నట్లు కోర్టు చెప్పింది.ఓ యూట్యూబ్ షోలో తల్లితండ్రుల శృంగారంపై అనుచిత కామెంట్ చేసిన అల్లబదియాపై పలు రాష్ట్రాల్లో కేసులు నమోదు అయ్యాయి. అయితే ఫిబ్రవరి 18వ తేదీన సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. అల్లబదియాను అరెస్టు చేయవద్దు అని పేర్కొన్నది. థానే పోలీసు స్టేషన్‌లో పాస్‌పోర్టును డిపాజిట్ చేయాలని ఆదేశించింది. అయితే విలువలు, హుందాతనంతో ద రణ్‌వీర్ షోను నడుపుకోవచ్చు అని మార్చి 3వ తేదీన సుప్రీంకోర్టు అల్లబదియాకు తెలిపింది.



## రాస్తున్న పరీక్ష ఆపించి.. విద్యార్థితో కోడి కోయించిన టీచర్



**జైపూర్-నవభూమి:**పరీక్ష రాస్తున్న విద్యార్థిని ప్రభుత్వ ఉపాధ్యాయుడు మధ్యలో ఆపించాడు. ఆ స్టూడెంట్‌తో కోడి కోయించి స్కిన్ తీయించి, ముక్కలుగా కట్ చేయించాడు. వండేందుకు ఆ కోడి మాంసాన్ని ఇంటికి పంపించాడు. ఈ విషయం గ్రామస్తుల దృష్టికి వెళ్లింది. దీంతో మంత్రికి వారు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆ టీచర్‌ను సస్పెండ్ చేశారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొటాడ ప్రాంతంలోని ప్రభుత్వ స్కూల్‌లో పరీక్షలు జరుగుతున్నాయి. 9వ తరగతి విద్యార్థి రాహుల్ కుమార్ పరీక్ష రాస్తుండగా టీచర్ మోహన్‌లాల్ దోడా పిలిచాడు. అతడు పరీక్ష రాయడాన్ని మధ్యలోనే ఆపించాడు. ఆ స్టూడెంట్ చేత కోడిని కోయించాడు. దాని స్కిన్ తీసి ముక్కలుగా కట్ చేయించాడు. ఆ తర్వాత వంట కోసం కోడి మాంసాన్ని తన ఇంటికి పంపాడు.కాగా, ఆ గ్రామస్తులకు ఈ విషయం తెలిసింది. దీంతో ఉపాధ్యాయుడు మోహన్‌లాల్ ప్రవర్తనపై వారు మండిపడ్డారు. మంత్రి బాబులాల్ ఖరారీని కలిసి దీని గురించి ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశించారు.మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోహన్‌లాల్ నెల కిందట స్కూల్ కుక్‌ను తొలగించాడు. నాటి నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందడం లేదు. అలాగే ఆ టీచర్ విద్యార్థులతో వ్యక్తిగత పనులు చేయిస్తున్నాడని స్థానికులు ఆరోపించారు. ఈ రిపోర్ట్ ఆధారంగా ఉపాధ్యాయుడు మోహన్‌లాల్‌ను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు.

## భారత నావికాదళంలోకి రఫేల్ యుద్ధ విమానాలు..

### మెగా డీల్‌పై సంతకాలు చేసిన ఇరు దేశాలు



**శ్రీనగర్--నవభూమి:**భారత సైనిక దళాల సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. రఫేల్ మెరైన్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్ దేశంతో భారత్ ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఆ ఒప్పందంపై ఇరు దేశాలూ సంతకాలు చేశాయి. భారత్, ఫ్రాన్స్ ప్రభుత్వాల మధ్య కుదిరిన ఈ భారీ ఒప్పందం విలువ 7.6 బిలియన్ డాలర్లు. అంటే భారత కరెన్సీలో రూ.64,000 కోట్లన్నమాట.ఒప్పందంలో భాగంగా భారత నావికాదళానికి ఫ్రాన్స్ నుంచి 22 సింగిల్ సీటర్, నాలుగు టు సీటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు రానున్నాయి. దీంతోపాటు వీటి నిర్వహణ, స్పేర్లు, లాజిస్టికల్ సపోర్ట్, శిక్షణకు సంబంధించిన అంశాలు సకాలంలో పూర్తయ్యేలా ఫ్రాన్స్ ప్రభుత్వమే చూసుకుంటుంది. వాయుదళ శక్తిని పటిష్టం చేసే లక్ష్యంతో రఫేల్ యుద్ధ విమానాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తున్నది. శక్తివంతమైన ఆధునిక ఆయుధ వ్యవస్థలను కలిగి ఉండే రఫేల్ యుద్ధ విమానాలు భారత నౌకాదళ పోరాట శక్తిని బలోపేతం చేయనున్నాయి. నాలుగేళ్లలో రఫేల్ యుద్ధ విమానాల సరఫరా ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇక ఒప్పందం ప్రకారం.. తొలిబ్యాచ్ 2029లో రావొచ్చని.. 2031 నాటికి మొత్తం చేతికొచ్చే అవకాశాలున్నాయి.

## యూనివర్సిటీలో కశ్మీరీ విద్యార్థిపై దాడి.. పోలీస్ అదుపులో వ్యక్తి



న్యూఢిల్లీ: యూనివర్శిటీ క్యాంపస్‌లో కశ్మీరీ విద్యార్థిపై దాడి జరిగింది. దీంతో విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. విద్యార్థిపై దాడి సంఘటనను ఖండించాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. జామియా మిలియా ఇస్లామియా యూనివర్శిటీ క్యాంపస్‌లో కశ్మీరీ మహిళా విద్యార్థినిపై మెస్ వర్కర్ దాడి చేశాడు. ఆదివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఎంఏ రెండో ఏడాది చదువుతున్న 24 ఏళ్ల కశ్మీరీ లేడీ స్టూడెంట్‌ను 22 ఏళ్ల మెస్ వర్కర్ అబిద్ కొట్టాడు.కాగా, జామియా మిలియా ఇస్లామియా యూనివర్శిటీలోని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ ఈ దాడిని తీవ్రంగా ఖండించింది. ఇది తీవ్రమైన భద్రతా లోపమని పేర్కొంది. జమ్ముకశ్మీర్ స్టూడెంట్స్ అసోసియేషన్ కూడా ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు మద్దతు, అధికారులతో అనుసంధానం కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.మరోవైపు ఈ సమాచారం అందుకున్న పోలీసులు మెస్ వర్కర్ అబిద్‌ను అదుపులోకి తీసుకున్నారు. కశ్మీరీ మహిళా విద్యార్థిని ఫిర్యాదు ఆధారంగా అతడిపై చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారి తెలిపారు. అయితే జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో ఈ సంఘటన జరుగలేదని చెప్పారు. కేవలం వ్యక్తిగత వివాదం వల్ల కశ్మీర్ విద్యార్థినిపై దాడి జరిగిందని వెల్లడించారు.

## ఓటీటీ, సోషల్ మీడియాల్లో అశ్లీల కాంటెంట్..

**న్యూఢిల్లీ-నవభూమి:** ఓటీటీలతో పాటు సోషల్ మీడియాల్లో అశ్లీల కాంటెంట్‌ను బ్యాన్ చేయాలా వద్దా అన్న అంశంపై కేంద్ర ప్రభుత్వ వివరణ కోరింది సుప్రీంకోర్టు ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయ స్థానం కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. సెక్సువల్ కాంటెంట్ స్ట్రీమింగ్ విషయంలో తీసుకోవాల్సిన చర్యలు, అమలు చేయాల్సిన నిబంధనల గురించి వెల్లడించాలని కేంద్రాన్ని సుప్రీం కోరింది. జస్టిస్ బీఆర్ గవాయి, ఆగస్టిన్ జార్జ్ మాషితో కూడిన ధర్మాసనం ఈ అంశాన్ని విచారించింది. ఓటీటీతో పాటు సోషల్ మీడియాల్లో అశ్లీల కాంటెంట్ అంశంపై నిర్ణయం తీసుకునే అధికారం ఎగ్జిక్యూటివ్, శాసన వ్యవహారాల పరిధిలో ఉంటుందని కోర్టు చెప్పింది. ఎగ్జిక్యూటివ్, శాసన వ్యవహారాలను ఆక్రమిస్తున్నట్లు ఇప్పటికే సుప్రీంకోర్టుపై ఆరోపణలు వస్తున్నాయని జస్టిస్ గవాయి తన తీర్పులో చెప్పారు.కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. సెక్సువల్ కాంటెంట్ అంశంలో ప్రభుత్వమే ఏదైనా చేయాలని సుప్రీం ధర్మాసనం తుషార్ మెహతాను కోరింది. ప్రస్తుతం కొన్ని నిబంధనలు అమలులో ఉన్నాయని, కొన్నింటి అంశంలో సమాలోచనలు జరుగుతున్నట్లు ఆయన చెప్పారు.

## వదినా మరదళ్ల ప్రేమకథ.. బాలికను తీసుకెళ్లి రహస్యంగా పెళ్లి చేసుకున్న ముగ్గురు పిల్లల తల్లి



**బిహార్-నవభూమి:** బిహార్‌కు చెందిన ఓ మహిళకు ఇప్పటికే పెళ్లి అయి ముగ్గురు పిల్లలు కూడా పుట్టారు. ఇన్నాళ్లూ భర్త, పిల్లలతో హాయిగా ఉన్న ఆమెకు.. తన అన్న భార్య చెల్లెలితో స్నేహం ఏర్పడింది. మరదలు చాలా చిన్నది కాగా.. ఎప్పుడూ వదినతోనే ఉండేది. ఇలా వీరిద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. ఆడవాళ్లే అయినప్పటికీ వీరిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. ఆ బాలిక కోసం మహిళ భర్త, ముగ్గురు పిల్లలను కూడా వదిలేసి పారిపోయింది. రహస్యంగా వీరిద్దరూ పెళ్లి కూడా చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అంతా షాక్ అయ్యారు. ఏం చేయాలో పాలుపోక పోలీసులను ఆశ్రయించారు. బిహార్‌లోని దర్భంగా జిల్లా కుషేశ్వర్‌స్థాన్‌కు చెందిన క్రితికి 11 ఏళ్ల క్రితమే కృష్ణ మాంఝితో వివాహం జరిగింది. వీరిద్దరి అన్యోన్య దాంపత్యానికి ప్రతీకలుగా ముగ్గురు పిల్లలు కూడా పుట్టారు. అయితే చాలా కాలం వీరంతా హాయిగానే ఉండగానే.. ఇటీవలే క్రితికి.. తన అన్న భార్య చిన్న చెల్లెలితో స్నేహం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. అయితే ఈ విషయం ఇంట్లో ఎవరికీ తెలియదు. గత రండేళ్లుగా ఆ మైనర్ బాలిక, క్రితిలు చాటుమాటుగా ప్రేమాయణం సాగిస్తున్నారు. ప్రతిరోజూ గంటల తరబడి ఫోన్లు మాట్లాడేవారు. అయితే ఇద్దరూ ఆడవాళ్లే కావడంతో ఎవరికీ ఎలాంటి అనుమానం రాలేదు. కానీ క్రిత భర్త కృష్ణకు మాత్రం ఆమె తరచుగా ఫోన్ మాట్లాడడం నచ్చక చాలా సార్లు గట్టిగా నిలదీశాడు.


దీంతో క్రితి మైనర్ మరదలితో.. తనకున్న సంబంధం గురించి చెప్పేసింది. తామిద్దరూ ప్రేమించుకుంటున్నట్లు, పెళ్లి కూడా చేసుకోవాలనుకుంటున్నట్లు వివరించింది. దీంతో భర్త షాకయ్యాడు. మనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు, నువ్విప్పుడు ఇలా చేయడం సరికాదని తెలిపాడు. మరదలి వయసు తమ కుమార్తెల వయసుకు చాలా దగ్గరగా ఉంటుందని.. ఇదంతా తప్పని వివరించాడు. కానీ క్రితి మాత్రం భర్త మాటలను కొట్టి పారేసింది. వద్దని చెప్తే.. మిమ్మల్ని వదలేసి వెళ్లిపోతానంటూ బెదిరింపులకు పాల్పడింది. దీంతో భర్త కూడా ఆమె తరచుగా ఫోన్లు మాట్లాడినా ఏమీ చేయలేకపోయాడు.ఇదిలా ఉండగా.. ఏప్రిల్ 6వ తేదీన క్రిత తన మైనర్ మరదలిని తీసుకుని రాజస్థాన్‌కు పారిపోయింది. అక్కడే వీరిద్దరూ రహస్యంగా వివాహం చేసుకున్నారు. 20 రోజుల పాటు వారిద్దరూ అక్కడే హాయిగా గడిపారు. కానీ ఎక్కువ కాలం అక్కడే ఉండలేమని అర్థం చేసుకుని ఈనెల 26వ తేదీన ఇంటికి తిరిగి వచ్చారు. మరోవైపు మైనర్ బాలిక కనిపించకుండా పోయిన వెంటనే ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి పోలీసులు సైతం వీరిని వెతుకుండగా.. 26వ తేదీన గ్రామంలోకి వచ్చి వెంటనే మహిళ సహా ఆమె భర్త, మరదలిని అదుపులోకి తీసుకున్నారు. అయితే కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు మైనర్ బాలికను వారికి అప్పగించి క్రితి, ఆమె భర్త కృష్ణను జైల్లోనే పెట్టారు.తనకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని, వద్దని ఎంత చెబుతున్నా వినకుండా భార్యే ఈ దారుణానికి ఒడిగట్టిందని కృష్ణ పోలీసులకు వివరిస్తున్నారు. మరోవైపు మైనర్ బాలిక తల్లిదండ్రులు.. వరుసకి వదినా మరదళ్లు అవుతారు కాబట్టి స్నేహంగా ఉన్నారనుకున్నామని.. ఇలాంటి బంధం ఉందని తెలిస్తే ఇంట్లోకి కూడా రానిచ్చే వాళ్లం కాదని వెల్లడించారు.

# రండి.. కశ్మీర్ లో పర్యటిద్దాం



**శ్రీనగర్--నవభూమి:**కశ్మీర్ – భూతల స్వర్గం. భారతదేశానికి గర్వకారణం. ప్రతి భారతీయుడు కనీసం ఒక్కసారైనా సందర్శిం చాలని కలలు కనే ప్రాంతం. దాని అందమైన లోయలు, మంచుతో కప్పబడిన శిఖరాలు, ప్రశాంతమైన సరస్సులు లక్షలాది పర్యాటకులను ఆకర్షిస్తాయి. అయితే, ఈ అందమైన నేలపై ఇటీవల పహల్ గాం వద్ద జరిగిన ఉగ్రవాద దాడి మరోసారి అలజడి సృష్టించింది. అమాయక పర్యాటకులను, స్థానికులను లక్ష్యంగా చేసుకుని జరిపిన ఈ అకృత్యం, కశ్మీర్ లో శాంతిని, స్థిరత్వాన్ని దెబ్బతీయాలనే ఉగ్రవాదుల దుష్ట పన్నాగాలను మరోసారి బయటపెట్టింది. ఈ దాడి తర్వాత, భయం కారణంగా వేలాది మంది పర్యాటకులు కశ్మీర్ ను విడిచివెళ్లారు. అనేక మంది తమ ప్రయాణ ప్రణాళికలను, టికెట్లను రద్దు చేసుకున్నారు.దీంతో కశ్మీర్ పర్యాటక రంగం ఒక్కసారిగా కుదేలయ్యే పరిస్థితి ఏర్పడింది. ఉగ్రవాదుల కుట్ర పర్యాటకంపైనే! వేసవి కాలం కశ్మీర్ కు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే సమయం. ఏడాది పొడవునా ఎదురుచూసే ఈ సీజన్ లోనే స్థానిక ప్రజలకు ఆదాయం, ఉపాధి లభిస్తాయి. పహల్ గాం, గుల్ మార్గ్, శ్రీనగర్ వంటి ప్రాంతాల్లో హెూటళ్లు, షికారాలు, టాక్సీ డ్రైవర్లు, హ్యాండీక్రాఫ్ట్ అమ్మేవారు... ఇలా లక్షలాది మంది స్థానికులు పూర్తిగా పర్యాటకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కశ్మీర్ లో పర్యాటకం వృద్ధి చెందితేనే ఆ ప్రాంతం ఆర్థికంగా బలపడుతుంది, అభివృద్ధి చెందుతుంది. కేంద్రాన్ని సూటిగా కోరిన సుప్రీంకోర్టు కానీ, ఉగ్రవాదుల కుట్ర వేరే ఉంది. పర్యాటకాన్ని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా వారు కశ్మీర్ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చాలని చూస్తున్నారు. స్థానిక ప్రజలకు ఉపాధి లేకుండా చేసి, వారిని ఆర్థికంగా బలహీనపరిచి, వారిలో అసంతృప్తిని పెంచి, తిరిగి ఉగ్రవాద మార్గంలోకి లేదా పాకిస్తాన్ వైపు మళ్లించాలనేది వారి నీచమైన ఆలోచన. కశ్మీర్ ను భారతదేశం నుండి దూరం చేయడానికి, కశ్మీరీలను ఒంటరి చేయడానికి వారు చేస్తున్న ప్రయత్నాల్లో ఈ దాడులు ఒక భాగం. పర్యాటకుల రాకపోకలు తగ్గిపోతే, కశ్మీర్ ను వేరుచేయడం సులభం అవుతుందని వారు భావిస్తున్నారు. కశ్మీర్ మనది.. మనం వెళ్దాం! అయితే, ఉగ్రవాదుల ఈ కుట్రను భారత ప్రజలు తిప్పికొట్టడానికి సిద్ధమవుతున్నారు. దేశ ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఒక నూతన స్ఫూర్తి వెల్లువెత్తుతోంది. ఉగ్రవాదులకు భయపడి మనం ఎందుకు వెనక్కి తగ్గాలి? కశ్మీర్ మన భూతల స్వర్గం... దాన్ని సందర్శించే హక్కు మనకుంది. మన సోదర సోదరీమణులైన కశ్మీరీలకు అండగా నిలబడాల్సిన బాధ్యత మనకుంది. ఈ స్ఫూర్తికి నిదర్శనంగా నిన్ననే బాలీవుడ్ నటుడు అతుల్ కులకర్ణి ఒక బలమైన సందేశాన్ని పంపారు. ఉగ్రదాడి జరిగిన అదే పహల్ గాం ప్రాంతాన్ని సందర్శించి, ఉగ్రవాదులకు భయపడబోమని చాటిచెప్పారు. పర్యాటకులకు ధైర్యాన్ని నింపడానికి, కశ్మీరీల ఉపాధికి మద్దతుగా నిలవడానికి ఆయన ఈ సాహసోపేతమైన అడుగు వేశారు. ఆయన తన సందేశంలో ఉగ్రవాదానికి భయపడేది లేదని కశ్మీర్ ను సందర్శించాలని మన నేలను మనం కాపాడుకోవాలని.. కశ్మీరీలకు మనం ఉపాధి చూపించాలంటూ పిలుపునిచ్చాడు. "కశ్మీర్ అద్భుతమైన ప్రదేశం. అక్కడి ప్రజలు ఎంతో మంచివారు. ఉగ్రవాదుల భయానికి తలొగ్గి పర్యాటకాన్ని ఆపేస్తే, అది ఉగ్రవాదులకు మనం దొరికిపోయినట్లే. మనం ఉగ్రవాదుల మీద పోరాటం ఆపకూడదు, అదే సమయంలో కశ్మీర్‌కు మద్దతుగా నిలబడాలి. దేశ ప్రజలంతా కశ్మీర్‌ను సందర్శించి, అక్కడి ప్రజలకు అండగా ఉన్నామని చాటాలి" అని అతుల్ కులకర్ణి స్పష్టం చేశారు. తాను ఇకముందు కూడా కశ్మీర్‌ను సందర్శిస్తూనే ఉంటానని ఆయన తెలిపారు.అతుల్ కులకర్ణి చర్య కేవలం ఒక పర్యటన కాదు.., అది ఒక బలమైన ప్రతిఘటన. ఉగ్రవాదంపై, భయంపై ఆయన వేసిన అడుగు. భయం, అభద్రతా భావంతో వెనుకడుగు వేస్తున్న సమయంలో, ధైర్యంగా ముందుకు వచ్చి కశ్మీర్ ప్రజలకు సంఘీభావం తెలపడం ఆయన గొప్ప మనస్సుకు, పట్టుదలకు నిదర్శనం. కశ్మీర్ పర్యాటక రంగాన్ని, తద్వారా అక్కడి ప్రజల జీవనోపాధిని కాపాడటం కూడా ఉగ్రవాదంపై పోరాటంలో ఒక భాగమేనని ఆయన తన చర్య ద్వారా చాటిచెప్పారు. అతుల్ కులకర్ణి సందేశం దేశవ్యాప్తంగా అనేక మందిని ప్రభావితం చేసింది. వేసవి సెలవుల్లో విదేశాలకు లేదా దేశంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లాలని ప్రణాళికలు వేసుకున్న చాలా మంది యువత ఇప్పుడు పునరాలోచనలో పడ్డారు. "కశ్మీర్ మన దేశంలో భాగం. ఉగ్రవాదులకు భయపడి మనం అక్కడికి వెళ్లకుండా ఉంటే, అది వారికి విజయం సాధించినట్లే అవుతుంది. మన ప్రజలను మనం ఒంటరి చేసినట్లే అవుతుంది" అని వారు బలంగా భావిస్తున్నారు. ఇప్పటికే ట్రిప్స్ ప్లాన్ చేసుకున్నవారు సైతం వాటిని ఎలాగూ రద్దు చేసుకోలేరు కాబట్టి, తదుపరి పర్యటన కశ్మీర్ కే వెళ్లాలని నిర్ణయించుకుంటున్నారు. దేశాన్ని ప్రేమించే ప్రతి పౌరుడు, కశ్మీరీలకు అండగా నిలబడాల్సిన అవసరాన్ని గుర్తించారు. మన పర్యటన ద్వారా స్థానిక ప్రజలకు ఆదాయం లభిస్తుంది, వారి వ్యాపారాలు పుంజుకుం టాయి, వేలాది మందికి ఉపాధి దొరుకుతుంది. హెూటళ్లు, రెస్టారెంట్లు కళకళలాడతాయి. ఇది కేవలం పర్యాటకమే కాదు, దేశ సమైక్యతకు, కశ్మీరీల ఆత్మస్థైర్యానికి మనం ఇచ్చే మద్దతుగా దేశ ప్రజలు, యువత భావిస్తున్నారు. – బలమైన సందేశం: మేము వెనక్కి తగ్గేది లేదు! భారత ప్రజలు, ముఖ్యంగా యువతరం ఒక బలంగా నిర్ణయించుకుంది. ఉగ్రవాదులు కాల్పులు జరిపి భయపెట్టాలని చూస్తారా? సరే, చూద్దాం... కానీ మేము భయపడబోము, వెనక్కి తగ్గబోము. కశ్మీర్ వెళదాం... దాని అద్భుతమైన అందాలను ఆస్వాదిద్దాం... అక్కడి ప్రజలతో మమేకమవుదాం... వారికి ఆప్యాయతను, మద్దతును అందిద్దాం. మన దేశాన్ని మనం కాపాడుకోవాలి. మన పర్యాటకాన్ని మనం బలోపేతం చేయాలి. ఉగ్రవాదుల ఆటలకు చెక్ పెడుతూ, కశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని, కశ్మీరీలకు దేశ ప్రజలు ఎల్లప్పుడూ అండగా ఉంటారని గట్టిగా చాటిచెప్పే సమయం ఆసన్నమైంది. రండి.. కశ్మీర్ లో పర్యటిద్దాం.. మన దేశానికి గర్వకారణంగా నిలుద్దాం!

## భారత్‌పై ఆంక్షలు.. లక్షలాది డాలర్లు నష్టపోతున్న పాకిస్థాన్..!



**శ్రీనగర్--నవభూమి:**పెహల్‌గామ్ దాడితో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ పై భారత్ పలు ఆంక్షలు విధించింది. అందుకు ప్రతిగా పాక్ సైతం భారత్‌ను దెబ్బతీయాలనే దురుద్దేశంతో పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అయితే, ఆ నిర్ణయాలు బెడిసికొట్టినట్లు తెలిసింది. పాక్ నిర్ణయాలు ఆ దేశానికే తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల లక్షలాది డాలర్ల ఆదాయానికి గండి పడింది. అదెలా అంటారా..?పెహల్‌గామ్ ఘటన అనంతరం పాకిస్థానపై భారత్ విధించిన ఆంక్షలకు ప్రతీకారంగా భారత్ నుంచి వచ్చే విమానాలకు ఆ దేశం తన గగనతలాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. ఆ ప్రభావం అంతర్జాతీయ విమాన సర్వీసులపై పడింది. ముఖ్యంగా ఢిల్లీ, ఇతర ఉత్తర ప్రాంత నగరాల నుంచి బయలుదేరే విమానాలు తాము చేరుకునే గమ్యస్థానాల దూరం పెరిగింది. విమాన ప్రయాణ సమయం, ఇంధన ఖర్చు పెరిగింది. అదే సమయంలో భారత్ విమానయాన సంస్థలతోపాటు పాక్ కూడా భారీగా నష్టపోతోంది.విమానాలు ఒక దేశ గగనతలం మీదుగా ప్రయాణించినప్పుడు ఆ దేశానికి 'ఓవర్‌ఫ్లైట్ ఫీజులు' చెల్లించాల్సి ఉంటుంది. పశ్చిమ దేశాలకు వెళ్లే భారత విమానాలు ఎక్కువగా పాకిస్థాన్ గగనతలాన్ని ఉపయోగిస్తుంటాయి. పాక్ గగనతలాన్ని వినియోగించుకున్నందుకు ఏటా మిలియన్ల డాలర్లు ఆ దేశానికి ఓవర్‌ఫ్లైట్ ఫీజుల కింద చెల్లిస్తుంటాయి. దీని ద్వారా పాక్‌కు ఏటా కోట్లాది డాలర్ల ఆదాయం సమకూరేది. తాజా ఆంక్షల వల్ల పాక్‌కు ఈ ఆదాయం నిలిచిపోనుంది. దాయాది దేశం ఏకంగా లక్షల డాలర్ల నష్టం చవిచూడాల్సి వస్తోంది. దీని ప్రభావం పాక్ ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా ఉంటుందని ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. మన దేశ విమానయాన రంగాన్ని దెబ్బతీయాలని తీసుకున్న ఈ నిర్ణయంతో పాక్ తన గోతిని తానే తవ్వుకున్నట్లైంది.పాకిస్థాన్ ఇలా భారత్ నుంచి వచ్చే విమానాలకు తన గగనతలాన్ని మూసివేయడం ఇదేమీ మొదటిసారి కాదు. జూలై 2019లో పుల్వామా ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్ తన గగనతలాన్ని మూసివేసింది. అప్పుడు దాదాపు 400 విమానాల రాకపోకలపై ప్రభావం పడింది. ఫలితంగా పాక్ 100 మిలియన్ డాలర్ల నష్టాన్ని చవిచూసింది. ప్రస్తుత చర్యతో పాక్ మరోసారి అలాంటి నష్టాలనే ఎదుర్కోవాల్సి వచ్చింది.పలు నివేదికల ప్రకారం.. పాకిస్థాన్ గగనతలం మీదుగా ప్రయాణించే బోయింగ్ 737 విమానాలు ఓవర్‌ఫ్లైట్ ఫీజుగా దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పెద్ద విమానాలకు ఈ ఫీజులు ఇంకా ఎక్కువగానే ఉంటాయి. తాజా నిర్ణయంతో ఓవర్ ఫ్లైట్ ఛార్జీల ద్వారానే పాకిస్థాన్ ప్రతిరోజూ దాదాపు $232,000 మేర నష్టపోతోందని అంచనా. దీనికి తోడు ల్యాండింగ్, పార్కింగ్ వంటి ఇతర ఛార్జీలతో కలిపి రోజువారీ నష్టం దాదాపు $ 300,000 వరకూ ఉంటుందని అంచనా. ఏది ఏమైనా భారత్‌ను దెబ్బతీయాలని తీసుకున్న ఈ నిర్ణయం పాక్‌కు తన వేలితో తన కంటినే పొడుచుకున్నట్లైంది.

## పాకిస్తానీలకు భారత్ ఎన్ని రకాల వీసాలు ఇచ్చేది?



**శ్రీనగర్--నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత ప్రభుత్వం పాకిస్తాన్ మీద కఠిన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పాకిస్తాన్ తో సార్క్ వీసాను తక్షణమే రద్దు చేసింది. మెడికల్ వీసా ఉన్నవారు మినహా ఏప్రిల్ 27 వరకు భారతదేశంలో ఉన్న పాకిస్తానీయులకు ఇదే చివరి తేదీ. ఇప్పుడు పాకిస్తానీయులు భారత్ నుంచి వెళ్లకపోతే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ఈ నేపథ్యంలో భారత్ పాకిస్తాన్‌కు ఎన్ని రకాల వీసాలు ఇచ్చేది. వాటిలో అత్యంత పవర్ ఫుల్ వీసా ఏది అనే విషయాలను తెలుసుకుందాం. గురువారం భారత ప్రభుత్వం కొన్ని ప్రత్యేక వర్గాల వారిని మినహాయించి.. మిగిలిన పాకిస్తాన్ పౌరులందరి వీసాలను ఏప్రిల్ 27నుంచి రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయంలో కేంద్ర మంత్రి అమిత్ షా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి ఈ ఆదేశాలను అమలు చేయాలని కోరారు.ఈ ఉత్తర్వులో సార్క్ వీసా, బిజినెస్ వీసా, వీసా ఆన్ అరైవల్, జర్నలిస్ట్ వీసా, మెడికల్ వీసా, ట్రాన్సిట్ వీసా, ఫిల్మ్ వీసా, పర్వతారోహణ వీసా, కాన్ఫరెన్స్ వీసా, విజిటర్ వీసా, స్టూడెంట్ వీసా, తీర్థయాత్ర వీసా, గ్రూప్ టూరిస్ట్ వీసా, పాకిస్తాన్‌లోని మైనారిటీ గ్రూప్ తీర్థయాత్ర వీసాలు వంటి మొత్తం 14 రకాల వీసాలను భారత్ పాకిస్తానీయులకు ఇచ్చేదని పేర్కొన్నారు. దేశం విడిచి వెళ్లే వారందరూ ఈ 12 వర్గాలకు చెందిన వారైతే నిర్ణీత సమయానికి భారత్ విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ చేశారు. సార్క్ వీసా ఉన్నవారికి శనివారం వరకు, మెడికల్ వీసా ఉన్నవారికి ఏప్రిల్ 29 వరకు గడువు విధించారు.ఈ అన్ని వీసాలలో సార్క్ వీసా అత్యంత పవర్ ఫుల్ గా పరిగణించబడేది. ఎందుకంటే ఈ వీసా సార్క్ దేశాలలోని సెలక్ట్ చేసిన పౌరులకు వీసా లేకుండా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పిస్తుంది. సార్క్ వీసా సాధారణంగా ఆ ప్రాంతంలో వీసా నుంచి మినహాయింపు పొందిన వారికి మాత్రమే ఇవ్వబడుతుంది. దీనిని 1992లో ప్రారంభించారు.

## తహవూర్ రాణా ఎన్ఐఏ కస్టడీ మరో 12 రోజులు పొడిగింపు



**న్యూఢిల్లీ-నవభూమి:** ముంబై 26/11 ఉగ్రదాడుల సూత్రధారి తహవూర్ రాణా ఎన్ఐఏ కస్టడీ ని మరో 12 రోజులు పొడిగించారు. ఇప్పటికే అతడికి విధించిన 18 రోజుల ఎన్ఐఏ కస్టడీ ముగియడంతో జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సోమవారం ఉదయం రాణాను ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టు లో హాజరుపర్చారు.ఇవాళ ఉదయం కట్టుదిట్టమైన భద్రత మధ్య రాణాను ఎన్ఐఏ హెడ్ క్వార్టర్స్ నుంచి పటియాలా హౌస్ కోర్టుకు తీసుకొచ్చారు. సీనియర్ న్యాయవాది దయాన్ క్రిష్ణన్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ నరేందర్ మాన్‌లు ఎన్ఐఏ తరపున వాదనలు వినిపించారు. ఢిల్లీ లీగల్ సర్వీస్ అథారిటీ నియమించిన న్యాయవాది పీయూష్ సచ్‌దేవ రాణా తరపున వాదనలు వినిపించారు.ముంబై ఉగ్రదాడి కుట్రదారు డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో తహవూర్ రాణాకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇద్దరూ కలిసి ఉగ్రదాడికి ప్రణాళిక రచించారు. దాడి అనంతరం అమెరికాకు పారిపోయిన రాణాను ఇటీవలే స్వదేశానికి రప్పించారు. భారత్ అప్పగించవద్దంటూ రాణా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను ఈ నెల 4న అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దాంతో అతడిని భారత్‌కు అప్పగించారు.కాగా భారత్‌లో అక్రమంగా చొరబడిన 10 ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తమ నరమేథం మొదలుపెట్టారు. రెండు లగ్జరీ హెూటళ్లు, రైల్వేస్టేషన్, జెవిస్ సెంటర్ ఇలా నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 60 గంటలపాటు సాగిన నరమేథంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు భద్రతాసిబ్బంది కూడా ఉన్నారు. భద్రతా బలగాల దాడిలో 9 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాది కసబ్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు. ఆ తర్వాత అతడికి ఉరిశిక్ష విధించారు.

## రైల్వే స్టేషన్ వద్ద మద్యం సేవించిన వ్యక్తులు.. అభ్యంతరం తెలిపిన రైల్వే పోలీస్‌పై దాడి

**భోపాల్-నవభూమి:** కొందరు వ్యక్తులు రైల్వే స్టేషన్ బయట బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించారు. ఇది చూసి రైల్వే పోలీస్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. పబ్లిక్ ప్లేస్‌లో మద్యం తాగవద్దని మందలించాడు. ఆగ్రహించిన ఆ యువకులు రైల్వే పోలీస్‌ను కొట్టారు. ఆయన యూనిఫామ్‌ను చించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత రాణి కమలాపాటి రైల్వే స్టేషన్ బయట పార్క్ చేసిన కారులో కొందరు వ్యక్తులు మద్యం సేవించారు.కాగా, గమనించిన ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) అధికారి నాజర్ దౌలత్ ఖాన్ ఆ వ్యక్తులను మందలించారు. అక్కడ మద్యం తాగవద్దని చెప్పారు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం ఇది ఘర్షణకు దారితీసింది. ఈ నేపథ్యంలో వాహనంలో ఉన్న రైల్వే పోలీస్ నాజర్ దౌలత్ ఖాన్‌పై వారు దాడి చేశారు. ఆయనపై పిడిగుద్దులు కురిపించారు. యూనిఫామ్ చించారు. మరో ఇద్దరు రైల్వే పోలీసులు ఆ వ్యక్తులను వారించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.మరోవైపు దాడి తర్వాత రైల్వే పోలీస్ నాజర్ దౌలత్ ఖాన్ నడుచుకుంటూ అక్కడి నుంచి వెళ్లారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ మంగళవారం 29 । ఏప్రిల్ । 2025



## అక్కినేని కోడలిని అంత మాట అనేశారేంటి.. సమంతని రెచ్చగొడుతుందా?

అక్కినేని మూడో తరం వారసుడు నాగ చైతన్య తొలుత సమంతని ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొన్నాళ్లు వారు బాగానే ఉన్నా ఊహించని విధంగా విడాకులు తీసుకొని పెద్ద షాక్ ఇచ్చారు. ఇక సమంత నుండి విడిపోయిన తర్వాత శోభిత ధూళిపాళ్లని వివాహం చేసుకున్నాడు చైతూ. పెళ్లైనప్పటి నుండి ఈ జంట సరదాగా షికార్లు కొడుతూ వైవాహిక జీవితాన్ని ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు. ఇక వారి ఎంజాయ్‌మెంట్‌కి సంబంధించిన ఫొటోలని కూడా అడపాదడపా షేర్ చేస్తూనే ఉన్నారు. అయితే ఆదివారం సరదాగా గడిపిన క్షణాలని నాగ చైతన్య తన సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఈ పిక్స్‌లో సమంతకి ఇష్టమైన హ్యాష్ డాగ్‌తో పాటు శోభిత కనిపించింది. దీంతో సోషల్ మీడియాలో రచ్చ మొదలైంది. సమంతని టార్చర్ చేయాలనే చైతూ ఈ ఫొటోస్ షేర్ చేశాడని, శోభిత కూడా హ్యాష్‌తో అందుకే ఫొటో దిగిందని కొందరు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నిజానికి సమంత ఎంతో ఇష్టపడి ఈ పెట్ డాగ్ తెచ్చుకుంది సమంత. చైతూ– సమంత భార్య భర్తలుగా ఉన్న సమయంలో ఈ పెట్ డాగ్‌తో వారిద్దరు సరదాగా గడిపారు. అలానే పలు ఫొటోలు దిగి వాటిని సోషల్ మీడియాలో కూడా షేర్ చేశారు. అయితే ఇప్పుడు సమంత స్థానంలో శోభిత కనిపించడంతో సామ్ అభిమానులు ఏ మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారు.



## హిట్ సెంటిమెంట్ పట్టేసిన శ్రీనిధి

తెలుగు రాష్ట్రాల్లో పుట్టి, ఇక్కడే పెరిగినప్పటికీ కొంతమంది ప్రీ రిలీజ్ ఈవెంట్లలో, ప్రెస్ మీట్లలో తెలుగులో కాకుండా ఇంగ్లీష్ లో మాట్లాడుతూ ఉంటారు. కానీ పక్క రాష్ట్రం నుంచి వచ్చిన హీరోయిన్లు మాత్రం తెలుగు భాష మీద, తెలుగు ఆడియన్స్ మీద ప్రేమతో కష్టపడి తెలుగు నేర్చుకుని మరీ స్పష్టంగా మాట్లాడాలని ట్రై చేసి, తెలుగులో మాట్లాడి ఇంప్రెస్ చేస్తున్నారు. ఇప్పుడు శ్రీనిధి శెట్టి కూడా ఈ బాటలోనే వెళ్తుంది. కెజిఎఫ్ ఫ్రాంచైజ్ సినిమాల్లో హీరోయిన్ గా నటించిన శ్రీనిధి ఎలాంటి క్రేజ్ అందుకుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. సినిమాల్లోకి రాకముందు శ్రీనిధి మంచి స్టూడెంట్. టెన్త్ లో 98% మార్కులతో టాపర్ గా నిలిచిన అమ్మడు, కాలేజ్ లో కూడా టాపరేనట. చదువయ్యాక మోడలింగ్ లోకి అడుగుపెట్టి మిస్ కర్ణాటక కిరీటాన్ని అందుకున్న శ్రీనిధి ఆ తర్వాత హీరోయిన్ గా మారి మంచి సక్సెస్ ను, క్రేజ్ ను అందుకుంది. అలాంటి శ్రీనిధి ఇప్పుడు హిట్3 సినిమా ద్వారా టాలీవుడ్ కు ఎంట్రీ ఇస్తోంది. హిట్3 ప్రీ రిలీజ్ ఈవెంట్ లో శ్రీనిధి మాట్లాడిన స్పీచ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ ఈవెంట్ లో శ్రీనిధి ఆల్మోస్ట్ 10 నిమిషాలు మాట్లాడగా, అందులో ఎక్కువగా తెలుగే మాట్లాడింది. శ్రీనిధి స్పీచ్ లో మధ్యలో అక్కడక్కడా కొన్ని తప్పులున్నప్పటికీ తెలుగులోనే మాట్లాడాలనే శ్రీనిధి తపన ముందు ఆ తప్పులు ఎవరికీ పెద్దగా కనిపించలేదు. హిట్3 సినిమాతో తెలుగులోకి ఎంట్రీ ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని చెప్పిన శ్రీనిధి శెట్టి, నాని సర్ చాలా మంచి ప్రొడ్యూసర్ అని, వాల్ పోస్టర్ సినిమాస్ చాలా మంచి ప్రొడక్షన్ హౌస్ అని, నాని గారు, ప్రశాంతి గారు తనను ఎంతో బాగా చూసుకున్నారని చెప్పింది. ఇప్పటివరకు తాను హిట్3 కోసం నానితో కలిసి 30కి పైగా ఇంటర్వ్యూలిచ్చానని, మూడేళ్ల తర్వాత ఆడియన్స్ ముందుకు రావడం ఎంతో సంతోషంగా ఉండటంతో పాటూ ఎగ్జైటింగ్ గా ఉందని శ్రీనిధి చెప్పుకొచ్చింది. తాను కాలేజ్ లో ఉన్నప్పుడు నాని సినిమాలు ఎన్నో చూశానని, అప్పట్నుంచే నాని గారితో సినిమా చేయాలని కోరిక ఉండేదని, ఆ కోరిక ఇంత త్వరగా తీరుతుందనుకోలేదని, ఈ విషయంలో తాను చాలా గ్రేట్ గా ఫీలవుతున్నట్టు చెప్పిన శ్రీనిధి, మాట వరసకు నానిని నాని గారు అని పిలుస్తున్నానని కూడా చెప్పింది. ఇక రాజమౌళి గురించి మాట్లాడుతూ, తన మొదటి సినిమా కెజిఎఫ్ మూవీ ఆడియో లాంచ్ కు గెస్ట్ గా రాజమౌళినే వచ్చారని, ఇప్పుడు మళ్లీ హిట్3 కు కూడా మీరే వచ్చారని, కెజిఎఫ్ ఈవెంట్ కు కూడా సుమనే యాంకర్, ఈ సినిమాకు కూడా సుమనే యాంకర్ అని.. రాజమౌళి, సుమ, శ్రీనిధి ఈ కాంబినేషన్ మరోసారి రిపీట్ అయింది కాబట్టి, కెజిఎఫ్ లానే ఈ సినిమా కూడా హిట్ అవుతుందని శ్రీనిధి నమ్మకం వ్యక్తం చేసింది.





## నవ్వడం మర్చిపోవద్దు.. శోభిత అందమైన ప్రపంచం

తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న నటి శోభిత ధూళిపాళ్ల తన జీవిత ప్రయాణాన్ని అద్భుతమైన ఫొటో లెన్స్‌లో చూపిస్తూ ముందుకు సాగుతోంది. తన నటనతోనే కాదు, తన ఆలోచనా ధోరణితోనూ ఎంతో మంది అభిమానులను ఆకట్టుకుంటున్న ఈ మల్టీటాలెంటెడ్ బ్యూటీ, సోషల్ మీడియాలో వినూత్నమైన పోస్ట్‌లతో తన ప్రత్యేకతను చాటుతోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన ఫొటోలు చాలా లోతైన భావాలను అందిస్తున్నాయి. గ్రాస్ పచ్చగా ఉంటుందంటే, దానికి నీళ్లు పోయించాలి అనే సందేశాన్ని ఒక ఫొటోతో చెప్పారు. ఈ ఫొటోల్లో ఓ చోట మురిపెం లాంటి చిరునవ్వును గుర్తు చేస్తూ "నవ్వడం మర్చిపోవద్దు" అని రాసిన చిన్న నోట్ కనిపిస్తుంది. మరోచోట మహాకాళేశ్వరుడి విగ్రహాన్ని చూపిస్తూ ఆధ్యాత్మికతకూ తన అనుబంధాన్ని తెలియజేశారు. గ్రాస్ మీద



తలవాల్చి పడుకున్న ఫొటోలో శోభిత నిస్సహాయతను కాదు, ఒక ప్రశాంతతను, ఒంటరితనంలోనూ ఆనందాన్ని ప్రతిబింబించారు. అదే సమయంలో ఒక పుస్తకంలోని లోతైన వాక్యాలను పంచుకుంటూ, జీవితం మీద తనదైన ఆలోచనలను వ్యక్తం చేశారు. అలాగే నాగచైతన్యతో చిల్ అవుతున్న ఫొటోను కూడా ఆమె పోస్ట్ చేసి తన లైఫ్ లో ప్రేమ ఎంత ముఖ్యమో చెప్పకనే చెప్పేసింది. ఈ ఫొటోలు చూస్తే, ఆమె ఎంతగా తనలోని భావోద్వేగాలను అభిమానులతో పంచుకుంటుందో స్పష్టంగా అర్థమవుతుంది. ఇంకా, భీమా జువెల్స్ బ్రాండ్ అడ్వర్ట్ పోస్టర్‌లో ఆమె అందం, గ్రేస్ మరోసారి మెరిసిపోయాయి. ఒకవైపు పాశ్చాత్య ఫీలింగ్, మరోవైపు భారతీయ సాంప్రదాయం.. రెండింటినీ సమపాళ్లలో చూపించగలగడం శోభిత ప్రత్యేకత. ఒక్కో ఫ్రేమ్‌లో జీవితాన్ని ఎలా ప్రేమించాలో, చిన్న చిన్న విషయాల్లో సంతోషాన్ని ఎలా వెతుక్కోవాలో నేర్పుతోంది.

## పంచకట్టులో అదరగొట్టిన బాలయ్య..



పద్మ అవార్డుల ప్రదానోత్సవం రాష్ట్రపతి భవన్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ప్రముఖులు అవార్డులు అందుకున్నారు. దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి పద్మ విభూషణ్, నందమూరి బాలకృష్ణ పద్మభూషణ్ అందుకోగా.. మందకృష్ణ మాదిగ, కేఎల్ కృష్ణ, మాడుగుల నాగఫణి శర్మ, మిరియాల అప్పారావు, రాఘవేంద్రాచార్య పద్మశ్రీ పురస్కారాలు అందుకున్నారు. మరోవైపు నందమూరి బాలకృష్ణ తెలుగు సంప్రదాయ దుస్తులు పంచకట్టు ధరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**పద్మ భూషణ్ అవార్డు అందుకున్న బాలయ్య**

రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా సాగింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో పద్మ అవార్డు విజేతలంతా కుటుంబసమేతంగా వచ్చి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఏడుగురికి ఈ ఏడాది 'పద్మ' అవార్డులు దక్కాయి. వైద్య విభాగంలో దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్, సినీ రంగం నుంచి నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్, ప్రజా వ్యవహారాల విభాగంలో మందకృష్ణకు పద్మశ్రీ, విద్య, సాహిత్యం విభాగంలో కేఎల్ కృష్ణకు పద్మశ్రీ, కళారంగంలో మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ, కళారంగంలో మిరియాల అప్పారావుకు పద్మశ్రీ, విద్య, సాహిత్యం విభాగంలో రాఘవేంద్రాచార్యకు పద్మశ్రీ పుర్కస్కారాలు అందుకున్నారు.

పద్మ అవార్డులు దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటి. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అనే మూడు విభాగాలలో వీటిని ప్రదానం చేస్తారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, ప్రజా సేవ మొదలైన వివిధ విభాగాలు.. కార్యకలాపాల రంగాలలో ప్రతిభ కనబరచినవారికి ఈ అవార్డులు ఇస్తారు. అసాధారణమైన, విశిష్ట సేవలకు 'పద్మ విభూషణ్'ను ప్రదానం చేస్తారు.

## అమ్మమ్మ చీరలో అందాల పూజా

తమిళ్ మూవీ 'ముగమూడి'తో 2012లో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ పూజా హెగ్డే. ఆ సినిమా నిరాశపరచిన నటిగా గుర్తింపు తెచ్చి పెట్టింది. తెలుగులో ఈమె 2014లో ఒక లైలా కోసం, ముకుందా సినిమాల్లో నటించింది. ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద కమర్షియల్ విజయాలను అందుకోవడంలో విఫలం అయ్యాయి. అయినా కూడా నిరాశ పడకుండా సినిమా ఇండస్ట్రీలో ప్రయత్నాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుంది. 2010 మిస్ యూనివర్స్ ఇండియా అందాల పోటీల్లో రెండవ రన్నరప్‌గా నిలవడంతో సినిమా ఇండస్ట్రీలో మంచి ఆఫర్లు దక్కాయి. తెలుగులో ఈమె అత్యధిక యంగ్ స్టార్ హీరోలతో సనిమాలు చేసిన ఘనత దక్కించుకుంది. ఈమధ్య కాలంలో టాలీవుడ్‌లో పూజా హెగ్డేకి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. ఒకానొక సమయంలో ఈమె చేతిలో ఒక్క సినిమా కూడా లేదు. ఏడాది గ్యాప్ తర్వాత కోలీవుడ్‌లో బిజీ అయిం ది. ప్రస్తు తం ఈమె హిందీతో పాటు, తమిళ్ సినిమా ఇండస్ట్రీలో వరుస సినిమాలు చేస్తోంది. ఈమె నటించిన తాజా చిత్రం 'రెట్రో' విడుదలకు సిద్ధం అయింది. తమిళ్ స్టార్ హీరో సూర్య నటించిన రెట్రో సినిమాను మే 1న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నారు. రెట్రో సినిమా ప్రమోషన్‌లో భాగంగా రెట్రో లుక్‌తో పూజా హెగ్డే అలరిస్తోంది. ఇటీవల పూజా హెగ్డే ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షించాయి. చీర కట్టులో పూజా హెగ్డే లుక్‌కి మంచి రెస్పాన్స్ దక్కింది. 70 ఏళ్ల క్రితం చీర అంటూ తన అమ్మమ్మ చీరను పూజా హెగ్డే కట్టుకుని ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. ఈ మధ్య కాలంలో వింటేజ్ లుక్ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. అందుకే పూజా హెగ్డే కూడా తన అందమైన వింటేజ్ లుక్‌ను షేర్ చేసింది. తన అమ్మమ్మ చీరును ధరించడంతో పాటు, ఈతరం అమ్మాయిల మాధిరిగా స్టైలిష్ మేకోవర్‌తో సింపుల్ హెయిర్ స్టైల్‌తో చూపు తిప్పుకోనివ్వకుండా అందంగా ఉంది. చీర కట్టుకు తగ్గట్లుగా సిగ్గు పడుతూ, అందంగా పూజా హెగ్డే ఈ ఫోటోల్లో కనిపిస్తుంది. అందమైన పాత చీరకు తోడు, విభిన్నమైన బ్లౌజ్‌ను పూజా హెగ్డే ధరించడం ద్వారా అందరి చూపు తన వైపు తిప్పుకుంది. ఇంత అందంగా ఉన్న పూజా హెగ్డే టాలీవుడ్‌లో మరిన్ని సినిమాలు చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. టాలీవుడ్‌లో అల్లు అర్జున్‌తో కలిసి నటించిన డీజే, అల వైకుంఠపురంలో సినిమాలతో భారీ విజయాలను సొంతం చేసుకున్న ఈమె ఎన్టీఆర్‌తో అరవింద సమేత సినిమలో నటించిన విషయం తెల్సిందే. ప్రస్తుతం ఈమె రెట్రో సినిమాతో పాటు రజనీకాంత్ నటించిన కూలీ సినిమాలోని ఐటెం సాంగ్‌తో కనిపించబోతుంది. ఇక విజయ్ హీరోగా నటిస్తున్న చివరి మూవీ జన నాయగన్ లోనూ పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. రాఘవ లారెన్స్ దర్శకత్వంలో రూపొందుతున్న కాంచన ఫ్రాంచైజీ మూవీ కాంచన 4లో పూజా హెగ్డే నటిస్తోంది. నాలుగు తమిళ్ సినిమాలు, ఒక హిందీ సినిమా చేస్తున్న ఈమె త్వరలోనే తెలుగులోనూ రీ ఎంట్రీ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.



## సమంత శుభం కంటెంట్ కు రానా ఫిదా



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత 38వ పుట్టినరోజు సందర్భంగా అందరినీ సర్ప్రైజ్ చేసింది. ఈ స్పెషల్ డే సందర్భంగా తన తొలి నిర్మాణ ప్రాజెక్ట్ 'శుభం' ట్రైలర్‌ని విడుదల చేసి ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్ ఇచ్చింది. 'త్రలల మూవింగ్ పిక్చర్స్' బ్యానర్‌పై సమంత నిర్మిస్తున్న ఈ సినిమాకు ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గరయ్యేలా మృదువైన కథాంశంతో షుభం సినిమా రూపుదిద్దుకుంది. హనుమాన్ హీరో తేజ సజ్జా, టాలెంటెడ్ డైరెక్టర్ నందిని రెడ్డి ఇప్పటికే శుభం ట్రైలర్‌ను ప్రశంసించారు. ట్రైలర్‌లో కనిపించిన ఫీల్ గుడ్ మూడ్, భావోద్వేగం అందరినీ ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా భావోద్వేగాలతో ముడిపడిన కథాంశాన్ని సమంత చాలా చక్కగా ఎంపిక చేసిందని సినీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. నిర్మాతగా ఆమెకు మంచి టేస్ట్ ఉందని ట్రైలర్ చూపించింది. ఈ హడావుడిలో టాలెంటెడ్ హీరో రానా దగ్గుబాటి కూడా రంగంలోకి దిగాడు. శుభం ట్రైలర్‌ను షేర్ చేస్తూ, "గుడ్ లక్ ఫోక్స్, ఇది ఫన్!" అంటూ సోషల్ మీడియా వేదికగా మద్దతు తెలిపాడు. రానా మాటలకు సమంత కూడా ఆనందంగా స్పందించింది. "థాంక్యూ రానా" అంటూ సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఇద్దరి మధ్య ఉన్న స్నేహం టాలీవుడ్ బ్రదర్‌హుడ్‌కు చక్కటి ఉదాహరణగా నిలిచింది. 'శుభం' సినిమా మే 9న విడుదలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వచ్చిన స్పందనతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఒక వైపు నిర్మాతగా, మరోవైపు నటిగా సమంత కొత్త ప్రయాణానికి శ్రీకారం చుడుతోంది. ఈ సినిమా విజయం సమంతకు కొత్త విజయాలు తెచ్చిపెట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక సమంత తరువాతి సినిమాల అప్‌డేట్స్ కోసం కూడా ప్రేక్షకులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇక చివరగా ఆమె ఖుషి సినిమాలో విజయ్ దేవరకొండ సరసన నటించిన విషయం తెలిసిందే. ఆ తరువాత పలు ఆఫర్స్ వచ్చినా కూడా సామ్ పెద్దగా ఆసక్తి చూపలేదు. కంటెంట్ ఎంతో కొత్తగా ఉంటే గాని సినిమాలు చేయకూడదు అని ఆమె ఫిక్స్ అయినట్లు టాక్. ఇక నెక్ట్స్ బాలీవుడ్ లోనే ఒక సినిమా చేయనున్నట్లు సమాచారం.

## పెళ్లెప్పుడో చెప్పిన విశ్వక్ సేన్.. వెయిటింగ్ అంటున్న ఫ్యాన్స్



టాలీవుడ్ యంగ్ హీరో విశ్వక్ సేన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఇతనిని చూస్తే యాటిట్యూడ్ ఎక్కువ అని చాలా మంది అనుకుంటారు. పలు వివాదాలలో కూడా విశ్వక్ యాటిట్యూడ్ చూపించాడు అని కొందరు చెప్పుకొస్తుంటారు. అయితే మంచి టాలెంట్ ఉన్న విశ్వక్ సేన్ ఎందుకో సూపర్ హిట్స్ అందుకోలేకపోతున్నాడు. చివరిగా 'లైలా' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పొందింది. ఈ సినిమా కోసం విశ్వక్ సేన్ చాలా కష్టపడ్డాడు. ప్రమోషన్స్ కూడా గట్టిగానే చేశాడు. అయిన ఫలితం మారలేదు. ఈ సారి మాత్రం గట్టి హిట్ కొట్టాలనే కసి మీద ఉన్నాడు. లైలా సినిమా ఫెయిల్యూర్ తర్వాత విశ్వక్ సేన్ పెద్దగా కనిపించింది లేదు. తాజాగా నేచురల్ స్టార్ నాని నటించిన 'హిట్ 3' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి హజరై అదిరిపోయే స్పీచ్ ఇచ్చాడు. హిట్ ఫ్రాంచైజీ ఫస్ట్ పార్ట్‌లో విశ్వక్ సేన్ నటించిన నేపథ్యంలో హిట్ 3 ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ఆహ్వానించారు. ఆయన్ను సుమ సరదాగా ఇంటరాగేషన్ చేశారు. ఆఫీసర్‌నే ఇంటరాగేషన్ చేస్తారా? అంటూ సుమను ప్రశ్నించాడు విశ్వక్.. ఇప్పుడు ఆఫీసర్ అర్జున్ సర్కార్ కదా.. అని సుమ అనడంతో దీనికి 'మా తెలంగాణ బ్రాంచ్‌లో నేనే కదా ఆఫీసర్‌ను' అని విశ్వక్ సరదాగా కామెంట్ చేశారు. 'అర్జున్ సర్కార్, విక్రమ్‌లో లేని క్వాలిటీ ఏంటి అని మీరు అనుకుంటున్నారు.' అన్న ప్రశ్నకు విశ్వక్.. 'ఫిట్టింగ్ ఇది. ఇద్దరిలో ఉండే ప్రశాంతత. కామ్ నెస్ అంటూ సమాధానం ఇచ్చారు. ఈ మధ్యే నా వయస్సు 30కి చేరుకుందని , ఇప్పుడు కాస్త స్పీడ్ తగ్గించి కూల్ గా ఉండేందుకు ప్రయత్నిస్తున్నాను. ఊరికే అటు ఇటు పరిగెడుతూ ఉన్నా.. ఇప్పటి నుంచి అది తగ్గిపోతుందని అని చెప్పారు.

## షాహిద్ అఫ్రిది ఓ జోకర్.. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు..!



పహల్గాం దాడిపై ఘటనపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. అతడో జోకర్ అంటూ తీవ్రంగా స్పందించారు. ఓ విలేకరి షాహిద్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఒవైసీ సమాధానమిస్తూ.. అతనెవరు ? ఇది ఒక డ్రామా. నా ఎదుట జోకర్ల పేర్లను ఎందుకు తీసుకువస్తున్నారంటూ' వ్యాఖ్యానించారు. దేనికి పనికి రానివాళ్ల గురించి మాట్లాడడం దండగ అంటూ చురకలంటించారు. పాకిస్తాన్‌ను ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ 'గ్రే లిస్ట్'లో ఉంచాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో నిర్ణయించుకోవాలన్నారు. పాకిస్తాన్‌ను మళ్లీ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో పెట్టాలన్నది తన డిమాండ్ అని.. ఇది అవసరమన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచుతోందని మండిపడ్డారు. అయితే, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై పాకిస్తాన్ మాజీ కెప్టెన్ భారత్‌పై విషం కక్కాడు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని.. పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వదని చెప్పాడు. పాకిస్తాన్‌పై నిందలు వేకుండా దాడి ఉగ్రదాడికి సంబంధించి సాక్ష్యాలను చూపాలని విమర్శించారు. భారత్ తనను తానే నిందించుకోవాలని.. అక్కడ పటాకులు పేలినా.. పాకిస్తాన్‌పై నిందలు వేయాలంటూ నోటికి వచ్చినట్లుగా మాట్లాడాడు. అలాగే, భారత మీడియాపై అక్కసును వెళ్లగక్కాడు. దాడి జరిగిన గంటలోపే మీడియా బాలీవుడ్‌గా మారడం ఆశ్చర్యకరమని.. ప్రతిదీ బాలీవుడ్‌గా మార్చొద్దని.. మీడియా చెప్పే విషయాలను చూసి ఆశ్చర్యపోయానంటూ వ్యాఖ్యానించాడు. ప్రతీ టీవీ చానెల్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండానే పాకిస్తాన్‌ను నిందిస్తున్నారన్నాడు. అంతటితో ఆగకుండా భారత సైన్యం గురించి సైతం అసంబద్ధమైన, నిరాధారమైన వ్యాఖ్యలు చేశాడు.

## షాహిద్ అఫ్రిది ఓ జోకర్.. ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యలు..!



పహల్గాం దాడిపై ఘటనపై పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. అతడో జోకర్ అంటూ తీవ్రంగా స్పందించారు. ఓ విలేకరి షాహిద్ అఫ్రిది చేసిన వ్యాఖ్యలపై అడిగిన ప్రశ్నకు ఒవైసీ సమాధానమిస్తూ.. అతనెవరు ? ఇది ఒక డ్రామా. నా ఎదుట జోకర్ల పేర్లను ఎందుకు తీసుకువస్తున్నారంటూ' వ్యాఖ్యానించారు. దేనికి పనికి రానివాళ్ల గురించి మాట్లాడడం దండగ అంటూ చురకలంటించారు. పాకిస్తాన్‌ను ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ 'గ్రే లిస్ట్'లో ఉంచాలని ఒవైసీ డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏమి చేయాలో.. ఏమి చేయకూడదో నిర్ణయించుకోవాలన్నారు. పాకిస్తాన్‌ను మళ్లీ ఎఫ్ఏటీఎఫ్ గ్రే లిస్ట్‌లో పెట్టాలన్నది తన డిమాండ్ అని.. ఇది అవసరమన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచుతోందని మండిపడ్డారు. అయితే, పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై పాకిస్తాన్ మాజీ కెప్టెన్ భారత్‌పై విషం కక్కాడు. ఇస్లాం శాంతిని బోధిస్తుందని.. పాకిస్తాన్ ఉగ్రవాదానికి మద్దతు ఇవ్వదని చెప్పాడు. పాకిస్తాన్‌పై నిందలు వేకుండా దాడి ఉగ్రదాడికి సంబంధించి సాక్ష్యాలను చూపాలని విమర్శించారు. భారత్ తనను తానే నిందించుకోవాలని.. అక్కడ పటాకులు పేలినా.. పాకిస్తాన్‌పై నిందలు వేయాలంటూ నోటికి వచ్చినట్లుగా మాట్లాడాడు. అలాగే, భారత మీడియాపై అక్కసును వెళ్లగక్కాడు. దాడి జరిగిన గంటలోపే మీడియా బాలీవుడ్‌గా మారడం ఆశ్చర్యకరమని.. ప్రతిదీ బాలీవుడ్‌గా మార్చొద్దని.. మీడియా చెప్పే విషయాలను చూసి ఆశ్చర్యపోయానంటూ వ్యాఖ్యానించాడు.

## ఐపీఎల్ 2025 పాయింట్ల పట్టికలో ఆర్‌సీబీ అగ్రస్థానం.. టైటిల్ కల సాకారమవుతుందా



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువడంతో సంతోషపడుతున్నారు. అంతేకాదు ఈ సీజన్ టైటిల్ కూడా ఆర్‌సీబీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. నిన్న ఢిల్లీ క్యాపిటల్స్ పై గెల్చిన తర్వాత ఆర్‌సీబీ 10 మ్యాచ్‌లలో 7 విజయాలతో 14 పాయింట్లు సాధించింది. ఈ క్రమంలో ఆర్‌సీబీ, ం0.521 నెట్ రన్ రేట్‌తో దూసుకెళ్తోంది. రజత్ పటీదార్ నాయకత్వంలో, విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, జోష్ హాజిల్‌వుడ్ వంటి స్టార్ ఆటగాళ్లతో కూడిన ఈ జట్టు, ఈసారి కప్పు కొట్టాలని గట్టి పట్టుదలతో ఉంది. మార్చి 22న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన తొలి మ్యాచ్ నుంచి ఆర్‌సీబీ జోరు చూపిస్తోంది. చెన్నై సూపర్ కింగ్స్‌ను చెపాక్‌లో ఓడించడం, ముంబై ఇండియన్స్‌ను వాంఖడేలో మట్టికరిపించడం, రాజస్థాన్ రాయల్స్‌పై సొంతగడ్డపై తొలి విజయం సాధించడం వంటి ఘనతలతో ఆర్‌సీబీ అభిమానులను ఉర్రూతలూగించింది. ఏప్రిల్ 24న రాజస్థాన్ రాయల్స్‌పై 11 పరుగుల తేడాతో సాధించిన విజయం ఆర్‌సీబీని పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేర్చింది. తాజా మ్యాచ్‌లలో వరుస విజయాలతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**